# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 8 | మే 2024 | వెల : రూ.15

కమలానికి ఓటు.. అందరికీ చేటు

హోదా ఎగ్గొట్టిన మోదీని రాష్ట్ర ప్రజలు సమర్థిస్తారా?

మోదీ టోపీలో ముగ్గురు సామంతులు

ఈ 'ఓట్ల పండుగ' ఓటర్లదేనా?

నేతల భావ దారిద్ర్యం.. ఓటర్ల ఉదాసీనత

కాంగ్రెస్ మానిఫెస్టో : మోదీ కొత్త భాష్యం!

కాగితం పులి కళ్ళలో భయం

అక్రమాల పుట్ట ఎన్నికల బాండ్ల కుంభకోణం

అయోమయంలో భారత ఆర్థిక వ్యవస్థ!

ఒప్పులకుప్ప ఒడిలో మీడియా!

పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు!

నిరసనలో పెద్దలకు దారి చూపిస్తున్న పిల్లలు

అద్వితీయ దార్శనికుడు, మానవతావాది కార్ల్ మార్క్స్

లెనిన్ నేడు లేడూ, చూడు జనంలో ఉన్నాడు !

మేడే చరిత్ర - విజయవాడలో పుస్తకావిష్కరణ

పోరాటపథంలో ఎచ్చెన్ జీవనయానం

'అష్ట వంకర్ల నవ భారతం

మే - 2024 పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 8


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1). కమలానికి ఓటు.. అందరికీ చేటు
- సంపాదకీయం 3
2) హెూదా ఎగ్గొట్టిన మోదీని రాష్ట్ర ప్రజలు సమర్థిస్తారా? - టి.లక్ష్మీనారాయణ 4
3) మోదీ టోపీలో ముగ్గురు సామంతులు
- సవ్యసాచి 13
4) ఈ 'ఓట్ల పండుగ' ఓటర్లదేనా?
- రాజ్‌దీప్ సర్దేశాయి 14
5) నేతల భావ దారిద్ర్యం.. ఓటర్ల ఉదాసీనత
- ఎ.కృష్ణారావు 16
6) కాంగ్రెస్ మానిఫెస్టో : మోదీ కొత్త భాష్యం!
- పి.చిదంబరం 18
7) కాగితం పులి కళ్ళలో భయం
- అశోక్ కుంబము 20
8) అక్రమాల పుట్ట ఎన్నికల బాండ్ల కుంభకోణం - ఎన్.వేణుగోపాల్ 22
9) అయోమయంలో భారత ఆర్థిక వ్యవస్థ!
- శ్రీపాద మోతీరాం, వకుళాభరణం వంశీ 26
10) ఒప్పులకుప్ప ఒడిలో మీడియా! - ప్రొ. పద్మజ షా 28
11) పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు! - పి.ప్రసాద్ 29
12) నిరసనలో పెద్దలకు దారి చూపిస్తున్న పిల్లలు - కేశవ్ 31
13) అద్వితీయ దార్శనికుడు, మానవతావాది కార్ల్ మార్క్స్ - అబ్బాస్ 33
14) లెనిన్ నేడు లేడూ, చూడు జనంలో ఉన్నాడు ! - ఎన్.వేణుగోపాల్ 34
15) మేడే చరిత్ర - విజయవాడలో పుస్తకావిష్కరణ 37
16) పోరాటపథంలో ఎచ్చెన్ జీవనయానం - మందలపర్తి కిషోర్ 38
17) 'అష్ట వంకర్ల నవ భారతం' - వి.విజయ్‌కుమార్ 40
18) కార్టూన్స్ 43
19) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM


**దారి దీపం**

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# కమలానికి ఓటు.. అందరికీ చేటు

మోదీ మాటలకు ఎంతటివారైనా దగా పడతారు. మొదటిసారి దగా పడితే అది మనకు తెలియక చేసిన తప్పు. అలాంటి తప్పు  ఎవరైనా చేయడం సహజం. రెండోసారి, మూడోసారి దగా చేసినా మళ్లీ మళ్లీ మోసపోవడానికి ఎవరైనా సిద్ధపడితే అది ఆత్మవంచన. అనాలోచితం. మన ఓటుతో మన కళ్లు పొడుచుకోవడం. మూడోసారి అలాంటి తప్పు మనం చేయకూడదు.

2014లో మోదీ కొన్ని హామీలు ఇచ్చారు. తిరుపతి సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తానన్నారు. విభజన హామీలు తు.చ. తప్పకుండా నెరవేరుస్తానన్నారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంట ఖర్చుకు పైన 50 శాతం మద్దతు ధర ఇస్తానన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలన్నారు. ప్రజలకు అచ్చేదిన్ తెస్తానన్నారు. 2019లో పాత వాగ్దానాలు పక్కనపెట్టి, హెూదాను హుళక్కి చేసి, విభజన హామీలను తుంగలోకి తొక్కి దేశాన్ని అభివృద్ధిమార్గంలో పరుగులు తీయిస్తానని, పేదరికం లేని భారత్‌ను నిర్మిస్తానని నమ్మబలికారు. మరోమారు మోసానికి దేశం గురైంది. 2024 ఎన్నికలలో వికసిత భారతం అంటూ కొత్త నినాదాన్ని మనకు చూపిస్తున్నారు. తమది పేదల ప్రభుత్వం అని ఒకటి రెండుసార్లు బుకాయిస్తున్నారు. ఇది మూడోసారి చేస్తున్న దగా. మరోసారి దగాపడి మోసపోవడం మన వంతు కాకూడదు.

ఆంధ్రప్రదేశ్‌లో మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాని రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వచ్చి పోతున్నారు. అనకాపల్లి బెల్లం తీపి అంటారు. తెలుగు భాష తేనెలొలుకు తీపి అంటారు. రాష్ట్ర ప్రజలకు మాత్రం తీపి మాట చెప్పడానికి నోరు రావడం లేదు. ఈ ప్రసంగాలలో పాత పంచాంగ ప్రవచనాలు తప్ప రాష్ట్రానికి అదనంగా ఇచ్చే పలుకు పలకడం లేదు.

కమలానికి ఓటు వేసే ముందు ఎవరికి వారు తమకు మోదీ ప్రభుత్వం చేసిన నిర్వాకం గురించి ఆలోచించాలి. జీఎస్టీ పేరుతో అన్ని ధరలు పెంచి మన ఆదాయాన్ని ఆయన ప్రభుత్వం లాగేసుకుంటున్నది. పెద్ద నోట్ల రద్దు తర్వాత అసంఘటిత రంగం కుదేలైంది. ఉన్న ఉపాధి పోయింది. నిజ జీతాలు పడిపోయాయి. అభివృద్ధి అదానీ, అంబానీల వంటి బిలియనీర్లకు దక్కింది. పేదల, సామాన్యుల జీవితాలు చిక్కిపోతున్నాయి. ఆకలి సూచీలో, మానవాభివృద్ధి సూచీలో, అంతరాల సూచీలో మనం అట్టడుగున వున్నాం. ఈ భారాన్ని సామాన్యులు మోస్తున్నారు. అయినా మోదీనే సమర్థిందామా ?

మీ గురించే కాదు మన రాష్ట్రం గురించి ఆలోచించండి. ప్రతీసారి చేసిన దగాను గుర్తుకు తెచ్చుకోండి. అయినా మళ్లీ మోదీనే సమర్థిద్దామా. దేశం గురించి ఆలోచించండి. ఓట్ల కోసం చేస్తున్న విద్వేష రాజకీయాన్ని విభజన రాజకీయాన్ని గుర్తు చేసుకోండి. డబుల్ ఇంజన్ సర్కార్ల పేరుతో పైనా కిందా మోదీనే కనిపించాలని, రాజకీయ ప్రత్యర్థులు లేని ప్రజాస్వామ్యంలో రాజరికాన్ని చూపిస్తున్న మోదీనే మళ్లీ ఎంచుకుందామా ? మన కోసం, మన రాష్ట్రం కోసం, మన దేశం కోసం ఆలోచించండి. కమలానికి మీరు వేసే ఓటు మనకు, మన రాష్ట్రానికి, మన దేశానికి చేటు. మీ ఓటుతో రాష్ట్రంలో బీజేపీని, దాని వంతదారులనీ ఓడించండి. ❑

- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977

# హోదా ఎగ్గొట్టిన మోదీని రాష్ట్ర ప్రజలు సమర్థిస్తారా?



- టి.లక్ష్మీనారాయణ

మోడీ ప్రభుత్వం అమలు చేసిన వినాశకర ఆర్థిక విధానాలు, మతోన్మాద అజెండా, నియంతృత్వ పోకడలతో సాగించిన అప్రజాస్వామిక పాలనపై నేను ఇందులో ప్రస్తావించడం లేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని, హక్కులతో సమానమైన అంశాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. వాటికి పరిమితమై, ఎన్నికల నేపథ్యంలో వాటిని చర్చనీయాంశం చేయాలన్నది నా ఆలోచన. చట్టంలో ఉన్న అంశాలను అమలు చేసి విభజనతో తీవ్రంగా నష్టపోయిన నేటి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేకూర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. 2024 జూన్ 4కు రాష్ట్ర విభజన జరిగి పదేళ్ళు పూర్తవుతాయి. పదేళ్ళ గడువు ముగిసింది కాబట్టి చట్టంలో ఉన్న అమలు కాని అంశాలు ప్రత్యేక తరగతి హోదా లాగే ముగిసిన అధ్యాయాలేనని మోడీ మళ్ళీ అధికారంలోకి వస్తే అనడని గ్యారంటీ లేదు. ఆంధ్రప్రదేశ్ న్యాయం కోసం రోధిస్తున్నది. "మరోమారు మోడీ సర్కారు" అంటున్న వారికి వినపడడం లేదా !

2014 ఎన్నికల ప్రచార సభల్లో మోడీ గారు ప్రసంగిస్తూ, "తల్లిదండ్రులను చంపి బిడ్డను వీధిన పడేశారని", ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను అభివర్ణించారు. ప్రధానమంత్రి అయిన తర్వాత కూడా పలు సందర్భాలలో పార్లమెంటులో మాట్లాడినప్పుడు కూడా అదే దోరణిలో వ్యాఖ్యలు చేశారు. కానీ, చెప్పిన మాటలు - చేసిన వాగ్దానాలు, అమరావతి రాజధానికి శంకుస్థాపన చేసిన నాటి నుంచే చేతల్లో చూపెట్టలేదు. ఆయనే పదేళ్ళుగా ప్రధానమంత్రిగా ఉన్నారు. దేశంలో ఆయనొక్కడే బలమైన నాయకుడని ఆయన మద్దతుదారులు ప్రగాఢంగా నమ్ముతున్నారు. పొగడ్తలతో పోటీ పడుతున్నారు. మోడీ గుళ్ళచుట్టూ, ఆయన భక్తులు ఆయన చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అధికారం మొత్తం ఆయన గుప్పిట్లోనే ఉన్నది. ప్రధానమంత్రి కార్యాలయమే "రిమోట్ కంట్రోల్". చూశాం కదా ! కేంద్ర మంత్రి మండలికి సహితం అలా సమాచారం ఇచ్చి, ఇలా పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు రాత్రి పూట ప్రకటించి, దేశ ప్రజలందరూ నిద్ర లేచేటప్పటికి పెద్ద నోట్లను చిత్తు కాగితాలుగా మార్చేశారు. అలాగే, గంటల వ్యవధిలోనే అనేక కీలకమైన చట్టాలను, పార్లమెంటులో చర్చే లేకుండా అమల్లోకి తెచ్చారు. అంతటి "బలమైన నాయకుడు" చట్టం మేరకు ఆంధ్రప్రదేశ్‌కు హక్కుగా రావలసిన వాటిని, ప్రత్యేక తరగతి హోదాను ఎందుకు ఇవ్వ నిరాకరించారో ! ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం ఎందుకు చేశారో ! చట్టాన్ని ఆమోదించిన పార్లమెంటు, ప్రత్యేక తరగతి హోదాపై ప్రధాన మంత్రి హామీ ఇచ్చిన రాజ్యసభ ఔన్నత్యాన్ని, వాటి పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రధాన మంత్రికి లేదా !

### చట్టంలో ఏముంది ! ఏం చేశారు !

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014, పదవ భాగంలోని ఉప శీర్షిక : మౌలిక సదుపాయాలు మరియు ప్రత్యేక ఆర్థిక చర్యలు కింద సెక్షన్ 93లో "రాష్ట్రాల పురోగతి - అభివృద్ధికి చర్యలు : కొత్త రాష్ట్రాల పురోగతి మరియు సుస్థిర అభివృద్ధికి 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర విభజన తేదీ నుండి పదేళ్ల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం తీసుకొంటుంది".

**షెడ్యూల్ 13 : మౌలిక సదుపాయాలు :** 1 .దుగ్గిరాజుపట్నం ఓడ రేవు, 2. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం, 3. ఐఓసీ లేదా హెచ్.పి.సి.ఎల్. ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, 4.ఢిల్లీ -ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ తరహాలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, 5.విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి, 6.రైల్వే జోన్, 7.ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నుంచి హైదరాబాదు మరియు తెలంగాణలోని ఇతర ముఖ్యమైన నగరాలకు వేగవంతమైన(రాపిడ్) రైలు మరియు రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, 8. విశాఖ పట్నం మరియు విజయవాడ-గుంటూరు-తెనాలి మెట్రో పాలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో మెట్రో రైలు సౌకర్యం కల్పించాలి.

**షెడ్యూల్ 13, సెక్షన్ 93, విద్య :** 12, 13వ పంచవర్ష ప్రణాళికా కాలంలో నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన విద్యా సంస్థల స్థాపనకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అవి: 1.ఐఐటీ, 2.నిట్, 3.ఐఐఎం, 4.ఐఐఎస్ఈఆర్, 5.కేంద్ర విశ్వవిద్యాలయం,6.పెట్రోలియం విశ్వ విద్యాలయం, 7.వ్యవసాయ విశ్వ విద్యాలయం, 8.ఐఐఐటీ, 9. ఎయిమ్స్ తరహా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కమ్-టీచింగ్ ఇన్ స్టిట్యూట్, 10.గిరిజన విశ్వవిద్యాలయం 11.నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్.

**సెక్షన్ - 94 :** (1) రెండు రాష్ట్రాల్లో పారిశ్రామికీకరణ, ఆర్థిక

వృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త రాష్ట్రాలకు పన్ను ప్రోత్సాహకాలు అందించడంతో సహా తగిన ఆర్థిక చర్యలు తీసుకోవాలి. (2) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుంది. భౌతిక మరియు సామాజిక మౌలిక సదుపాయాల విస్తరణకు తోడ్పాటును అందిస్తుంది. (3) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలి. అందులో భాగంగా ప్రభుత్వ సచివాలయం, శాసనసభ, శాసనమండలి, రాజ్ భవన్, హైకోర్టు కోర్టుతో సహా మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సహాయం అందించాలి.

## ఎగ్గొట్టిన జాబితాలో మొదటిది ప్రత్యేక తరగతి హోదా

కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఆర్థిక వ్యవస్థను బలమైన పునాదులపై నిర్మించుకోవడానికి ప్రత్యేక తరగతి హోదా (స్పెషల్ క్యాటగరీ స్టేటస్)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కల్పిస్తామని నాటి ప్రధాన మంత్రి డా.మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో వ్రాత పూర్వక ప్రకటన చేశారు. ప్రముఖ ఆర్థికవేత్తగా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఆయన ప్రత్యేక తరగతి హోదాకు విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కున్న అర్హత, వనగూడే ప్రయోజనాలపై అవగాహనతోనే ఆ వాగ్దానం చేశారు. ఐదేళ్ళు కాదు పదేళ్ళిస్తే తప్ప పారిశ్రామిక వర్గాలు ముందు కొచ్చి, పరిశ్రమలకు అనుమతులు పొంది, పెట్టుబడులు పెట్టి, పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్ట లేరని యం.వెంకయ్య నాయుడుగారు పూర్తి అవగాహనతోనే నాడు రాజ్యసభలో మాట్లాడారు కదా!

ప్రత్యేక హోదాకు, ప్రత్యేక తరగతి హోదాకు మధ్య తేడా ఉన్నది. పార్లమెంటులో 3/4 వంతు మెజారిటీతో ఆమోదించి ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూ కాశ్మీర్‌కు ప్రసాదించినది "ప్రత్యేక హోదా". దాన్ని మోడీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి, 3/4 వంతు మెజారిటీతో ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదముద్రతో రద్దు చేశారు. పార్లమెంటుతో సంబంధం లేకుండానే కేంద్ర మంత్రి మండలి ఆమోదంతో ప్రభుత్వం ఉత్తర్వుల ద్వారా ప్రత్యేక తరగతి హోదాను ఇవ్వవచ్చు. డా. మన్మోహన్‌సింగ్ మంత్రివర్గం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకొన్నది. అమలు ప్రక్రియ మొదలు పెట్టడానికి ప్రణాళికా సంఘానికి పంపారు. జాతీయ అభివృద్ధి మండలి ముందు పెట్టి, ఆమోదం పొందితే, అమల్లోకి వచ్చేసేది. ఈ పూర్వరంగంలో సాధారణ ఎన్నికలు జరిగాయి. మోడీ ప్రధానమంత్రి అయ్యారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారు. జాతీయ అభివృద్ధి మండలి సమావేశమే జరపడం లేదు. నీతీ అయోగ్‌ని ఏర్పాటుచేశారు. ఆర్థిక సంఘం సిఫార్సులను తడికేగా వాడుకొని ప్రత్యేక తరగతి హోదా ముగిసిన అధ్యాయమని ప్రకటించేశారు. కానీ, పుదుచ్చేరి ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా హామీ ఇచ్చారు. దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి ?

గాడ్గిల్ ఫార్ములా ప్రకారం కేంద్ర ప్రణాళికా నిధులను రాష్ట్రాలకు పంపిణీ చేసే విధానంలో భాగంగా కొన్ని కొలబద్ధల ప్రాతిపదికన 1969లో మూడు రాష్ట్రాలకు ప్రత్యేక తరగతి హోదా కల్పించబడింది. ఆ సౌకర్యాన్ని దశల వారిగా ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీర్‌తోపాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మొత్తం 11 రాష్ట్రాలకు విస్తరించారు. ఆ రాష్ట్రాలు ప్రత్యేక తరగతి హోదా వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను నేటికీ అనుభవిస్తూనే ఉన్నాయి. ప్రత్యేక తరగతి హోదా కల్పించబడిన రాష్ట్రాలకు వివిధ రూపాలలో లబ్ధి చేకూరుతున్నది. జాతీయ అభివృద్ధి మండలి ఆమోదంతో అమలులో ఉన్న గాడ్గిల్ ఫార్ములా ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికా నిధుల్లో 30% ప్రత్యేక తరగతి హోదా ఉన్న రాష్ట్రాలకు, 70% మిగిలిన రాష్ట్రాలకు మంజూరు చేయాల్సి ఉంటుంది. కేంద్రం చేసే ఆర్థిక సహాయంలో ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు సాధారణ కేంద్ర సహాయం(యన్.సి.ఎ.) పద్దు క్రింద మంజూరు చేసే నిధుల్లో 90% గ్రాంటు, 10% రుణంగాను(మిగిలిన రాష్ట్రాలకు 30% గ్రాంటు,70% రుణం) అందుతుంది. అలాగే, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం, ఆహార భద్రతా చట్టం, విద్యా హక్కు చట్టం, వగైరా కేంద్ర ప్రాయోజిత పథకాలు (సి.యస్.యస్.) అమలులోను మరియు ప్రత్యేక ప్రణాళికా సాయం(యస్.పి.ఏ.-ప్రాజెక్టుల కోసం) 90% గ్రాంటు, 10% రుణంగా నిధులు అందుతాయి.ప్రత్యేక కేంద్ర సాయం (ప్రాజెక్టులతో ముడి పడని) 100% గ్రాంటు కి%శీ%ద లభిస్తాయి. విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టబడే పథకాలకు (ఉదా:క్రిష్టా డెల్టా, సాగర్ కుడి కాలువఆధునీకీకరణ వగైరా) కేంద్రం అదనపు సహాయం(ఎ.సి.ఏ.-ఈ.ఏ.పి.)పద్దు క్రింద 90% గ్రాంటు, 10% రుణంగా అందుతుంది. మిగిలిన రాష్ట్రాలకు సంబంధించి విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టబడే పథకాలకుమొత్తం రుణంగానే అందుతుంది. ప్రత్యేక తరగతి హోదా కల్పించబడినరాష్ట్రాల ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధికి దోహదపడడానికి కేంద్ర పన్నుల్లో (ఎక్సయిజ్ డ్యూటీ, ఆదాయపు పన్ను, జీఎస్టీ) రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది.

2014లో అధికారంలోకి రాగానే మోడీ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా ఇచ్చి ఉంటే ఈ ప్రయోజనాలు వనగూడేవి. రాష్ట్రాభివృద్ధికి హోదా దోహదం చేసి ఉండేది. మరొక వైపున, ప్రత్యేక ప్రణాళికా సాయం (యస్.పి.ఏ -ప్రాజెక్టుల కోసం), ప్రత్యేక కేంద్ర సాయం(ప్రాజెక్టులతో ముడి పడని)కు సంబంధించి 2015-16 వార్షిక బడ్జెట్‌లో విస్పష్టంగా పొందుపరచని మాట వాస్తవమే. కేంద్ర ప్రాయోజిత పథకాల

కేటాయింపులకు సంబంధించి మార్పులుచేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 32% నుండి 42%(మళ్ళీ 41%కి తగ్గించారు) పెంచిన కారణంగా కొన్ని పథకాలను కేంద్రం అమలుచేసే జాబితా నుండి తొలగించి, ఆయా రాష్ట్రాల స్థానిక అవసరాలకు అనుగుణంగా పథకాలను రూపొందించు కొని అమలు చేసుకోవాలని, వాటికి చేసే కేటాయింపుల్లో కూడా మార్పులు చేసి కేంద్రం చేతులు దులుపుకొన్నది. తద్వారా రాష్ట్రాలకు ఇచ్చే పన్నుల వాటాను కుడి చేత్తో పెంచి, కొన్ని పథకాలను రాష్ట్రాల నెత్తి మీదకు తోసేయడం ద్వారా ఎడమ చేత్తో రాష్ట్రాలకు జరిగే ఆర్థిక ప్రయోజనాలను లాగేసుకొంది. సెస్‌ల రూపంలో కేంద్రం రాబడి పెంచుకొంటూ, అందులో, రాష్ట్రాలకు వాటా ఇవ్వడం లేదు. వార్షిక బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర అన్న వర్గీకరణను చెరిపేశారు.రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాలకు మోడీ ప్రభుత్వం కత్తెర వేసింది.సమాఖ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలకు పూనుకొన్నది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా ఎగ్గొట్టేందుకు అడ్డగోలు చర్చ లేవదీశారు. అర్హతల్లేవన్నారు. ఏంటా అర్హతలు: (1.) పర్వత ప్రాంతం, సంక్లిష్ట భూభాగం. (2.) జనసాంద్ర తక్కువగా ఉండడం, జనాభాలో గిరిజనులు గణనీయంగా ఉండడం. (3.) పొరుగు దేశాల సరిహద్దుల వెంబడి వ్యూహాత్మక ప్రదేశంగా ఉండడం. (4.) ఆర్థికంగా, మౌలిక సదుపాయాల పరంగా వెనుకబడి ఉండడం. (5.) తలసరి ఆదాయం కాస్తా ఎక్కువగా ఉన్నా అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చ గలిగిన స్థితిలో వనరులు లేకపోవడం. కాస్తా కుడి ఎడమగా ఈ అర్హతలన్నీ ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నాయి. 960 కి.మీ. సముద్ర తీరం ఉన్నది. హిందూ మహాసముద్రంలోని డిగో గార్షియాను అమెరికా సైనిక స్థావరంగా మార్చింది. దేశ భద్రత దృష్ట్యా సముద్ర తీరం వెంట కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవలసిన అనివార్య పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద శక్తులు దేశంలోకి ప్రవేశించడానికి ఒక మార్గంగా ఈ ప్రాంతాన్ని ఎంచుకోవచ్చు. ఇటీవలే డ్రగ్స్ మాఫియా బ్రెజిల్ నుంచి విశాఖపట్నానికి భారీగా డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేశారు. వీటన్నింటికీ మించి ఉమ్మడి రాష్ట్రానికి ఆర్థికంగా, పారిశ్రామికంగా, విద్య, వైద్య అన్ని విధాల తలమాని కమైన హైదరాబాదు నుండి వేరు చేసి, రాజధాని కూడా లేని రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాలలో వెనుకబడ్డ రాష్ట్రంగా, వ్యవసాయాధారిత రాష్ట్రంగా మారిపోయింది. ఆ కారణంగానే ప్రత్యేక తరగతి హోదా కల్పిస్తామని హామీ నాటి ప్రధాన మంత్రి పెద్దల సభాగా పిలువబడే రాజ్యసభ వేదికగా హామీ ఇచ్చారు. ఆ హామీకే విలువివ్వకపోతే చట్టసభల విశ్వాసనీయతకే భంగం కలుగుతుం దన్న ఆలోచన ప్రధానమంత్రి మోడీ చేయకపోవడం అత్యంత గర్హనీయం. ప్రత్యేక తరగతి హోదా వల్ల వనగూడే ఆర్థిక ప్రయోజనం మేరకు విదేశీ ఆర్థిక సంస్థల సహాయం(ఎక్స్ టర్నలీ ఎయిడెడ్ ప్రాజెక్ట్స్)తోచేపట్టే ప్రాజెక్టుల పద్దు కింద తోడ్పాటును అందిస్తామని కబుర్లు చెప్పారు. ఐదారేళ్లు గడచిపోయాయి. ఆ పద్దు కింద మోడీ ప్రభుత్వం ఎంత ఆర్థిక సహాయం చేసిందో! రాష్ట్ర ప్రభుత్వం ఏనాడు వెల్లడించలేదు. ఈ ఐదేళ్ల కాలంలో విదేశీ ఆర్థిక సంస్థల సహాయంతో కొత్తగా చేపట్టిన పథకాలుకానీ, ప్రాజెక్టులుకానీ లేవు. మోసపూరిత ప్రకటనలతో ప్రజలను కొంత కాలం మభ్యపెట్టవచ్చునేమో కానీ, ఎక్కువ కాలం మభ్యపెట్టలేరు.

**కడప ఉక్కు పరిశ్రమను ఎగ్గొట్టారు కదా!**

**ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం - 2014, భాగం - 10:** మౌలిక సదుపాయాలు, ప్రత్యేక ఆర్థిక చర్యలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వై.యస్.ఆర్. జిల్లాలో "ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్" ను నెలకొల్పే అవకాశాన్ని 'స్టీల్ అథారిటి ఆఫ్ ఇండియా' అధ్యయనం చేసి 6 మాసాల్లో నివేదిక సమర్పించాలి" అని పేర్కొన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(%బూ×బూ%) సమర్పించిన నివేదికలో కడప ఉక్కు కర్మాగారం నెలకొల్పడం లాభదాయకంకాదన్న అభిప్రాయాన్ని తెలియజేసిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించి, విభజన చట్టంలోని ఆ హామీని అటకె క్కించే ప్రయత్నం చేస్తే ప్రజలు ఆందోళనకు పూనుకొన్నారు. దాంతో కాస్తా వెనకడుగు వేసినట్లు నటించి, మెకాన్ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నామని, కర్మాగారాన్ని నెలకొల్పుతామని, త్వరలో శంకుస్థాపన జరుగుతుందన్నంత స్థాయిలో నమ్మబలి కారు. మరొకవైపు, సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్ ద్వారా సాధ్యంకాదని మోడీ ప్రభుత్వం చెప్పింది.సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యం కాదని కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ 2023 జూలైలో పార్లమెంటులో ప్రకటన చేశారు. వెనుకబడ్డ, కరవు పీడిత రాయలసీమ నడిబొడ్డులో కడప ఉక్కు కర్మా గారాన్ని నెలకొల్పుతామన్న చట్టబద్ధమైన వాగ్దానాన్ని తిరస్క రించారు. కర్మాగారాన్ని నెలకొల్పడం లాభదాయకం (ఫీజుబులిటీ) కాదన్న దగాకోరు వైఖరిని మోడీ ప్రభుత్వం తీసుకొన్నది. ఒకనాడు గాలి జనార్ధన్ రెడ్డికి చెందిన బ్రాహ్మణి స్టీల్స్ ప్రయివేటు సంస్థకు డా.వైఎస్సార్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ముద్దనూరు - జమ్మలమడుగు మధ్య దాదాపు 14,000 ఎకరాల ప్రభుత్వ బంజరు, అటవీ భూములను రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు ధరకు కేటాయించింది. అనంతపురం జిల్లాలోని ఓబులాపురం, పొరుగునున్నబళ్ళారి జిల్లాలోని ఇనుప ఖనిజంతో ఆధారంగా ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గాలి జనార్ధన్‌రెడ్డి అవినీతి కుంభకోణానికి పాల్పడడంతో దాని నిర్మాణం ఆటకెక్కింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న తర్వాత కొప్పర్తి - కంభాలదిన్నే గ్రామం వద్ద 2018లో చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. జగన్మోహన్ రెడ్డి సున్నపురాళ్ళపల్లి సమీపంలో శంకుస్థాపనలు చేశారు. కర్మాగారాన్ని నెలకొల్పడానికి జే.ఎస్.డబ్ల్యూ స్టీల్స్ లిమిటెడ్ ముందుకొచ్చిందని, రు.8,800 కోట్లు పెట్టుబడి పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నదని 2019 డిసెంబరు 23న శంకుస్థాపన చేసిన సందర్భంలో జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాట. మూడేళ్ళ తర్వాత, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆ ప్రతిపాదనను ఆమోదించింది. మరొకసారి 2023 ఫిబ్రవరిలో శంకుస్థాపనచేశారు. ఒకే పరిశ్రమకు, ఒకే స్థలంలో, ఒకే ముఖ్యమంత్రి రెండుసార్లు శంకుస్థాపనలు చేయడం విశేషం. కానీ, అడుగు ముందుకు పడలేదు. ప్రైవేటు సంస్థలకు లాభదాయకంగా ఉన్నప్పుడు, ప్రభుత్వ రంగ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాకు లేదంటే ఎలా నమ్మాలి! ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 మేరకు జగన్మోహన్ రెడ్డి హక్కుగా పోరాడి కడప ఉక్కు కర్మాగారాన్ని ఎందుకు సాధించలేకపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలకు ఇదొక ప్రబల నిదర్శనం.

**విభజన చట్టంలోని సెక్షన్ 94:** "(1)పారిశ్రామికీకరణను, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి కొత్తగా ఏర్పడే రెండు రాష్ట్రాలకు పన్ను ప్రోత్సాహాలతో సహా తగు విధమైన ఆర్థిక చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలి. (2) రెండు రాష్ట్రాల్లో భౌతిక, సాంఘికపరమైన విస్తరణతో సహా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సహాయపడాలి" అని పేర్కొన్నారు. విభజన చట్టాన్ని అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ మేరకు చర్యలు చేపట్టి వెనుకబడ్డ, కరవు పీడిత రాయలసీమ ప్రాంతంలో కడప ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి విధాన నిర్ణయం తీసుకొని అమలు చేయడానికి పూనుకొని ఉండాల్సింది. రాయలసీమ లాంటి వెనుకబడ్డ ప్రాంతాలలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వాలకు ఉండవలసింది అంకితభావం. వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణకు పూనుకోవడం, రిజర్వేషన్లను అమలు చేసి సామాజికంగా వెనుకబడ్డ ప్రజానీకానికి ఉపాధి కల్పించడం, భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ రంగం మౌలిక స్వభావం కదా!

100% ఆదాయపు పన్ను రాయితీ, జి.ఎస్.టి. పరిధిలోని పన్నుల్లో 100% రాయితీ, మూలధన పెట్టుబడిని సమకూర్చి, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు భరోసా కల్పించి, ప్రోత్సహించినప్పుడే రాయలసీమ లాంటి వెనుకబడ్డ ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు మెరుగవుతాయి. ఆ వైపున కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం ఆలోచించలేదు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నెల కొల్పడానికి సామాజిక, ఆర్థికాభివృద్ధి దృక్పథంతో రాజకీయ సంకల్పం ముఖ్యమైనది. ప్రభుత్వ రంగంలోని "స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెలకొల్పడానికి అవసరమైన కార్యాచరణకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పూనుకొంటే సాధ్యమవుతుంది. సెయిల్‌తోపాటు నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ (ఎన్.యం.డి.సి.)ల సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పడానికి పూనుకోవాలి. ఉక్కు పరిశ్రమను నెలకొల్పడం ద్వారా లభ్యమవుతున్న ముడి ఇనుప ఖనిజాన్ని సరుకుగా మార్చి అదనపు విలువను జోడించి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా, లేదా దేశీయంగా వినియోగించుకోవడం ద్వారా జాతీయోత్పత్తిని పెంపొందించుకో వచ్చన్న విజ్ఞత కూడా పాలకులు ప్రదర్శించక పోవడాన్ని ఏమనాలి?

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలన్న డిమాండ్ చేసినప్పుడు కూడా ఇందిరా గాంధీ నేతృత్వంలోని నాటి కేంద్ర ప్రభుత్వం "ఫీజిబిలిటీ" లేదని తిరస్కరిస్తే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అన్న నినాదంతో ప్రజా ఉద్యమం పెల్లుబికి, 32 మంది ప్రాణాలను బలిదానం చేశాక, నెలకొల్పారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి నేటికీ సొంత గనులను కేటాయించలేదు. అయినా నవరత్నాల్లో ఒకటిగా అభివృద్ధి చెందింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు అరవై వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నది. విశాఖపట్నం ఒక మహానగరంగా ఆవిర్భవించడానికి ఉపకరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విశాఖ ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచింది. దేశ పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తున్నది. రాయలసీమ ప్రాంతంలో అలాంటి ఒక్క పరిశ్రమ కూడా లేకుండా ఉపాధి కల్పన ఎలా జరుగుతుంది? అభివృద్ధిలో ప్రజలను ఎలా భాగస్వాములను చేస్తారు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఈ ఆలోచన కొరవడింది.

అనంతపురం జిల్లాలో లభించే ఇనుప ఖనిజం నాణ్యత తక్కువని ఒకప్పుడు చిన్నచూపు చూసే వారు. నేడు శాస్త్ర, సాంకేతిక రంగాలలో విప్లవాత్మక విజయాలు సాధించాక లభిస్తున్న ముడి ఇనుప ఖనిజాన్ని శుద్ధిచేసి, వినియోగించుకొనే సౌలభ్యం కలిగింది. ఈ వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం దారుణం. సమాజానికి ఇనుము అవసరం నిరంతరాయంగా ఉంటుంది. మార్కెట్ ధరల్లో స్థిరత్వం లేకపోవచ్చు. దానికి కారణం అస్థవ్యస్తమైన, అశాస్త్రీయమైన పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలే. వాటిని ప్రాతిపదికగా తీసుకొని "ఫీజిబిలిటీ" కాదన్న నిర్ధారణకు రావడంలో హేతుబద్ధత లేదు. సమ్మిళిత అభివృద్ధిపై గంభీరోపన్యాసాలిచ్చే పాలకులు కరవు పీడిత, అత్యంత వెనుకబడ్డ రాయలసీమ లాంటి ప్రాంతాల పట్ల క్షమించరాని అలసత్వాన్ని ఎందుకు ప్రదర్శిస్తున్నారు? ఉపాధి అవకాశాలు లేక లక్షల సంఖ్యలో గల్ఫ్

దేశాలకు, దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రజలు వలసలు వెళుతున్నారు. ఉపాధి కల్పించి, వలసలను నివారించి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలన్న సంకల్పమే ప్రభుత్వాలలో లోపించింది.

## రాయలసీమ -ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ ఎక్కడ?

గడచిన ఏడున్నర దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యం పర్యవసానంగా రాయలసీమ-ఉత్తరాంధ్ర ప్రాంతాలు వెనుకబడ్డ ప్రాంతాలుగా కుమిలిపోతున్నాయి. రాష్ట్ర విభజనతో గొడ్డలి పెట్టుకు గురయ్యాయి. రాయలసీమ-ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్, కోరపుట్-బోలాంగిర్-కాలహండి (కెబికె) తరహాలో అభివృద్ధి ప్యాకేజీని అమలు చేస్తామని చట్టంలో పేర్కొన్నారు. రు.24,350 కోట్ల వ్యయం అంచనాతో అభివృద్ధి పథకాన్ని గత రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి, కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఆ పథకాన్ని పరిగణలోకే తీసుకొన్నట్లు లేదు. దేశ వ్యాపితంగా 150 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి, వాటన్నింటికీ కేటాయించినట్లుగానే ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున, ఒక్కొక్క జిల్లాకు కేంద్ర వార్షిక బడ్జెట్‌లో మూడేళ్లపాటు రాయలసీమ-ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాలకు మొత్తంగా రూ.1,050 కోట్లు మంజూరు చేశారు. తర్వాత ఆపేశారు. దీన్నే అభివృద్ధి పథకమని వ్యాఖ్యానించే ప్రబుద్ధులు లేకపోలేదు.

రాయలసీమకు నీటి సమస్యే జీవన్మరణ సమస్య. గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం ద్వారా వీలైనంత ఎక్కువ నీటిని రాయలసీమకు తరలించి కరవు కాటకాల నుండి శాశ్వతంగా విముక్తి చేయాలి. నిర్మాణంలో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ఆర్థిక సహకారాన్ని అందించాలి. పారిశ్రామికాభివృద్ధికి చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి ప్యాకేజిని రూపొందించి, అమలు చేసి, సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలి. గత ప్రభుత్వ కాలంలో కొత్తగా పెట్టే పెట్టుబడులపై 15% అదనపు పన్ను రాయితీ, కొత్త యంత్రాల తరుగుదలపై 15% అదనపు పన్ను రాయితీ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇవి నామమాత్రపు రాయితీలు. వీటివల్ల పారిశ్రామికవేత్తలు ఆకర్షించబడలేదు. ఒక్క పరిశ్రమ నెలకొల్పబడలేదు. చిత్తూరు జిల్లా మన్నవరం వద్ద డా.మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేసిన బి.హెచ్.ఇ.యల్. మరియు ఎన్.టి.పి.సి. సంయుక్త ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ పరికరాల ఉత్పత్తి కర్మాగారాన్ని కూడా మోడీ ప్రభుత్వం విరమించుకొన్నది.

## కృష్ణా నీటి హక్కులపై దాడి

"ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014,విభాగం 9, సెక్షన్ 85 (iv) కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ పరిధిలోకి రాని ఏవైనా వివాదాలు ఉంటే వాటిని అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం 1956 ప్రకారం ట్రిబ్యునల్‌కు అప్పజెప్పాలి". షెడ్యూల్ 11, 4వ అంశంలో ఏముంది, "గోదావరి, కృష్ణా నదులపై వివిధ ప్రాజెక్టులకు సంబంధించి లేదా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాంతాలకు సంబంధించి నదీ జలాల ట్రైబ్యునళ్లు చేసిన కేటాయింపులు యథాతథంగా ఉంటాయి". చట్టంలో ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ నాటి కేసీఆర్ ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులనే తిరగదోడాలంటూ అసంబద్ధమైన మరియు లేని వివాదాన్ని లేవనెత్తి, ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తే మోడీ ప్రభుత్వం తలవొగ్గి బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువును పెంచి ఆ బాధ్యతను అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులకు తీవ్ర ప్రమాదం తెచ్చిపెట్టారు. ఇదే బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ కు మిగులు జలాలను వాడుకొనే స్వేచ్ఛను బచావత్ ట్రిబ్యునల్ కల్పిస్తే, దాన్ని హరించింది. బచావత్ ట్రిబ్యునల్ 75% ప్రామాణికంగా లభించే నికర జలాల కేటాయింపును ముట్టుకోకుండా ఆపైన 65%, 55% ప్రామాణికంగా లభించే నీటిని నిర్ధారించి మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేటాయించింది. ఆ నీటి కేటాయింపులకు అనుగుణంగా నీటిని వాడుకోవడానికి అలమట్టి డ్యాం ఎత్తును పెంచుకోవడానికి, కొత్త ప్రాజెక్టులను నిర్మించుకోవడానికి అనుమతించింది. ఆ తీర్పు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులపై శరాఘాతమని భావించి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. పర్యవసానంగా బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి రాకుండా "స్టే" విధించబడ్డది. కేసు విచారణలో ఉన్నది. ఆ కేసు విచారణ పూర్తయి, తీర్పు రాకముందే, మోడీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలకు పరిమితమై ట్రిబ్యునల్ ను నియమించింది. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. మోడీ ప్రభుత్వ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు, ప్రత్యేకంగా కరవు పీడిత రాయలసీమ నీటి హక్కులపై గొడ్డలిపెట్టు.

"ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, షెడ్యూల్ 11(10) నిర్మాణంలో ఉన్న కింది నీటి పారుదల ప్రాజెక్టులను ప్రస్తుతఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకటించిన ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి. వాటికి నీటి పంపకాల ఏర్పాటు ఈ విధంగా కొనసాగుతుంది.అవి: (i) హంద్రీ - నీవా, (ii) తెలుగు గంగ, (iii) గాలేరు-నగిరి, (iv) వెలిగొండ, (v) కల్వకుర్తి, (vi) నెట్టెంపాడు". మోడీ ప్రభుత్వ నిర్ణయంతో ఈ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. చట్టంలోని విభాగం 9, సెక్షన్ 85(2) ప్రకారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలి. కానీ, చేయలేదు. హైదరాబాదులోనే ఉన్నది. విశాఖకు తరలించాలని

జగన్మోహన్‌రెడ్డి పదేపదే ప్రతిపాదించి, తన కుటిల రాచకీయా లను ఈ విషయంలో కూడా చొప్పించారు.

## ఎగువ భద్రకు జాతీయ హోదా!

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన "స్పెషల్ లీవ్ పిటిషన్" సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్నది. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ గతంలో ఇచ్చిన తీర్పే శిరోధార్యమని ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో కూడా పునరుద్ఘాటించబడింది. మరి మోడీ ప్రభుత్వం చేసిందేమిటి? బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అమల్లోకే రాలేదు. ఆ ట్రిబ్యునల్ 65% ప్రామాణికంగా కేటాయించిన నీటిని చూపెట్టి కర్ణాటక ప్రభుత్వం 30 టియంసిల సామర్థ్యంతో ఎగువ భద్ర ప్రాజెక్టును రూపొందించి, నిర్మాణాన్ని చేపట్టింది. కేంద్ర జల సంఘం ఆమోదించింది. కర్ణాటకలో శాసనసభ ఎన్నికలకు ముందు రాజకీయ లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో మోడీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, 2023-24 వార్షిక బడ్జెట్లో రు.5,300 కోట్లు కేటాయించింది. ఆ ప్రాజెక్టు యొక్క నిర్మాణ అంచనా వ్యయం రు.16,125 కోట్లు. నికర జలాల కేటాయింపులేని ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర జల సంఘం ఎలా అనుమతించింది? కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ఎలా ప్రకటించింది? కేంద్ర బడ్జెట్లో రు.5,300 కోట్లు ఎలా కేటాయించింది? ఈ ప్రశ్నలకు ప్రధాన మంత్రి మోడీ సమాధానం చెప్పారా!

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం -2014లో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించబడిన పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుకు మోడీ ప్రభుత్వం 2014-15 వార్షిక బడ్జెట్లో కేవలం రు.100 కోట్లు కేటాయించింది. నిరసన తెలియజేస్తే కేటాయింపును రు.250 కోట్లకు పెంచింది. ఆ తర్వాత బడ్జెట్లో నిధులు కేటాయించకుండా నాబార్డ్ వద్ద కేంద్ర ప్రభుత్వమే పోలవరం కోసం రుణం తీసుకొని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తాన్ని స్క్రూటినీ చేసిన మీదట చెల్లిస్తున్నది. రు.55,548 కోట్ల వ్యయ అంచనతో పోలవరం ప్రాజెక్టు డిపీఆర్-2కు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహా మండలి ఐదేళ్ల క్రితం ఆమోదం తెలియజేసింది. రివైజ్డ్ ఎస్టిమేట్స్ కమిటీ రు.47,500 కోట్లకు తగ్గించింది. ఇంత ప్రక్రియ జరిగాక కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పెండింగ్‌లో పెట్టి కూర్చొన్నది. ఏంటీ సవతితల్లి ప్రేమ.

ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణం ఆంధ్రప్రదేశ్, ప్రత్యేకించి వెనుకబడ్డ - కరవు పీడిత రాయలసీమ ప్రాంత నీటి హక్కులపై గొడ్డలి పెట్టుగా పరిణమిస్తుంది. 133 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించబడిన తుంగభద్ర డ్యాంలో పూడిక వల్ల 101 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి పడిపోయింది. దీన్ని చూపెడుతూ తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వ చివర భాగంలో ఉన్న నవలి వద్ద కర్ణాటక ప్రభుత్వం 30 టీఎంసీల తరలింపుకు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నది. కర్ణాటక ప్రభుత్వం ఎగువ భద్ర, నవలి ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తే బచావత్ ట్రిబ్యునల్ నికర జలాలు కేటాయించిన తుంగభద్ర ఎగువ కాలువ (32.50 టీఎంసీ), తుంగభద్ర దిగువ కాలువ(29.5 టీఎంసీ), కె.సి.కెనాల్(39.9 టీఎంసీ) ప్రాజెక్టులకు నీటి సమస్య జఠిలంగా మారుతుంది. తుంగభద్ర డ్యాం నుండి నీరు క్రిందికి ప్రవహించి సుంకేసుల ఆనకట్ట మీదుగా శ్రీశైలం జలాశయానికి చేరడం ప్రశ్నార్థకమౌతుంది. అంటే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటి హక్కులకు శాశ్వతంగా నష్టం వాటిల్లుతుంది.

## రైల్వే జోన్ పై నాటకాలు!

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూల్ 13, మౌలిక సదుపాయాలు జాబితాలో రైల్వే జోన్ నెలకొల్పుతామని పేర్కొన్నారు. రైల్వే జోన్ అంశంపై రైల్వే బోర్డు నియమించిన అధ్యయన కమిటీ "ఫీజిబిలిటీ" లేదని నివేదిక ఇచ్చిందని చెబుతూ కొన్ని ఏళ్ళ పాటు కాలయాపన చేసిన మోడీ ప్రభుత్వం ఎట్టకేలకు విశాఖ కేంద్రంగా "దక్షిణ కోస్తా రైల్వే జోన్"ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. వాల్తేరు డివిజనులోని సరుకు రవాణా ద్వారా సమకూరే మొత్తం ఆదాయాన్ని 'ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్'కు దఖలుపరుస్తూ జోన్ ప్రకటన చేశారు. చారిత్రక నేపథ్యం - ఆదాయాన్ని సముపార్జించి పెడుతూవస్తున్న "వాల్తేర్ డివిజన్" కనుమరుగై పోతుందని సెలవిచ్చారు. ఆ డివిజన్ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ భూభాగంలోని ప్రాంతాలను విజయవాడ డివిజన్‌లో అంతర్భాగం చేస్తామని ప్రకటించారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలోని ఒడిస్సా రాష్ట్రంలోని ప్రాంతాలను విడగొట్టి రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ను ఏర్పాటు చేసి, దాన్ని భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న 'ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్'లో చేరుస్తామని ప్రకటించారు. ఒడిస్సాలోని కుర్ధా డివిజన్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని భాగాలను మాత్రం యధాతథంగా కుర్ధా డివిజనులోనే కొనసాగిస్తారట. వాటిని వాల్తేర్ డివిజనులో కలిపి వాల్తేర్ డివిజన్ను కొనసాగించవచ్చు కదా! అభ్యంతర మేమిటి? వాల్తేర్ డివిజన్ను రద్దు చేయడం ముమ్మాటికీ తప్పుడు నిర్ణయం.

విశాఖలో రైల్వే జోన్ నెలకొల్పడానికి సమగ్ర అధ్యయన నివేదిక (డిపిఆర్) సిద్ధంగా ఉన్నదని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 53 ఎకరాల భూమి కేటాయించకపోవడం వల్లనే ఏర్పాటు చేయలేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ నాటకం బాగా రక్తి కట్టిస్తున్నది. పర్యవసానంగా రెండు తెలుగు రాష్ట్రాలు నేటికీ సికింద్రాబాదు కేంద్ర స్థానంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే

జోన్ పరిధిలోనే ఉన్నాయి. జోన్ కార్యకలాపాలకు కేంద్ర స్థానమైన సికింద్రాబాదు రైల్వే నిలయం ఎంత విస్తీర్ణంలో నిర్మించబడిందో ఒక్కసారి పరిశీలించండి. రైల్వే జోన్ కేంద్ర కార్యాలయంలో జనరల్ మేనేజర్, జోనుకు సంబంధించిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు, విభాగాధిపతుల కార్యాల యాలు ఉంటాయి. బహుళ అంతస్తుల భవనాలు నిర్మించుకొని రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం యొక్క కార్యకలాపాలను నిర్వహించడానికి వీలైనంత భూమిని సేకరించుకోవడానికి రైల్వే శాఖ చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు. విశాఖ రైల్వే జోన్ను ఏర్పాటు చేయడానికి విధాన నిర్ణయం ప్రకటించినప్పుడు విశాఖ రైల్వే డివిజన్ను విజయవాడ డివిజనులో కలిపేస్తామన్నారు. మరి, విశాఖ డివిజన్ కార్యాలయ ప్రాంగణాన్ని రైల్వే జోన్ కార్యాలయంగా అభివృద్ధి చేసుకొని ఈపాటికే పని చేయడం మొదలు పెట్టి ఉండవచ్చు! ఆ పని ఎందుకు చేయలేదు? విశాఖ డివిజన్ను కొనసాగిస్తూ, జోన్ ఏర్పాటుకు సరిపడ భూమి రైల్వే శాఖ అధీనంలో విశాఖలో లేదా! జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే రైల్వే జోనుకు కావలసిన 53 ఎకరాల భూమిని కేటాయించడం ఒక సమస్యా! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ భూమి కేటాయింపు చుట్టూ నాటకమాడుతూ బాగానే రక్తి కట్టిస్తున్నారు.

తిరుపతి డివిజన్ ఏర్పాటుకు అభ్యంతరం ఏమిటి? కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ను నెలకొల్పాలన్న డిమాండును పట్టించు కోలేదు. గుంతకల్లు డివిజన్ పరిధిలో 1,452 కి.మీ. రైల్వే లైన్ ఉంటే విజయవాడ డివిజన్ పరిధిలో 1,065 కి.మీ., గుంటూరు డివిజన్ పరిధిలో 678 కి.మీ. మాత్రమే ఉన్నది. పెద్ద డివిజన్గా ఉన్న గుంతకల్లు డివిజన్ను రెండుగా విభజించి, తిరుపతి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలన్న న్యాయబద్ధమైన డిమాండును ఎందుకు పెడచెవిన పెడుతున్నారో!

రైల్వే బోర్డు : రైల్వే జోన్ పరిధిలోని ఉద్యోగాల నియామకాల బాధ్యతను నిర్వర్తించే "రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్"కేంద్రాన్ని రాష్ట్రంలో నెలకొల్పడంపై స్పష్టత ఇవ్వలేదు. బోర్డు నెలకొల్పితే ఆంధ్రప్రదేశ్ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దేశంలోని వివిధ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురికాకుండా, వాటి అవసరాలను తీర్చడానికి, 21 రైల్వే రిక్రూట్మెంట్ బోర్డులు పనిచేస్తున్నాయని రైల్వే బోర్డు అధికారికంగా వెల్లడించింది. మెట్రో జోన్ మినహాయిస్తే 16 జోన్స్ ఉంటే 21 రిక్రూట్మెంట్ బోర్డులు ఉన్నాయి. దక్షిణాదిన సికింద్రాబాదుతోపాటు బెంగళూ రు, చెన్నై మరియు తిరువనంతపురంలలో రిక్రూట్మెంట్ బోర్డులు పనిచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్లో మాత్రమే లేదు. దక్షిణ రైల్వే పరిధిలో రెండు రైల్వే రిక్రూట్మెంట్ కేంద్రాలు, చెన్నై మరియు తిరువనంతపురంలో ఉన్నాయి. రాష్ట్రం విడిపోయి పదేళ్ళు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్ లో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డును నెలకొల్పాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు రాలేదో! అడగాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు రాలేదో!

**రైల్వేల విస్తరణ-అభివృద్ధి :** నూతన రైల్వే మార్గాల నిర్మాణం, నూతన రైళ్ళను ప్రవేశపెట్టడం, తదితర అభివృద్ధి పథకాలను రూపొందించి, అమలు చేయాలంటే విశాఖ జోన్ ఏర్పాటు అత్యవసరం. పాకాల, నందలూరు, బిట్రగుంట, తదితర కేంద్రాలలో అత్యంత విలువైన వందలాది ఎకరాల భూములు రైల్వే శాఖకు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకొని రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్స్, తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చే శిక్షణా కేంద్రాలను నెలకొల్పవచ్చు! ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నుంచి హైదరాబాదు మరియు తెలంగాణలోని ఇతర ముఖ్యమైన నగరాలకు వేగవంతమైన (రాపిడ్) రైలు మరియు రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విశాఖపట్నం మరియు విజయవాడ-గుంటూరు -తెనాలి మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటలలో మెట్రో రైలు సౌకర్యం కల్పించాలని చట్టంలో పేర్కొనబడింది. ఆ పనులు చేయలేదు. రాష్ట్ర రాజధాని అమరావతికి, ప్రముఖ పారిశ్రామిక నగరం మరియు రైల్వే జోన్ కేంద్రంగా ప్రకటించబడిన విశాఖ పట్నంతో రాయలసీమ జిల్లాలను అనుసంధానంచేస్తూ నేరుగా రైల్వే ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచవచ్చు. కడప-బెంగళూరు రైల్వే మార్గం నిర్మాణానికి 50% నిధులను ఆంధ్రప్రదేశ్ సమకూర్చాలన్న ఒప్పందమే దుర్మార్గమైనది. రాష్ట్ర విభజన తర్వాత అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం వెనుకబడ్డ మరియు కరవు పీడిత రాయలసీమ ప్రాంతాన్ని బెంగళూరు మహానగరంతో అనుసంధానం చేసే రైలు మార్గానికి 50% నిధులను తన వాటాగా ఇవ్వగలదా? కేంద్ర ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించాలి. ఆటకెక్కించిన నిర్మాణ పనులను సత్వరం పునఃప్రారంభించాలి. కర్నూలు వద్ద రూ.560 కోట్లతో సి.యం.ఎల్.ఆర్. వర్క్షాప్ నిర్మాణాన్ని 2023 సెప్టెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. కానీ, అరకొర పనులే చేశారు. దాన్ని సత్వరం పూర్తి చేయాలి. అమరావతి-అనంతపురం ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణంలో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన మార్పులు, చేర్పులు, నిర్మాణ పనుల్లో అలసత్వం పర్యవసానంగా నష్టం జరుగుతున్నది. వెనుకబడ్డ రాయలసీమ ప్రాంత సామా జిక - ఆర్థికాభివృద్ధికి ఉపకరించే రైల్వేలు మరియు జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు బాధ్యతగా వ్యవహరించడం లేదు.

**రైలు మార్గాన్ని అదానీకి అప్పజెప్పారా !:** 2019లో ప్రారంభిం చబడిన కృష్ణపట్నం - ఓబులవారిపల్లె రైల్వే మార్గాన్ని ఎందుకు కేవలం సరుకు రవాణాకు మాత్రమే పరిమితం చేశారో! ఆ మార్గంలో ఎందుకు ప్యాసింజర్ రైళ్లను నడపడం లేదో! విశాఖ

పట్నం-విజయవాడ-వెంకటాచలం-ఓబులవారిపల్లె-రాజంపేట-కడప మార్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళను ప్రవేశపెట్టవచ్చు. రైలు మార్గం నిర్మాణం కోసం రూపొందించిన సమగ్ర అధ్యయన నివేదికలో రైళ్ళ నిర్వహణ అంతర్భాగం. తదనుగుణంగా వెంకటాచలం-ఓబులవారిపల్లి మధ్య 10 స్టేషన్లు కసుమూరు, కొట్టుండిపల్లి, బ్రాహ్మణపల్లి, ఆదుర్పల్లి, నెల్లెపల్లి, రాపూరు, వెల్లికల్లు, చెర్లోపల్లి, నేతివారిపల్లి మరియు మంగంపేట్ రోడ్డు నిర్మించారు. వెంకటాచలం - ఓబులవారిపల్లె రైలు మార్గాన్ని ప్రారంభించినప్పుడు ప్యాసింజర్ రైళ్లను త్వరలోనే ప్రవేశపెడతామని దక్షిణ మధ్య రైల్వే అధికారికంగా ప్రకటించింది. కానీ, సంవత్సరాలు గడిచిపోతున్నా గూడ్స్ రైళ్ళ నిర్వహణకే పరిమితం చేసి సరుకు రవాణా వినియోగదారుల అవసరాలను మాత్రమే తీర్చుతోంది. దక్షిణ మధ్య రైల్వే యొక్క సరుకు రవాణాలో కృష్ణపట్నం ఓడరేవు ముఖ్యమైనది. కృష్ణపట్నం ఓడరేవు నుండి నిర్మించబడిన రైల్వే లైన్ వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో చెన్నై-హౌరా మెయిన్‌లైన్‌కు అనుసంధానించబడింది. వెంకటాచలం-ఓబులవారిపల్లె మధ్య రూ.1,993 కోట్ల వ్యయంతో కొత్త రైల్వే లైన్‌ను, చెర్లోపల్లి-వెల్లికల్లు మధ్య దాదాపు 7 కిలోమీటర్ల మేర సొరంగం మార్గంతో సహా నిర్మించడం ద్వారా చెన్నయ్-ముంబయ్ రైలు మార్గంతో అనుసంధానించబడింది. ఫలితంగా, కృష్ణపట్నం పోర్ట్-వెంకటాచలం- ఓబులవారిపల్లె రైల్వే లైన్ రెండు ప్రధాన రైలు మార్గాలైన చెన్నై-హౌరా, చెన్నయ్-ముంబయ్ మధ్య కీలకమైన అనుసంధాన రైలు మార్గంగా ఉన్నది. గుంతకల్ డివిజన్ నుండి కృష్ణపట్నం ఓడరేవుకు వచ్చే గూడ్స్ రైళ్లకు 72 కిలోమీటర్ల దూరం తగ్గింది. వెంకటాచలం - ఓబులవారిపల్లె మధ్య ఉన్న మొత్తం 82 కి.మీ. విద్యుద్దీకరణ పనులతో సహా రైల్వే మార్గం నిర్మించబడింది. ఈ మార్గం సరుకు రవాణాలో నికర లాభాలు గడిస్తున్నదని కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్ వార్షిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్, సాగర్ మాల డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎన్ఎండిసి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ప్రయివేటు రంగంలోని కృష్ణపట్నం పోర్ట్, బ్రాహ్మణి స్టీల్స్ భాగస్వామ్యంతో 2006 అక్టోబర్ 11న "స్పెషల్ పర్పస్ వెహికల్" గా 114 కి.మీ కొత్త బ్రాడ్ గేజ్ ఎలక్ట్రిఫైడ్ రైల్ లైన్ (గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్)ను కృష్ణపట్నం నుండి ఓబులవారిపల్లె వరకు నిర్మాణం, నిర్వహణ & మెంటెనెన్స్ లక్ష్యంతో కంపెనీల చట్టం, 1956 ప్రకారం నెలకొల్పారు. కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్‌లో మొత్తం షేర్ క్యాపిటల్ రూ.625. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ రూ.311 కోట్ల మూలధనం పెట్టుబడితో 49.76% వాటా కలిగి ఉన్నది. అలాగే, రూ.125 కోట్ల పెట్టుబడితో సాగరమాల డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌కు 20%, రూ.40 కోట్ల పెట్టుబడితో నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్కి 6.40%, రూ.35 కోట్ల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 5.6%, అంటే, ప్రభుత్వం / ప్రభుత్వం రంగ సంస్థలు 81.76% వాటా కలిగి ఉన్నాయి. ప్రైవేటు రంగంలోని కృష్ణపట్నం పోర్ట్ కంపెనీ లిమిటెడ్ రూ.81 కోట్ల పెట్టుబడితో 12.96% మరియు బ్రహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.33 కోట్ల పెట్టుబడితో 5.28% వాటాలు కలిగి ఉన్నాయి. రెండు ప్రైవేటు కంపెనీలకు కలిపి కేవలం 18.24% వాటా ఉన్నది. 2005-06 సంవత్సరంలో ఈ ప్రాజెక్టు మంజూరయ్యింది. ఒప్పందం ప్రకారం, రైల్వే మంత్రిత్వ శాఖ కృష్ణపట్నం లైన్‌లోని అన్ని ఆస్తులను కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్‌కు 30 ఏళ్లపాటు లీజుకు ఇచ్చింది. కృష్ణపట్నం-వెంకటాచలం-ఓబులవారిపల్లె రైల్వే లైన్ నిర్మించడానికి, నిర్వహించడానికి ఆ కంపెనీకి అధికారాన్ని దఖలుపరిచింది. ఈ పూర్వరంగంలో కృష్ణపట్నం పోర్ట్‌ను ఆదానీ సంస్థ కొన్నది. కృష్ణపట్నం రైల్వే కంపెనీ లిమిటెడ్‌ను అదానీ తన గుప్పెట్లోకి తీసుకొన్నట్లు భావించాల్సి వస్తున్నది.

## ఓడ రేవుపై కుంటిసాకులు

దుగ్గరాజపట్నం ఓడ రేవు నిర్మాణం చేస్తామని చట్టంలో హామీ ఇచ్చారు. దుగ్గరాజపట్నం శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికి దగ్గరలో ఉండడం, చెన్నయ్ మరియు కృష్ణపట్నం పోర్టులకు మధ్య ఉండడం వల్ల అనుకూలమైన ప్రాంతం కాదని భావించి, ప్రత్యామ్నాయంగా రామాయపట్నం ఓడ రేవును నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మేజర్ పోర్టులను మాత్రమే కేంద్ర ప్రభుత్వం నెలకొల్పుతుందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మైనర్ పోర్టు నిర్మాణాన్ని ప్రతిపాదించిందని ఏకంగా పార్లమెంటులోనే ప్రకటన చేసి చేతులు దులుపుకొన్నది. ఎగ్గొట్టడానికి అదొక కుంటిసాకు. మేజర్ పోర్టు నిర్మాణానికి మోడీ ప్రభుత్వం పూనుకొంటే రాష్ట్ర ప్రభుత్వం వద్దన్నదా! అది వంచనతో కూడిన ప్రకటన కదా! పర్యవసానంగా వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి దోహదపడే మేజర్ పోర్టుగా రామాయపట్నం ఓడరేవు నిర్మాణం సాకారం కాలేదు.

## అమరావతి రాజధాని

దేశ ప్రధానమంత్రిగా మోడీ స్వయంగా అమరావతి రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాజధాని కూడా లేని రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర రాజధానికి సబంధించిన మౌలిక సదుపాయాల కల్పన తమదే పూర్తి బాధ్యతని చట్టంలో పేర్కొన్నారు. రూ.1,500 కోట్లు ఇచ్చారు. స్మార్ట్ సిటీ పథకం మరో రూ.500 కోట్లు ఇచ్చారట. దాంతో బాధ్యత తీరిపోలేదు కదా! నేడు అమరావతి రాజధాని నిర్మాణం ఎలాంటి దుస్థితిలో ఉన్నదో అందరికీ విధితమే. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విధ్వంసకర ఆలోచనలతో రాజధాని నిర్మాణాన్ని ఆపేశారు. మూడు రాజధానుల ముసుగులో ప్రజల మధ్య

అగాధం సృష్టించడానికి పూనుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాన్ని గందరగోళంలోకి నెట్టారు. అమరావతి రాజధాని నిర్మాణానికి 34,000 ఎకరాల భూములిచ్చిన 29 గ్రామాల రైతులు, మహి ళలు, దళితులు రాష్ట్ర ప్రజల సంపూర్ణ మద్దతుతో 1600 రోజులకుపైగా మహోద్యమం చేస్తుంటే మోడీగారు ఒక్కసారైనా స్పందించి భరోసా కల్పిస్తూ ఒక్కమాట మాట్లాడారా? మా పరిధిలో లేని అంశమంటూ సన్నాయి నొక్కులు నొక్కారు. హైకోర్టు చారిత్రాత్మక తీర్పు తదనంతరమైనా కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల నిర్మాణాలను ఎందుకు చేపట్టలేదు?

## విద్యా సంస్థల ఏర్పాటు ఓకే!

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో ఉన్న మేరకు కేంద్ర ప్రభుత్వం పదకొండు కేంద్ర విద్యా సంస్థలను నెలకొల్పింది. కొన్నింటికి శాశ్వత ప్రాంగణాలు నెలకొల్పబడ్డాయి. కొన్ని ప్రయివేటు సంస్థల భవనాలను అద్దెకు తీసుకొని నడుపుతున్నారు. వాటి భవన సముదాయ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ సంస్థలన్నీ కూడా ప్రతిష్టాత్మకమైనవే. వాటికి అవసరమైన నిధులను కేటాయించి, పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి, దేశంలోని ఇతర కేంద్ర విద్యా సంస్థలతో దీటుగా అభివృద్ధి చేయాలి. 2014 ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి గెలిచి, రాష్ట్రంలో టీడీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో అధికారం చేపట్టింది. ఆ ఊపులో చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటుకు కార్యాచరణకు పూనుకొన్నారు. ఫలితంగా నేటికి దాదాపుగా కార్యరూపం దాల్చాయి.

1.మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) రూ.1,620 కోట్ల వ్యయ అంచనాతో నిర్మాణ పనులు మొదలుపెట్టి, పూర్తిచేశారు. 2018లో విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో తాత్కాలిక క్యాంపస్ ఏర్పాటు చేసి, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్ 50 మందికి ప్రవేశం కల్పించి, తరగతులు ప్రారంభించారు. 2020-21 విద్యా సంవత్సరంలో 125 మంది ఎంబీబీఎస్ విద్యార్థులతో మంగళగిరి సమీపంలో నిర్మించిన కొత్త క్యాంపస్‌లోకి మార్చారు.

2.తిరుపతిలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ని రేణిగుంట రోడ్డులో ఉన్న చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో 2015లో ప్రారంభించారు. రూ.700 కోట్ల అంచనా వ్యయంతో శాశ్వత భవన సముదాయాల నిర్మాణానికి పూనుకొన్నారు. 2015-16లో రూ.108 కోట్లు మంజూరు చేశారు. 2022 ఆగస్టులో ఏర్పేడు సమీపంలో నిర్మించిన కొత్త క్యాంపస్‌కు మార్చారు.

3.తిరుపతిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)ను తొలి మూడేళ్లకు (2015-18) రూ.137.30 కోట్లతో, 2015 ఆగస్టులో ప్రారంభించారు. తాత్కాలిక క్యాంపస్‌గా శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలను ఉపయోగించుకొంటున్నారు. రూ.1500 కోట్ల అంచనా వ్యయంతో శాశ్వత భవన సముదాయాల నిర్మాణం చేసే పనిలో ఉన్నారు. 2015-16 నుంచి రూ.113 కోట్లతో నిధుల మంజూరు మొదలైంది.

5.తాడేపల్లిగూడెంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (NIT) 2015 - 2016 విద్యా సంవత్సరంలో నెలకొల్పారు. మొదట తాత్కాలిక క్యాంపస్‌గా శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలను వినియోగించుకొన్నారు. రూ.400 కోట్ల అంచనా వ్యయంతో శాశ్వత భవన సముదాయాల ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.

6.విశాఖపట్నంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(IIM)ను 2015లో ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రారంభించారు. రూ.900 కోట్ల అంచనాతో కొత్త క్యాంపస్ నెలకొల్పడానికి చర్యలు చేపట్టారు. 2015-16లో రూ.83 కోట్లతో నిధులు మంజూరు చేయడం మొదలు పెట్టారు.

7.విశాఖపట్నంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (IIPE) సంస్థను 2017లో మొదలు పెట్టారు. యూనివర్సిటీకి అనకాపల్లి సమీపంలో 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో ఉన్నది. HPCL, IOCL, ONGC, GAIL, OIL, OIDB, BPCL, కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలు మరియు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐపీఈ నెలకొల్పబడింది.

8.అనంతపురంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కోటిక్స్(NACEN). 2024 జనవరిలో కొత్త క్యాంపస్‌ను ప్రధానమంత్రి ప్రారంభించారు.

9.విజయనగరంలో గిరిజన విశ్వ విద్యాలయంను నెలకొల్పారు.

10.కర్నూలులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని 2015లో ప్రారంభించారు. రూ.747 కోట్ల అంచనా వ్యయంతో మొదలుపెట్టారు. 2015-16లో రూ.58 కోట్లు మంజూరు చేయడంతో నిధుల కేటాయింపు మొదలయ్యింది.

11.నెల్లూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (IITTM)

12.నెల్లూరు సమీపంలోని తుప్పిలిపాలెంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ESSO-NIOT)

13.విజయవాడలో నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డిజైన్. ❑

# మోదీ టోపీలో ముగ్గురు సామంతులు

- సవ్యసాచి

**ఏపీలో మేనిఫెస్టోల యుద్ధం మొదలైంది. పార్టీల ఫ్యాక్టరీల్లో మేనిఫెస్టోలు తయారయ్యాయి. ఇవి ప్రజల మేనిఫెస్టోలు కావు. ఓట్ల కోసం పార్టీలు రూపొందించిన మేనిఫెస్టోలు. పార్టీలకు ప్రజలు ప్రభువులు కాదు. ఫక్తు ఓటర్లు మాత్రమే. అంతకు మించి లబ్ధిదారులు మాత్రమే. ఇప్పుడు రాష్ట్రంలో రెండు మేనిఫెస్టోల దుకాణాలు వున్నాయి. వాటి నిండా ప్రలోభ ఉచితాల సరుకులు వున్నాయి. ఆకర్షణీయ నినాదాలు ఉన్నాయి. ఇంటింటికి ఈ ప్రలోభ సరుకుల్ని ప్రచారం చేసే రంగు రంగుల కరపత్రాల పంపిణీ వుంది. ఓటర్లు తమకు ఏం కావాలన్నది సమస్య కాదు.**

పార్టీలు తమకు ఏమి ఇస్తారన్నదే ముఖ్యం. ఎవరిని ఎంచుకోవాలన్నది అంత తేలిక కాదు. ఒకరు ఒకటి ఇస్తామంటే మరొకరు రెండు అంటున్నారు. వారు పది అంటే వీరు పాతిక అంటున్నారు. ఇవి జవాబుదారీతనం లేని మేనిఫెస్టోలు. వీటికి పార్టీల అధినేతలే గ్యారంటీలు. ఎలా అమలు చేస్తారంటే మాకు అధికారం ఇవ్వండి చేసి చూపిస్తామని దబాయిస్తున్నారు. ఓటర్లు నాయకుల్ని నమ్మాలి. వారిని విశ్వసించాలి. ఈ ఓట్ల వేట మేనిఫెస్టోలలో ప్రజల విశ్వసనీయతే ఆ పార్టీలకు అసలు పరీక్ష. వైకాపా పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కుదేలు అయ్యింది. 'పిట్టను కొట్టు పొయ్యిలో పెట్టు' అన్నట్టుగా 'అప్పులు పట్టు గండం దాటు' అన్న స్థితి వుంది. సచివాలయాలతో సహా అన్నీ తాకట్టు పెట్టారట. ఇప్పుడు తెదేపా కురిపిస్తున్న వరాలు ప్రజల ఇళ్లలో ఎలా వర్షిస్తాయన్నది ఊహించుకోవాల్సింది. ఈ ఓట్ల వేట వీరులలో ఎవరు గెలుస్తారో చెప్పలేం. గెలిచేది ఎవరైనా ఫలితం ఒక్కటే. రోజూ టీవీలలో గోల్డ్ కంపెనీల ప్రకటనలు విన్నారు కదా ! 'మీరు ఎక్కడ్కైనా తాకట్టు పెట్టిన బంగారాన్ని ఒక్క క్షణంలో విడిపించి ఆ రోజు ఆన్‌లైన్ ధర చెల్లించి మిగిలిన సొమ్ము మీ చేతిలో పెడతాం' ఇప్పుడు ఇదే రాష్ట్రానికి వర్తిస్తుంది. తాకట్టు విడిపించడం వుండదు. అమ్మగా మిగిలితే సొమ్ము చేసుకోవడం తప్ప మార్గాంతరం వుండదు.

రాష్ట్రంలో నాలుగు పార్టీలు - వైకాపా, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఒక రాజకీయ నాటకం ఆడుతున్నాయి. తెలుగులో చాలా పొడుపు కథలు వున్నాయి. అవి ఎంతో ఆసక్తిని రేపుతాయి. ఊహాశక్తి వుంటే గాని విప్పడం సులువు కాదు. ఉదాహరణకు 'ఒక టోపీ కింద ముగ్గురు అన్నదమ్ములు' అన్న పొడుపు కథ వుంది. సమాధానం తాటిపండు అని ఊహించడం అంత తేలిక కాదు. కాని, మన రాష్ట్రంలో 'ఒక టోపీ కింద ముగ్గురు సామంతులు' అనే పొడుపు కథ వేస్తే దీనిని విప్పడానికి గొప్ప తెలివి అక్కరలేదు. ఇందులో తాటికాయంత రహస్యం లేదు. మోదీ టోపీ కింద చంద్రబాబు, పవన్, జగన్‌లు కళ్ల ముందు సాక్షాత్కరిస్తారు.

2019లో ఈ నలుగురు ఒకరి మీద ఒకరు పోటీ చేసుకున్నారు. కేవలం ఆరోపణలతో సరిపెట్టుకోలేదు. మాటల తూటాలు పేల్చుకున్నారు. విమర్శల కత్తులు దూసుకున్నారు. ప్రత్యేకంగా బీజేపీ మీద, మోదీ మీద విరుచుకుపడ్డారు. ఒకరు మోదీ అబద్దాల కోరు అన్నారు. మరొకరు హోదా ఇస్తామని పాచిపోయిన ప్యాకేజీ లడ్డూ ఇచ్చారన్నారు. మరొకరు మోదీ మెడలు వంచి హోదా తెస్తామన్నారు. 2019 ఎన్నికలలో బీజేపీ రాష్ట్రంలో చిత్తుగా ఓడిపోయింది. స్వయంగా మోదీ వచ్చి ప్రచారం చేసినా ఎక్కడా డిపాజిట్లు దక్కలేదు. ఒక శాతం ఓట్లు కూడా తెచ్చుకోకపోగా నోటాకంటే తక్కువగా ప్రజలు తిరస్కరించారు. మోదీ ప్రభంజనం ఏపీలో తుస్సుమంది. ఎన్నికలు పూర్తి కాగానే ఈ నాలుగు పార్టీల పోటీ నాటకం ముగిసింది. అంతా మోదీ పంచకు చేరారు. స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేశారు. పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వానికి అండగా వున్నారు. ఒక శాతం ఓట్లు లేని బీజేపీకి 25 పార్లమెంటు స్థానాలను దాసోహం చేశారు. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవంటారు. కాని, మోదీ టోపీ కింద కత్తులు దూసుకున్న వారంతా ఇమిడిపోయారు.

ఇప్పటికీ బీజేపీకి రాష్ట్రంలో ఉనికి లేదు. ఒంటరిగా పోటీ చేస్తే నోటానే గెలుస్తుంది. కాని ముగ్గురు సామంతులు దానికి ప్రత్యక్షంగా పరోక్షంగా బాసటగా వున్నారు. పంచతంత్రంలో 'అపరీక్షతకారికత్వం' అన్నది అనాలోచనపరుల ఐదో తంత్రం. ఇందులో సింహానికి ప్రాణం పోసి దానికి బల్కైన ముగ్గురు తాంత్రికుల కథ వుంది. ఈ ముగ్గురూ తమకు తెలిసిన తంత్ర విద్యను రాజు దగ్గర ప్రదర్శించడానికి పోతుంటే దారిలో ఒక సింహం ఎముకలు కనిపిస్తాయి. మొదటివాడు తన తంత్ర

**మిగతా 19వ పేజీలో**

# ఈ 'ఓట్ల పండుగ' ఓటర్లదేనా?



- రాజ్‌దీప్ సర్దేశాయి

**పద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికల మొదటి రెండు విడతల పోలింగ్ ముగిసింది. ఇంకా ఐదు విడతల పోలింగ్ జరగాల్సి వున్నది. ఇంతలో, ప్రచండ వేసవి గాడ్పులు, ఎన్నికల ప్రచార వేడి మిళితమై ఒక తీవ్ర ఉక్కపోతతో సతమతమవుతున్న దేశ ప్రజల ముందుకు అనుకోకుండా ఒక పెద్ద ప్రశ్న వచ్చింది : టీవీ స్టూడియోలలోను, విశాల సమాజంలోను రాజకీయ పార్టీల నాయకుల వాద ప్రతివాదాల హోరు ఎడతెగకుండా మిన్నంటుతున్నా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ ప్రజాస్వామిక 'పండుగ'లో పాల్గొంటున్న వారి సంఖ్య అంచనాల కంటే ఎందుకు తక్కువగా ఉన్నది?**

మండుతున్న ఎండా కాలం, పంట కోతల సమయం, సుదీర్ఘ వారాంతపు సెలవులు అనేవి పోలింగ్ శాతం తక్కువగా ఉండడాన్ని పాక్షికంగా మాత్రమే వివరిస్తాయి. నిజమేమిటంటే దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజాస్వామిక లోటు (ప్రజాస్వామిక సంస్థలు, వ్యవస్థలు తమ కార్యాచరణల్లో ప్రజాస్వామ్య సూత్రాలకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉండకపోవడం, పర్యవసానంగా ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల ప్రజల్లో అనాసక్తి, నిర్లిప్తత పెరిగిపోవడం వల్ల నెలకొనే పరిస్థితి) గణనీయంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మన ప్రజాస్వామ్యం అసమగ్రంగా ఉన్నది. సామాన్యుల ఆరాటాలను ఆర్టీలు, నేతలు పట్టించుకోవడం లేదు. కనుకనే సగటు ఓటరు తన ప్రతినిధిగా ఏ పార్టీ అభ్యర్థిని ఎన్నుకోవాలనే విషయమై అంతకంతకూ ఉత్సుకతను కోల్పోతున్నాడు. పార్లమెంటు సభ్యుడుగా తన విధ్యుక్త ధర్మాలను చిత్తశుద్ధితో నిర్వర్తించగలడనే భరోసాను వివిధ పార్టీల అభ్యర్థులలో ఏ ఒక్కరూ ఇవ్వలేకపోవడమే అందుకు కారణంగా చెప్పవలసి ఉన్నది.

ఎన్నికల ముందు రోజుల్లో విజయోత్సాహంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 'అబ్కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదాన్ని ఇచ్చింది, 400 సీట్లతో తమ పార్టీ విజయం సాధించగలదని ఆ పార్టీ శ్రేణులు ఆత్మవిశ్వాసంతో చెప్పాయి. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం ఇప్పటికే ఖాయమైపోయిందని, అయితే 1984 సార్వత్రిక ఎన్నికలలో 414 నియోజకవర్గాలను గెలుచుకున్న రాజీవ్ గాంధీ రికార్డును ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధిగమించగలరా అన్న విషయం మాత్రమే మిగిలివుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

ఎన్నికల ప్రచారం ఊపందుకుని, రెండ విడతల పోలింగ్ సైతం ముగిసిన ప్రస్తుత తరుణంలో అధికార, ప్రతిపక్షాలు రెండింటికీ ఓటర్ల విషయమై ప్రాథమిక వాస్తవాలు తెలిసి వచ్చాయి. ఏ రాష్ట్రంలోనూ అటు అధికార పక్షం/ కూటమికి గానీ, ఇటు ప్రతిపక్షం/కూటమికి గానీ అనుకూల పవనాలు వీయడం లేదన్నది స్పష్టంగా కన్పిస్తున్నది. ఓటర్లు ఏ పక్షం వైపు మొగ్గు చూపడం లేదనేది విశదమయింది. (మొదటి విడతలో పోలింగ్ శాతం అంచనాలకంటే 3 శాతం తక్కువగా నమోదయింది). వెన్వెంటనే ప్రధాని మోదీ, ఓటర్లలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం ప్రారంభించారు. 2047 సంవత్సరం నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మిస్తామన్న హామీతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ మొదటి దశ ఎన్నికలు ముగియగానే మాట మార్చింది. ఆశాభావ రాజకీయాల నుంచి భయాన్ని సృష్టించే రాజకీయాలకు మారింది. ఆశాభావం, భయం అసాధారణమైన సహచరులు. భయపూరిత రాజకీయాలు హానికరమైనవి, విధ్వంసకరమైనవి కాగా ఆశాభావ రాజకీయాలు సానుకూలమైనవి, నిర్మాణాత్మకమైనవి, సృజనాత్మకమైనవి. 2024 సార్వత్రిక ఎన్నికలు ఒక ఆశాభావంతో ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఆశాభావం శీఘ్రగతిన అర్ధ సత్యాలు, అబద్ధాలను నిర్భయంగా వ్యాపింపజేసే ఒక భయపూరిత వాతావరణంలోకి జారిపోయింది.

రాజస్థాన్‌లో ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ తన శ్రోతల్లో తీవ్ర సంకుచితత్వ భావాలను రెచ్చ గొట్టేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ మానిఫెస్టో ముస్లింలీగ్ మానిఫెస్టోలా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ వారు అధికారంలోకి వస్తే మీ ఆస్తులను స్వాధీనం చేసుకుని చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తారని మోదీ హెచ్చరించారు. అంతే కాకుండా స్త్రీల మెడల్లో ఉన్న మంగళసూత్రాలను సైతం తెంచుకు పోతారని కూడా ఆయన ఆరోపించారు. ఏ రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి ప్రధానమంత్రి ఇటువంటి ఆరోపణలు చేశారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పార్టీకి ప్రధాన మద్దతుదారులుగా ఉన్న హిందూత్వవాదులను రెచ్చగొట్టి, సుపరిచిత 'శత్రువు'కు వ్యతిరేక పోరాటంలో వారు పాల్గొనేలా చేయడమే

ఆయన లక్ష్యం. ఎన్నికలలో బీజేపీ ఒక విజేతగా నిలవటంలో భారతీయ ముస్లింలు కీలక పాత్ర వహిస్తున్నారు. 1990ల్లో వారిని 'బాబర్‌కి ఔలద్' అని పరిహసించారు. ఇప్పుడు వారిని 'ఘస్ పేటియాన్'(చొరబాటుదారులు) అని నిందిస్తున్నారు.

బీజేపీ మళ్లీ మతతత్వ వక్రీకరణలకు పాల్పడుతుండగా, కాంగ్రెస్ సైతం ఊహాత్మక భయాల ఆధారంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచార సభలలో భారత రాజ్యాంగం ప్రతిని ఎత్తిచూపుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు రిజర్వేషన్లను శాశ్వతంగా రద్దు చేసేందుకు రాజ్యాంగానికి సవరణలు చేస్తుందని హెచ్చరిస్తున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలతో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా మండల్ 'సామాజిక న్యాయ'వాదుల మద్దతును కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ఆరాటపడుతోంది.

అయితే సగటు ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ ధోరణులు ఏవీ పట్టడం లేదు. ఆ పార్టీల ప్రచారాలకు వారు స్పందించడంలేదు. జీవనోపాధి సమస్యలతో సతమతమవుతున్న సగటు ఓటర్లు వాటి నుంచి బయటపడేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఆసేతు హిమాచలం పర్యటించండి–నాయకులు, సామాన్యపౌరుల మధ్య సంబంధరాహిత్యం ఎంతగా ఉన్నదో స్పష్టమవుతుంది. గత ఐదేళ్లుగా అసంఖ్యాక భారతీయులు, కోవిడ్ మహమ్మారి, సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, ధరల పెరుగుదల, ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయాలు పడిపోవడం మొదలైన సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారిలో సుభిక్ష భావన (ఫీల్‌గుడ్) సృష్టించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ కారణంగానే రాజకీయ నాయకుల ప్రసంగాలు, హామీలు వారినే మాత్రం ఆకట్టుకోలేకపోతున్నాయి. నగరాలలో సాయం సంధ్యల్లో వివిధ సభలు, సమావేశాలలో పాల్గొనే వారికి 'ప్రభవిస్తున్న నవభారతం' అనేది ఒక ఉత్తేజకర చర్చనీయాంశం కావచ్చుగానీ దుర్భర పరిస్థితులు ఉన్న గ్రామీణ భారతంలో వాటర్ ట్యాంకర్ ఎనిమిది రోజులకు ఒకసారి మాత్రమే రావడం అనేది ఒక కఠోర వాస్తవం. మరి 'నవభారత్' గురించిన ఉద్ఘాటనలు సగటు పౌరులను ఎలా ఉత్తేజపరుస్తాయి? రాజకీయ నాయకుల ప్రసంగాలకు, సంఖ్యానేక ప్రజల వాస్తవ జీవన పరిస్థితులకు మధ్య తీవ్ర అంతరం ఉంటోంది. నేతల ఈ నిర్లక్ష్య వైఖరులే అత్యధిక ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ పట్ల ఉదాసీనతను కాకపోయిప్పటికీ ఏ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలనే విషయమై ఒక నిశ్చయానికి రాలేని మందకొడితనాన్ని కలిగిస్తున్నాయి.

మహారాష్ట్రనే చూడండి. పశ్చిమ భారతంలోని ఈ ప్రధాన రాష్ట్రంలో గత మూడేళ్లలో అనేక రాజకీయ ఉపద్రవాలు సంభవించాయి. ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. విధేయతలు మార్చుకోవడం, రహస్య పొత్తులు పెట్టుకోవడం మొదలైన పరిణామాలు రాష్ట్ర పాలనపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తల సైతం ఎన్నికల సంబంధిత వ్యవహారాలలో పాల్గొనేందుకు ఎంత మాత్రం ఆసక్తి చూపడం లేదు.

రాజకీయవేత్తలు తమ ఆస్తిపాస్తులను పెంచుకుంటూ పదవులను అధిష్ఠిస్తుండగా సగటుకంటే తక్కువ వర్షపాతంతో వ్యవసాయరంగంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై సంపన్నులు విలాస జీవితాలు గడుపుతుండగా ట్యాంకర్ మాఫియా గ్రామీణ మహారాష్ట్రలో ఒక పెద్ద బకెట్ నీటిని రూ. 200కి విక్రయిస్తోంది! రాజకీయ నాయకులు పెద్ద పెద్ద హామీలు ఇచ్చి వాటిని ఏ మాత్రం నెరవేర్చకపోతుండడంతో వారి పట్ల గ్రామీణ ప్రాంతాల ఓటర్లలో భ్రమలు తొలగిపోయాయి. ఇప్పుడు ఎన్నికల విషయంలో గ్రామీణ ఓటర్ల ఆలోచనలకు ఈ వాస్తవాలే ఆధారంగా ఉంటున్నాయి అంటే ఎన్నికల పట్ల వారి మనోవైఖరులు ఎలా ఉన్నాయనేది ఎవరికి వారే అర్థం చేసుకోవచ్చు. రాజకీయ నాయకులు, ముఖ్యంగా అధికారంలో ఉన్న వారి పట్ల వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 'మోదీ గ్యారంటీ'లకు సంబంధించిన పోస్టర్లు పల్లె పల్లెన ప్రతి వీథిలోనూ వెలసినా పాలకుల పట్ల వారి వ్యతిరేకతను తగ్గించలేకపోతున్నాయి. అవును, ప్రజల్లో ప్రబలిన ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే బీజేపీ వంద మందికి పైగా సిట్టింగ్ ఎంపీలను మార్చివేయడం జరిగింది.

**ఈ వాస్తవాలు మరొక పెద్ద ప్రశ్నను మన ముందుంచుతున్నాయి :** జీవన పోరాటంలో అలసిపోయిన ఓటర్ అసంతృప్త మనోవైఖరి నుంచి ఎన్నికలలో లబ్ధి పొందేదెవరు ? నష్టపోయేదెవరు ? బీజేపీ సహేతుకంగానే తన విజయంపై ఆత్మ విశ్వాసంతో ఉన్నది. పటిష్ఠ ఎన్నికల యంత్రాంగం, అందునా ప్రజల విశ్వాసాన్ని మరెవరికంటే ఎక్కువగా పొందుతున్న ఒక శక్తిమంతమైన నాయకుడి నిర్ణయాలు, నిర్దేశాలకు పని చేస్తుండడంతో తాము వరుసగా మూడోసారి కూడా విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు పూర్తి నమ్మకంతో ఉన్నాయి. కాంగ్రెస్ ఒక ఆశాభావంతోనే పోరాడుతున్నది. ఓటర్ల ఉదాసీనత, సరిసమాన స్థాయిలో పోటీ పడుతున్న నియోజకవర్గాలలో ప్రత్యర్థితో గట్టిగా పోరాడే అవకాశాన్ని కల్పిస్తుందనే ఆశ కాంగ్రెస్‌కు నిండుగా ఉన్నది. అయితే భారత ప్రజాస్వామ్య సంక్షోభం బీజేపీ వర్సెస్ ప్రతిపక్షం అనే ద్వంద్వత్వానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది చాలా విస్తృతమైనదీ, తీవ్రమైనదని చెప్పి తీరాలి. ఏమైనా ఎన్నికలలో ఏ పార్టీ గెలిచినా ఓటర్లే ఎక్కువగా నష్టపోతున్నారనే భావన ప్రజల్లో బాగా పెరిగిపోతోంది. పార్టీలు, నాయకుల పట్ల ప్రజల ఈ విశ్వాస రాహిత్యమే భారత ప్రజాస్వామ్య సంక్షోభానికి ఒక తిరుగులేని తార్కాణం. ❑

# నేతల భావ దారిద్ర్యం.. ఓటర్ల ఉదాసీనత



- ఎ.కృష్ణారావు

అడుగు బయటికిపెడితే చాలు, వేడి గాలులు వేగంగా ముఖానికి తగులుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సహా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ (ఎన్డీఎంఏ) ప్రజలను హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో నేతలు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు ప్రజల మధ్య చెమటోడ్చి తిరుగుతున్నారు.

> **చాలాచోట్ల ఎండిపోతున్న పంటలు, బోరు బావులు, కరువు పరిస్థితులు, మంచినీటి సమస్య, విద్యుత్ కోతల మధ్య ప్రజలు నేతల ప్రసంగాలను ఉదాసీనంగా వింటున్నారు. ఒకరు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతుంటే మరొకరు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. రైతులు, రైతు కూలీలే కాక, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు. ప్రయాణీకుల కోసం ఆశగా ఎదురుచూసే ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, సెవెన్ సీటర్లు నడుపుకునేవారు, జొమాటో, స్విగ్గీ వంటి సంస్థల్లో పనిచేసే ప్లాట్ ఫారమ్ వర్కర్లు మండుటెండల్లో జీవనోపాధి చేసు కోవాల్సిందే. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే వీరు మొత్తం శ్రమ జీవుల్లో 80 శాతంపైగా ఉంటారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చి నా వీరి జీవన పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు తక్కువే.**

ఈ పరిస్థితుల్లో తొలి దశలో 102 స్థానాలకు జరిగిన ఎన్నికలు చాలా పేలవంగా, అనాసక్తికరంగా జరగడంలో ఆశ్చర్యం లేదు. గతంలోకంటే ఈసారి నాలుగు శాతం తక్కువే ఓటింగ్ జరిగింది. దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇవే చివరి ఎన్నికలు అని ఇండియా కూటమి ప్రచారం చేస్తే, ఒక అధునాతన భారత నిర్మాణం కోసం తాను కృషి చేస్తున్నానని, 2047 కల్లా అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని మోదీ ప్రచారం చేస్తున్నారు. కాని ఈ ప్రచారాలేవీ ఓటర్లపై ప్రభావం చూపడం లేదు. దేశభక్తి, జాతీయవాదం, వికసిత్ భారత్, సామాజికన్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఫాసిజం, లౌకికవాదం వంటి పదాలు నేతల పెదాల నుంచి బయటపడి గాలిలో కలిసిపోతున్నాయి. కాని ఓటర్లు నిర్లిప్తంగా, నిర్వికారంగా, నిశ్చల దృక్కులతో అన్ని ప్రసంగాలను వినడం తప్ప చేయదగింది ఏమీ లేదు. మండుటెండలు, తమ ఈతిబాధలకన్నా నాయకుల భావ దారిద్ర్యాన్ని చూసే ఎన్నికలపై వారు ఏవగింపు ప్రదర్శిస్తున్నారేమో అనిపిస్తోంది.

గత ఎన్నికల్లో బీజేపీ మొత్తం సీట్లు గెలుచుకున్న మధ్యప్రదేశ్‌లో 20 ఏళ్లలో తొలిసారి తక్కువ ఓటింగ్ జరిగింది. రాజస్థాన్‌లో ఓటింగ్ 64 నుంచి 57 శాతానికి పడిపోయింది. బిహార్ లాంటి చోట్ల కేవలం 53 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. మోదీ అనేకసార్లు పర్యటించినా తమిళనాడులో గతంలో కంటే తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. కేవలం వేడిగాలులు, మండుటెండల వల్ల ఓటింగ్ శాతం తగ్గిందేమో అనుకుంటే ఉత్తరాఖండ్ వంటి పర్వత ప్రాంతాల్లో కూడా గతంలో కంటే ఆరు శాతం తక్కువగా నమోదైంది. ఓటు హక్కు విలువ గురించి సినిమా తారలనుంచి ఎందరో సెలబ్రిటీలతో ఉధృతంగా ప్రచారం చేయించినా ప్రయోజనం కనపడడం లేదు.

తన అద్భుత ప్రసంగాలకు ప్రజలు పరవశులై భారత దేశాన్ని శక్తిమంతమైన దేశంగా మార్చేందుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తారని భావించి పెద్ద సంఖ్యలో ఓటు వేస్తారని భావించిన మోదీ మొదటి దశలో ఓటింగ్ జరిగిన తీరును చూసి నిరాశకు గురయ్యే ఉంటారు. యువ ఓటర్లను, ప్రధానంగా తొలిసారి ఓటర్లైన వారిని ఆకర్షించేందుకు ఆయన పదేపదే చేసిన ప్రసంగాలు వృథా అయినట్లు కనిపిస్తోంది. నిజానికి 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతలో కేవలం 38 శాతం మంది మాత్రమే ఓటు హక్కుకు నమోదు చేసుకోవడమే ఈ దేశంలో యువతలో ఎన్నికల రాజకీయాల పట్ల ఏర్పడుతున్న అనాసక్తికి నిదర్శనం. మోదీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆయన ఎక్కడకు వెళ్లినా 'మోదీ, మోదీ' అని నినాదాలిచ్చిన యువత ఎక్కడకు వెళ్లింది? మోదీ పట్ల యువతకు ఆసక్తి తగ్గిపోతోందా? పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తీరు, మోదీ ఏకఛత్రాధిపత్యం, ఎన్నికల్లో

అక్రమాలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, ప్రభుత్వ దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ఇవన్నీ ప్రజలకు ముఖ్యంగా యువతకు వ్యవస్థల తీరు పట్ల ఏహ్యాభావం పుట్టిస్తున్నాయా?

ఎన్నికల ప్రక్రియ ఒక ప్రహసనంగా మారడం కూడా ఓటర్ల ఉదాసీనతకు కారణమేమో. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ సూరత్‌లో బీజేపీ అభ్యర్థి ముఖేశ్ దలాల్ గెలిచినట్లు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవంగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థి నిలేష్ కుంభాని తనను ప్రతిపాదించిన ముగ్గురిలో ఒక్కరిని రిటర్నింగ్ అధికారి ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యారు. దీనితో ఆయన నామినేషన్ ను తిరస్కరించారు. ఆ వెంటనే పోటీలో ఉన్న బీఎస్పీ అభ్యర్థి సహా మిగతా 8 మంది నాటకీయంగా తమ నామినేషన్లనూ ఉప సంహరించుకున్నారు. ఈ పరిణామం తర్వాత నీలేష్ కుంభానీ అదృశ్యమయ్యారు. ఎవరికీ ఫోన్‌లో దొరకకుండా తప్పించుకు న్నారు. ఆయన ఇంటిముందు కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆయన ఏదో ఒకరోజు సుముహూర్తంలో బీజేపీలో చేరడం ఖాయమని వార్తలు వస్తున్నాయి. మోదీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ ఎన్నికల్లో బీజేపీకి తొలి విజయం ఈ రకంగా లభించింది. నెలన్నర క్రితం చండీగఢ్ మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి మేయర్ పీఠం దక్కేందుకు రిటర్నింగ్ అధికారి స్వయంగా బ్యాలట్ పత్రాలను చెరిపేసిన ఉదంతం జనం మరిచిపోకముందే సూరత్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ గెలుచుకున్న తీరు ప్రజాస్వామ్య ప్రహసనానికి మరో నిదర్శనంగా నిలిచింది. మునిసిపల్ ఎన్నికలైనా, లోక్‌సభ ఎన్నికలైనా విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు బీజేపీకి ఆ లక్ష్యం ఎలాగైనా సాధించేందుకు ప్రయత్నిస్తుంది. అందుకు అవలంబించే మార్గాలపై ఎన్ని తీవ్ర విమర్శలు ఎదురైనా అది విననట్లు నటిస్తుంది.

మొదటి దశ ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి గురించి, ప్రతి పక్షాల కూటమి లోపాల గురించి ఎక్కువగా మాట్లాడిన మోదీ రెండవ దశలో తన శైలిని మార్చి ప్రజలను మత ప్రాతిపదికన తన వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. నిజానికి ఇదే ఆయన సహజశైలి. గుజరాత్‌లో ఈ శైలి వల్లనే ఆయన హిందువుల ఓట్లను పూర్తిగా తన వైపునకు తిప్పుకుని విజయవంతం కాగలిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని, హిందువుల స్త్రీల మంగళ సూత్రాలపై కూడా కాంగ్రెస్ నేతల కళ్లు పడతాయని ప్రధానమంత్రి అంతటిస్థాయి వ్యక్తి ఉత్తరాదిన ఎన్నికల ప్రసంగాల్లో విమర్శించడం మత ప్రాతిపదికన ఓట్లను చీల్చే ప్రయత్నంలో భాగమేనని ఎవరికైనా అర్థమవుతుంది. ప్రజల కష్టార్జితాన్ని, విలువైన వస్తువులను చొరబాటుదారులకు, ఎక్కువ మంది సంతానం ఉన్న వారికి దోచి పెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ సామాజిక వర్గాలకు జరగాల్సిన న్యాయం గురించి మాట్లాడుతూ, వనరుల పంపిణీ లో ముస్లింలకు తొలి హక్కు ఉంటుందని మన్మోహన్ సింగ్ 18 సంవత్సరాల క్రితం క్రింద అన్న వ్యాఖ్యల్నీ మోదీ తనకు అనుకూలంగా మార్చుకున్నారు.

జీ-20 లాంటి సమావేశాల్లో, సెమినార్లలో, మన్ కీ బాత్‌లో ఎంతో హుందాగా మాట్లాడుతున్నట్లు కనిపించే నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం, ప్రత్యర్థులను ఎదుర్కోవడం వరకు వచ్చే సరికి ఆయనలో అపరిచితుడు కనిపిస్తారు. శ్రావణ మాసంలో ప్రతిపక్ష నేతలు మాంసం తింటారనే వ్యాఖ్యల్నీ చేసేందుకు ఆయన వెనుకాడడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అనేక అంశాలను విస్మరించి, దాన్ని ముస్లిం లీగ్ మేనిఫెస్టోగా అభివర్ణించారు. గుజరాత్ ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా ప్రచారం చేసిన రోజుల నుంచి ఆయన ఈ వ్యూహాన్ని అవలంబిస్తున్నారు. మత ప్రాతిపదికన చేసే ప్రసంగాలకు ఒక స్థాయి అంటూ ఉండాలని ఆశించడం అమాయకత్వం. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా ఈ ప్రసంగాలకు అడ్డుకట్ట వేస్తుందని అనుకోవడం మరీ అమాయకత్వం.

మోదీ వ్యాఖ్యల విషయమై ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదుపై మీడియా అడిగిన ప్రశ్నలకు కనీసం వ్యాఖ్యానించడానికి కూడా ఎన్నికల కమిషన్ నిరాకరించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లో ఓటింగ్ శాతం చూసిన తర్వాత హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడమే సరైన మార్గమని మోదీ భావించి ఉంటారా అన్న అనుమానాలకు ఆస్కారం కలుగుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ మధ్యప్రదేశ్‌లో 29 సీట్లకు 28 సీట్లు, రాజస్థాన్‌లో 25కు 24 సీట్లు, ఉత్తరాఖండ్‌లో 5కు 5 సీట్లు గెలుచుకుంది. ఈ సారి బీజేపీ ఇవే ఫలితాలు తిరిగి సాధిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. ఓటింగ్ శాతం తగ్గడంతోపాటు ఎగ్జిట్ పోల్స్ గురించి బీజేపీకి అనధికారికంగా సమాచారం లభించే ఉంటుంది.

ఈ నేపథ్యంలో బీజేపీ ఆశిస్తున్న 400 సీట్ల లక్ష్యాన్ని ఎంతమేరకు సాధించగలదా అన్న చర్చ సాగుతోంది. మతపరమైన భావోద్వేగాలు కల్పించడం తప్ప తమకు వేరే మార్గం లేదని బీజేపీ భావిస్తోందా? ఈ మార్గంలోనైనా బీజేపీ సఫలీకృతం కాగలదా ? ఏమైనా ఒక్కో దశ సమీపిస్తున్న కొద్దీ దేశంలో బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు లక్ష్మణ రేఖల్ని దాటి అన్ని రకాల మార్గాల్నీ అవలంబించడంలో ఆశ్చర్యం లేదు. అది వాటి జీవన్మరణ సమస్య. కాని ఈ క్రమంలో ప్రజాస్వామ్యం పట్ల ప్రజల విశ్వాసం మరణించకుండా చూసుకోవడం అందరికీ అవసరం. ❑

# కాంగ్రెస్ మానిఫెస్టో : మోదీ కొత్త భాష్యం!



- పి.చిదంబరం

**ప్రధాన ప్రతిపక్షం అయిన భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అపూర్వ సుహృద్భావాన్ని సహకార వైఖరిని చూపారు! ఇటీవల కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోను తిరగ రాసి అందులో తన ఆంతరతమ (ఇన్నర్ మోస్ట్) ఆలోచనలు, భావాలను చేర్చే కార్యభారాన్ని ఆయన స్వచ్ఛందంగా తన మీద వేసుకున్నారు. మునుపెన్నడూ జరగని ఈ పని రాజకీయచర్చ గుణాధిక్యతను పెంచుతుందని ఆయన విశ్వసించారు. పాఠక మహాశయా, గతవారం చోటు చేసుకున్న సంచలనాత్మక రాజకీయ పరిణామంపై మహా ఉదార వైఖరితో నేను ఇవ్వగల వివరణ, చేయగల వ్యాఖ్య అది.**

ఆ పరిణామం వెనుక ఆసక్తికరమైన కథ ఒకటి ఉన్నది. ఈ నెల 14న బీజేపీ మానిఫెస్టో విడుదలయింది. రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని ఒక కమిటీ రూపొందించిన ఆ ఎన్నికల ప్రణాళిక పట్ల నరేంద్రమోదీ ఏ మాత్రం సంతోషంగా లేరని రాజకీయ పరిశీలకులు మొదటి నుంచీ ఘంటాపథంగా చెప్పుతున్నారు. తాము రూపొందించిన మానిఫెస్టో ఒక రాజకీయ పార్టీ ఎన్నికల ప్రణాళిక కాదని అంగీకరిస్తూ 'పార్టీకి కేంద్రంగా భాసిల్లుతున్న' ఒక నాయకుడి ప్రజ్ఞా పాటవాలకు అది ఒక ప్రశంస అని రాజ్‌నాథ్‌సింగ్ సారథ్యంలోని ఆ కమిటీ పేర్కొంది. ఆ డాక్యుమెంట్‌ను 'మోదీకి గ్యారంటీ' అని పేరు పెట్టడం ద్వారా నరేంద్ర మోదీ పట్ల తన విధేయతను ఆ కమిటీ ప్రదర్శించింది. అయితే మోదీ సరిగ్గానే ఊహించినట్టు, విడుదలయిన కొద్ది గంటలలోనే 'మోదీకి గ్యారంటీ' ఎటువంటి ఆచూకీ లేకుండా పోయింది. ఇప్పుడు బీజేపీ మానిఫెస్టో గురించి నరేంద్ర మోదీతో సహా ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు.

నరేంద్ర మోదీ 'మోదీకి గ్యారంటీ'ని ఒక చెత్త డాక్యుమెంట్‌గా కొట్టివేయలేరు. ఆ ప్రణాళికను రూపొందించిన కమిటీ అసమర్థంగా తన బాధ్యతను నిర్వర్తించిందని తప్పుపట్టలేరు. రాజ్‌నాథ్ సింగ్ నాయత్వంలోని కమిటీకి ఏవో అజ్ఞాత ఉద్దేశాలనూ ఆపాదించలేరు. ఇలా ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ కాంగ్రెస్ మానిఫెస్టోను తీసుకుని, ఆ ప్రణాళికపై తన వ్యాఖ్యానంతో దానికి మరింత ప్రచారాన్ని కల్పించి, పాఠక జనాన్ని మరింతగా పెంచేందుకు నిర్ణయించుకున్నారు. మోదీ నిర్ణయం భారతీయ సారస్వత మహా సంప్రదాయాలకు అనుగుణంగా ఉన్నది. మన సంప్రదాయంలో మౌలిక కృతుల కంటే వాటిపై భాష్యాలు, వ్యాఖ్యానాలకే ఎక్కువ ప్రాధాన్యమున్నది.

కాంగ్రెస్ మానిఫెస్టోలో నరేంద్రమోదీ చేసిన మార్పుల్లో రత్నాల లాంటి మాటలు ఉన్నాయి. అవేమిటో చూడండి: కాంగ్రెస్ అధికారానికి వస్తే ప్రజల భూములు, బంగారం, ఇంకా ఇతర విలువైన ఆస్తులను ముస్లింలకు పంపిణీ చేస్తుంది. ప్రతి ఒక్కరి ఆస్తి, స్త్రీల సొత్తు అయిన బంగారం, గిరిజన కుటుంబాల వద్ద ఉన్న వెండి విలువ తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా ఒక సర్వేను నిర్వహిస్తుంది. ఆ ఆస్తులను సొంతదారుల నుంచి లాక్కొంటుంది. ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన భూమి, నగదును కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేస్తుంది. దేశ సహజ వనరులపై మొదటి హక్కు ముస్లింలదేనని డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్నారు. ఆయన ఈ ఉద్ఘాటన చేసిన సభలో(గుజరాత్ ముఖ్యమంత్రిగా) నేనూ ఉన్నాను. కాంగ్రెస్ మీ మంగళసూత్రాన్ని, స్త్రీ ధనాన్ని తీసుకుని, అధిక సంతానం ఉన్న వారికి ఇస్తుంది. మీకు స్వగ్రామంలో ఒక ఇల్లు, పట్టణంలో ఒక చిన్న ఫ్లాట్ ఉంటే ఆ రెండు గృహాలలో ఒకదాన్ని కాంగ్రెస్ తీసుకుని ఎవరో ఒకరికి ఇస్తుంది.

మోదీ స్ఫూర్తితో ఆయన విశ్వసనీయ సహచరుడు, సలహాదారు అమిత్ షా ఇలా అన్నారు : దేవాలయాల ఆస్తులను కాంగ్రెస్ స్వాధీనం చేసుకుని, పంపిణీ చేస్తుంది. ఇక రాజ్‌నాథ్ సింగ్ తన వంతుగా ఇలా అన్నారు : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను కైవసం చేసుకుని, చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తుంది. ఈ వ్యాఖ్య చేసిన మరుసటి రోజే రాజ్‌నాథ్ సింగ్ మరొక 'సత్యాన్ని' వెల్లడించారు: సాయుధ బలగాలలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లను ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ వ్యాఖ్యాతల సంఖ్య పెరిగిపోయి, ఒకరిని మించి ఒకరు పోటా పోటీగా వివిధ అంశాలపై వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ 'వారసత్వ పన్ను'ను ప్రవేశ పెట్టనున్నదని నరేంద్ర మోదీ కనుగొన్నారు! వెన్వెంటనే దాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌ను దుయ్యబట్టడం ప్రారంభించారు.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రంగంలోకి దిగారు. వారసత్వ పన్ను భావనపై తన అపార పాండిత్యాన్ని వెల్లడించారు. 1985లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టేట్ సుంకం (ఇది ఒక

విధమైన వారసత్వ పన్ను)ను రద్దు చేసిందని, 2015లో బీజేపీ ప్రభుత్వం సంపద పన్నును రద్దు చేసిందన్న విషయాలు ఆమెకు తెలిసినట్టు లేదు. అయితే ఇందుకు ఆమెను క్షమించవచ్చు.

కాంగ్రెస్ మానిఫెస్టోపై ఈ సమన్వయ దాడి ఎప్పుడు, ఎందుకు ప్రారంభమయిందో చూడడం కష్టమేమీ కాదు. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ అనంతరం ప్రధానమంత్రి కార్యాలయాన్ని, బీజేపీని భయాందోళనలు ఆవహించాయి. ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని జలోర్, బాన్సవారాలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలలో కాంగ్రెస్ మానిఫెస్టోపై తీవ్ర విమర్శలు చేయడాన్ని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఆయన విమర్శలు విద్వేషంగా, విపరీతంగా ఉన్నాయి. ఆయన మంత్రివర్గ సహచరులు ముందు వెనుక ఆలోచించకుండా వ్యాఖ్యలు, విమర్శలు చేయసాగారు.

ఈ ఉన్మాద విమర్శలను నిలిపివేయాలని అధికారపక్షానికి విజ్ఞప్తి చేయడం మీడియా విధ్యుక్త ధర్మం. అయితే వార్తా పత్రికలు ఆ విధిని విస్మరించి వివాదాస్పద అంశాలను 'వివరించాయి'. గంభీరమైన సంపాదకీయాలు రాశాయి. టీవీ ఛానెల్స్ రాజకీయ, ఆర్థిక రంగ ప్రముఖులతో ఇంటర్వ్యూలు ప్రసారం చేశాయి. నిపుణుల బృందాలతో చర్చలు నిర్వహించాయి. కాంగ్రెస్ మానిఫెస్టోపై నరేంద్ర మోదీ ప్రారంభించిన విమర్శలు అదే రీతిలో మరింతగా ఉధృతమయ్యాయి.

ఏప్రిల్ 5, 19 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ప్రజల మాటా మంతీలో కాంగ్రెస్ మానిఫెస్టో ఒక ప్రధానాంశంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ మీద అన్ని వర్గాల వారూ విస్తృతంగా చర్చించుకున్నారు. ఆ హామీలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక సర్వే, నిర్వహణ, కులాలవారీ జన గణన, విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఉపసంహరించడం, గ్రామీణ ఉపాధి హామీ కూలీల దినసరి వేతనాన్ని రూ.400కి పెంచడం, పేద కుటుంబాలకు మహాలక్ష్మి ఆర్థిక సహాయ పథకం, వ్యవసాయక ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, వ్యవసాయ రుణాల మాఫీ విషయమై ప్రభుత్వానికి తగు సలహా ఇచ్చేందుకు ఒక కమిషన్ నేర్పాటు చేయడం, యువతకు అప్రెంటిస్ షిప్ హక్కు కల్పించడం, అగ్నివీర్ పథకం రద్దు, కేంద్ర ప్రభుత్వంలోని 30 లక్షల ఉద్యోగ ఖాళీలను ఒక ఏడాదిలోగా భర్తీ చేయడం మొదలైనవి.

కాంగ్రెస్ మేనిఫెస్టో 'లోకసభ ఎన్నికల హీరో' అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభివర్ణించారు. చాలా యథార్థమైన అభివర్ణన అది. కాంగ్రెస్ సంకల్ప పత్రంపై స్టాలిన్ అభిప్రాయం మోదీకి కోపం తెప్పించి ఉంటుంది. కనుకనే కాంగ్రెస్ మానిఫెస్టోను ఒక విలన్‌గా తూర్పారపట్టేందుకు నిర్ణయించుకున్నారు. మోదీ దురదృష్టమేమిటంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఏ అంశమూ తప్పు పట్టేందుకు వీలు లేనిదే. అందుకే కాంగ్రెస్ సంకల్ప పత్రంపై మోదీ విమర్శలను ప్రజలు హర్షించడం లేదు. దీంతో ఒక దెయ్యం రాసిన మానిఫెస్టోను ఊహించుకుని దాన్ని దుయ్య బడుతున్నారు! ఇది, కాంగ్రెస్ పార్టీ నిజ మేనిఫెస్టోకు బీజేపికి చెందిన ప్రధానమంత్రి ఒకరు ఇవ్వగల ఒక అంతిమ ప్రశంస అని నేను భావిస్తున్నాను.

బీజేపీ మూడోసారి విజయం సాధించి నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అయితే ఎటువంటి వక్రీకరణలు, అసత్యాలు, నిందలు, దుర్భాషలను చవిచూడవలసివస్తుందో ప్రజలు తెలుసుకునేలా చేసినందుకు 'థాంక్యూ, ప్రైమ్ మినిస్టర్' అని ఆయనకు కాంగ్రెస్ ధన్యవాదాలు చెప్పాలి. మానిఫెస్టోలను పునః రచించడంలో విశేష ప్రతిభా సమన్వితంగా పట్టభద్రుడైన నరేంద్రమోదీ భారత రాజ్యాంగాన్ని మళ్లీ రాయవచ్చు సుమా!

'మోదీకీ గ్యారంటీ'ని ఒక చెత్త డాక్యుమెంట్‌గా నరేంద్ర మోదీ కొట్టివేయలేరు. ఆ ప్రణాళికను రూపొందించిన కమిటీ తన బాధ్యతను అసమర్థంగా నిర్వర్తించిందని తప్పుపట్టలేరు. రాజ్‌నాథ్ సింగ్ నాయత్వంలోని ఆ కమిటీకి ఏవో ఉద్దేశాలనూ ఆపాదించలేరు. ఇలా ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ కాంగ్రెస్ మానిఫెస్టోను తీసుకుని, ఆ ప్రణాళికపై తన వ్యాఖ్యానంతో దానికి మరింత ప్రచారాన్ని కల్పించి, పాఠక జనాన్ని పెంపొందించేందుకు నిర్ణయించుకున్నారు! ❑

# మోదీ టోపీలో ముగ్గురు సామంతులు

**13వ పేజీ తరువాయి**

విద్యతో ఆ ఎముకలతో సింహం అస్తి పంజరాన్ని రూపొందిస్తే, రెండోవాడు దానికి రక్త మాంసాలు జత చేస్తాడు. మూడో వాడు దానికి ఊపిరిపోస్తాడు. సింహం లేస్తుంది. జూలు విదిలిస్తుంది. ఒకరి తర్వాత మరొకరిని వెంటాడి చంపుతుంది.

మోదీ టోపీ కింద చేరిన ముగ్గురు సామంతులు రాష్ట్రంలో ఈ తాంత్రికుల పనే చేస్తున్నారు. అంతా మోదీకి మద్దతుదారులమే అంటున్నారు. నామ మాత్రంగా వున్న బీజేపీకి ప్రాణం పోస్తున్నారు. ఎన్నికల తర్వాత అది జూలు విదిలిస్తుంది. ఇప్పటికే డబుల్ ఇంజన్ సర్కార్ నినాదాన్ని అందుకుంది. దీనికోసం ప్రాంతీయ పార్టీలను చీల్చడం లేదా వాటిని పడగొట్టడం కాదన్న వారిని జైళ్ళ పాలుచెయ్యడమే మోదీ రాజకీయం. ప్రస్తుతానికి బీజేపీ వీరితో జట్టు కట్టినా అది ఈ పార్టీలను పొట్టన పెట్టుకుంటుంది. ఒకే దేశం, ఒకే మతం, ఒకే నేత, ఒకే పార్టీ నినాదంలో ప్రాంతీయ పార్టీలను బలిపీఠం ఎక్కిస్తుంది . ఈ సామంతుల అనాలోచిత చర్య ఆ పార్టీలకు ప్రాణగండం అవుతుంది. ప్రజలు అప్రమత్తులు కావాలి. బీజేపీ దాని సామంతుల దొంగాటను ఓడించాలి. ❑

# కాగితం పులి కళ్ళలో భయం



- అశోక్ కుంబము

**చరిత్రకారులు వ్యక్తుల గుణగణాల మీద, వారి వ్యక్తిత్వాల మీద ఆధారపడి చరిత్రను అంచనా వెయ్యరు. ఆ వ్యక్తుల స్థల, కాలాలను వాటిని ప్రభావితం చేసే రాజకీయార్థిక, సామాజిక అంశాలను విశ్లేషించి ఒక అవగాహనకు వస్తారు. అయితే చరిత్ర నిర్మాణంలో గానీ, విధ్వంసంలో గానీ వ్యవస్థలు, వాటిని నడిపే రాజకీయాలు ముఖ్యమైనప్పటికీ వ్యక్తుల పాత్ర కూడా విస్మరించరానిదని సామాజిక, మానసిక శాస్త్రవేత్తలు చెబుతు న్నారు. అయితే అమలులోకి వచ్చిన ఒక సామాజిక స్థితికి కేవలం వ్యక్తులనే కారణంగా చూపే పద్ధతి కాకుండా, ఆయా వ్యక్తుల తయారీకి వ్యవస్థకు ఉండే గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకోవాలని అంటారు.**

ఫాసిస్టు సందర్భంలో "నూతన ఫాసిస్టు మానవుడిని" అర్థం చేసుకోవడానికి ఇది చాలా అవసరం. ఎర్ర సైన్యం చేతుల్లో తన ఓటమి తప్పదని గ్రహించిన హిట్లర్ 30 ఏప్రిల్, 1945న తన బంకర్‌లో తుపాకీతో కాల్చుకొని చనిపోయాడు. ఆ తర్వాత వారం రోజులకే (7 మే, 1945న) నాజీ జర్మనీ ఓటమిని ఒప్పుకొని సంకీర్ణ సేనల (సోవియట్ యూనియన్, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్) ముందు లొంగిపోయింది. ఆ వెనువెంటనే సంకీర్ణ సైన్యం నాజీ నేరస్తులను వివిధ జైళ్లలో బంధించింది. నాజీ ముఖ్య నాయకత్వంలో ఉండి ఘోరమైన నేరాలు చేసిన, ఉసిగొల్పిన వారినందరినీ జర్మనీలోని న్యూరెంబర్గ్ జైలులో ఖైదీలుగా ఉంచారు. ఆ తర్వాత వాళ్ళందరిపై విచారణ జరపాలనే "లండన్ అగ్రిమెంట్" ద్వారా "ఇంటర్నేషనల్ మిలిటరీ ట్రిబ్యునల్"ను ఆగస్టు, 1945న ఏర్పాటు చేశారు. ఆ ట్రిబ్యునల్ దాదాపు ఒక సంవత్సరం (20 నవంబర్, 1945 నుండి 1 అక్టోబర్, 1946 వరకు) విచారణ జరిపింది. ఆ విచారణ జరుగుతున్న కాలంలోనే సంకీర్ణ ప్రభుత్వాలు నాజీలు స్వభావ రీత్యానే క్రూరమైన మనుషులా? లేక వాళ్ళు కేవలం పైనుండి వచ్చే ఆజ్ఞలు అమలు చేయడం మూలంగా నేరస్తులయ్యారా? అనే విషయాన్ని పరిశోధన చెయ్యడానికి ఒక సైకాలజిస్టు (మానసిక శాస్త్రంలో పీహెచ్‌డీ పొందిన శాస్త్రవేత్త) గుస్తావె గిల్బర్ట్‌ను, ఒక సైకియాట్రిస్ట్ (మానసిక రోగ నిర్ధారణ, చికిత్సలో ఎం.డి. చేసిన వైద్యుడు) డగ్లస్ కెల్లీని నియమించారు. వీళ్లిద్దరూ అమెరికన్స్. ఈ ఇద్దరు అమెరికన్ శాస్త్రవేత్తలు ఆ నాజీ ఖైదీలందరి మీద వివిధ రకాల మానసిక పరీక్షలు చేశారు. విడివిడిగా తమ డేటాను విశ్లేషించి, విడిగానే రెండు పుస్తకాలు రాశారు. గిల్బర్ట్ 1950లో The Psychology of Dictatorship అనే పుస్తకాన్ని రాశాడు.

అందులో నాజీల మానసిక రుగ్మతలను (psychopathic personality disorders) మూడు రకాలుగా విభజించి విశ్లేషించాడు. అందులో మొదటిది Narcissistic Personality Disorder. ఈ మానసిక వ్యాధికి గురైన వాళ్ళు తమకు తామే గొప్పనుకొని, తమను మించినోళ్ళే లేరనే భావనలో (భ్రమలో) ఉంటారు. మాటమాటకూ తమ పేరునే ప్రస్తావించుకుంటూ గొప్పలు చెప్పుకుంటూ(self-admiration) మాట్లాడతారు. లోకమంతా తమ చుట్టే తిరగాలనీ, తమని ఎప్పుడూ పొగుడుతూ ఉండాలని కోరుకుంటారు. వీళ్ళకు ఎదుటివారి మనోభావాలతో సంబంధం లేదు. తమ ప్రయోజనాల కోసం ఎవరి మనుస్సులనైనా గాయపరుస్తారు. తమకు ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి కాబట్టి ఎదుటి వాళ్ళ పరిస్థితి ఏదైనా తామే ఉన్నత మర్యాదలు, అవకాశాలు పొందటానికి అర్హులం అని భావిస్తుంటారు. తాము ఎప్పుడూ శాసించే స్థాయిలో ఉండటం కోసం ఎదుటివాళ్ళను ఇబ్బందుల్లోకి నెడుతారు. వాళ్ళ దుర్బలత్వాన్ని (vulnerabilities) ఆసరాగా వాడుకొని తమ పెత్తనాన్ని మరింత బలపర్చుకుంటారు. వీరిలో ఉండే అహంకారానికి ఆకాశమే హద్దు. తమ తల బిరుసుతో తమ వాళ్ళు కాదనుకునే వాళ్ళను చిన్న చూపుతో చూస్తారు. ఈసడించుకుంటారు. ఇన్ని దృఢమైన లక్షణాలు ప్రదర్శించే వీరికి చిన్న విమర్శను కూడా తట్టుకునే మానసిక శక్తి వుండదు. చిన్న విమర్శకే భయకంపితులవుతారు. ఆ భయం నుండి బయటపడేందుకే ఎదుటి వాళ్ళ మీద ఎదురుదాడికి దిగుతారు.

ఇక రెండోది Paranoid Personality Disorder. ఈ కేటగిరీలో ఉండే వాళ్ళకు అపనమ్మకం ఎక్కువ. అందరినీ అనుమానిస్తుంటారు. ఎదుటి వాళ్ళు చేసే ప్రతి చిన్నదాని వెనకాల ఏదో పెద్ద కుట్ర దాగి ఉందని భయపడుతుంటారు. తమకు సంబంధించిన విషయాలేవీ ఎవరికీ స్పష్టంగా చెప్పరు. ఎందుకంటే వాటినే తమకు వ్యతిరేకంగా వాడుతారేమోననే భయం. ఆ భయం, అనుమానంతోనే ఎదుటి వాళ్ళమీద పగ

పెంచుకుంటారు. ప్రతీకారం తీర్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. వీళ్ళు ఎదుటి వారి మామూలు మాటల్లో సైతం మహా నేరాలను, ఘోరాలను ఊహించుకొని బెంబేలెత్తుతారు.

మూడో కేటగిరి Schizoid Personality Disorder. వీళ్ళు ఎప్పుడూ సామాజిక అభద్రతతో ఉంటూ మనుషులతో, సమూహాలతో కలిసిపోవడానికి ఇష్టపడరు. సాధారణ మనుషుల మాదిరిగా భావోద్వేగాలను కలిగి వుండరు. ఉన్నా వాటిని ప్రకటించలేరు. ఈ గడ్డకట్టుకుపోయిన తనం మూలంగా వీళ్ళలో సృజనకారులు ఉండటం తక్కువ.

గిల్బర్ట్ విశ్లేషణ ప్రకారం నాజీలు ఈ మూడు కేటగిరీలో ఏదో ఒకటి, అంతకన్న ఎక్కువ మానసిక రోగాలను కలిగివున్నారు. ఈ రోగాలు పుట్టుకతో వచ్చినవి కావు. నాజీ సంస్కృతిలో పుట్టి పెరగడం మూలంగా వచ్చినవి అంటాడు గిల్బర్ట్. నాజీ మానసిక స్థితిలో హేతువు, ఉద్వేగం అన్నీ కూడా అధికారం కోసమే. ఏదైనా అధికారం తర్వాతే. అధికారం కోసం ఎంతకైన దిగజారుతారు. ఎంతటి ఘోరాలైనా చేస్తారు.

కెల్లీ 1947లోనే తన పుస్తకాన్ని (Twenty-two Cells in Nuremberg) ప్రచురించాడు. అయితే తాను చేసిన పరిశీలనలు గిల్బర్ట్‌కంటే భిన్నంగా వున్నాయి. అతని దృష్టిలో నాజీలు మానసిక రోగులు కాదు. నాజీలు నిర్మాణం చేసిన సామాజిక, సాంస్కృతిక వాతావరణం రోగగ్రస్తమయినది. అలాంటి "సామాజిక-సాంస్కృతిక రోగం" (socio-cultural disease) సోకితే అమెరికా సైతం నాజీమయమవుతుంది అంటాడు. ఈ రచనలు వచ్చి దాదాపు 75 ఏండ్లు అయినా నాజీ వ్యక్తిత్వ పరిశోధన ఇంకా కొనసాగుతూనే వుంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నయా నాజీల ప్రభావ సందర్భంలో ఈ పరిశోధనల అవసరం పెరుగుతా వుంది.

భారతదేశంలో పెరుగుతున్న ఫాసిజానికి రాజకీయార్థిక పునాదులు ఉన్నట్లుగానే దానికి సమ్మతిని కూడగట్టే ఒక సాంస్కృతిక, మానసిక ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. నాజీ సామాజిక-సాంస్కృతిక రోగం బ్రాహ్మణీయత రూపంలో వేల ఏండ్లుగా వున్నా, అది ఇప్పుడు సర్వవ్యాప్తం అయ్యే పనిలో ఉంది. ఆ రోగానికే "విశ్వగురువు" అనే గంభీరమైన పేరు పెట్టుకొని విశ్వజనీనం కావాలని చూస్తున్నది. అది సమాజంలో ఒక చెదలు మాదిరిగా, వ్యక్తులలో విచ్ఛిన్నకర మానసిక స్థితిగా మారుతున్నది. ఇదంతా హిందుత్వ రాజ్య నిర్మాణం కోసమే జరుగుతున్నది. హింస, పీడన, ఆధిపత్యం ఆధారంగా సమాజాన్ని కంట్రోల్ చెయ్యాలని ఫాసిస్టు శక్తులు పనిచేస్తున్నాయి.

ఇక ఎన్నికల కాలంలో ఆ సామాజిక-సాంస్కృతిక రోగం ఎంతగా ముదిరిపోయిందో స్పష్టంగా అర్థమవుతున్నది. ఎప్పటి మాదిరిగానే మోడీ తన "భూచీ" సిద్ధాంతం వల్లించడం మొదలు పెట్టాడు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలిగిపోవాలని కాంగ్రెస్ సూత్రప్రాయంగా అన్నవాళ్ళను కూడా "అర్బన్ మావోయిస్టులు" అంటున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులు కొల్లగొట్టి ముస్లింలకు ఇస్తారని హిందువులలో ఒక అభద్రతను, భయాన్ని తయారు చేస్తుండు. ఈ సారి రాముడి చెట్టుకు ఓటు పిందెలు కాసేలా లేవని తెలిపోయిందేమో. మొత్తం దృష్టంతా మావోయిస్టులు, ముస్లింల మీద కేంద్రీకరించారు. గత నాలుగు నెలల్లోనే 92 మంది ఆదివాసులను, మావోయిస్టులను "ఎన్‌కౌంటర్ల" పేరిట హత్య చేశారు. ఈ హత్యలు. తమకేమీ పట్టవన్నట్లు ఉండే సమాజాన్ని తయారు చేశారు. ఆ హత్యలు అడవులకే పరిమితం కావు. మొలకెత్తే ప్రశ్నలను వెతుక్కుంటూ మైదానంలోకి వస్తా యనే సోయి లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ హత్యలు కేవలం వనరుల దోపిడీలో భాగంగా దానికి అడ్డుతగులుతున్న ఆదివాసీ - మావోయిస్టులను వేటాడి చంపడం మాత్రమే కాదు. ఈ హత్యలు సంఘ్ పరివార్ శక్తులు తాము నిర్మాణం చెయ్య దలుచుకున్న హిందుత్వ రాజ్యానికి ఒక పూర్తి ప్రత్యామ్నాయ రాజకీయార్థిక,సామాజిక-సాంస్కృతిక వ్యవస్థను మావోయి స్టులు ప్రతిపాదిస్తున్నందుకు జరుగుతున్నవి.

ఏప్రిల్ 16న కాంకేర్ అడవుల్లో జరిగిన హత్యాకాండలో 29 మంది ఆదివాసులను, మావోయిస్టులను చంపివేసిన తర్వాత ఆ శవాల ముందే నిలబడి ఆ జిల్లా పోలీస్ అధికారి "ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు. మావోయిస్టులు యువతను తప్పు దారి పట్టిస్తున్నారు" అని అనడం ఆశ్చర్యపరుస్తుంది. నెత్తుటి మరకలు ఇంకా ఆరనే లేదు. అప్పుడే శాంతి ప్రవచనాలు చెబుతున్నాడు. హింసకు తావు లేదంటూనే అంత మందిని చంపేశారు. వాస్తవానికి అవేవీ "ఎదురుకాల్పులు" కావు. కేవలం కనిపిస్తే కాల్చివేతలు. ఈ మాట పౌరహక్కుల సంఘాల వాళ్ళు అంటున్న మాట కాదు. టీవీ 9 ప్రతినిధి హత్యాస్థలికి వెళ్లి, అక్కడున్న ఒక జవాన్‌ను అడిగాడు, "మీరు మావోయిస్టు లను ఎలా గుర్తిస్తారు, వాళ్ళను లొంగిపొమ్మని ఏమైనా చెప్తారా?" అని. దానికి బదులుగా అతను అమాయకంగా "మావోయిస్టులు కనిపిస్తే కాల్చేస్తాం అంతే" అని చెప్పాడు. ఇక ఆ పోలీసు అధికారి చెబుతున్న ప్రజాస్వామ్యానికి, యువత దారి తప్పడానికి వాళ్ళ డిక్షనరీలో ఎలాంటి అర్థాలు ఉన్నాయో తెలిసిపోతుంది. ఆయన మాటలను బట్టి అర్థమయ్యేదేమంటే హింస పాలకవర్గాలకు,

**మిగతా 25వ పేజీలో**

# అక్రమాల పుట్ట ఎన్నికల బాండ్ల కుంభకోణం



- ఎన్.వేణుగోపాల్

ఎన్నికల (ఎలక్టొరల్) బాండ్ల అవినీతి గురించి, ఆ పథకం పేరుతో జరిగిన అక్రమాల గురించి దేశం గగ్గోలెత్తుతున్నది. సాధారణ ప్రజానీకం దృష్టికి ఆ భారీ అవినీతి కుంభకోణం వివరాలు రాకుండా తప్పించడానికి సంఘ్ పరివార్ ప్రభుత్వం ఎత్తుల మీద ఎత్తులు వేస్తూ ఎన్నో కుటిల పన్నాగాలు పన్నుతున్నది. కాని పక్కదారి పట్టించే ప్రయత్నాలెన్ని చేసినా, ఎన్నికల బాండ్ల అవినీతి ఊబి నుంచి భారతీయ జనతా పార్టీ బైటపడడం అసాధ్యమనిపించేంతగా రోజురోజుకూ ఎన్నెన్నో దారుణమైన రహస్యాలు బైటపడుతున్నాయి. తవ్వినకొద్దీ బైటపడే విషసర్పాల పుట్టలా ఎన్నికల నిధుల కుంభకోణం కనబడుతున్నది. ఇది ఎంత భారీ రాజకీయ అవినీతో ఇప్పుడు బహిర్గతమవుతున్నది గనుక అసలిది మొదలైన నాటి నుంచీ ఏయే పరిణామాలు జరిగాయో వివరంగా చూస్తే రాజకీయ పార్టీల, ప్రభుత్వ విభాగాల, ప్రభుత్వ రంగ సంస్థల, ప్రచార మాధ్యమాల దుర్మార్గాలు కోకొల్లలుగా బైట పడతాయి. ఈ వ్యవస్థలో ఎక్కడో ఒక అంగం, ఒక శాఖ, ఒక వ్యక్తి కుళ్లిపోవడం కాదు, అసలు మొత్తం వ్యవస్థే మరమ్మతు చేయడానికి వీలు లేనంతగా చెడిపోయిందని ఎన్నికల బాండ్ల కుంభకోణం తేటతెల్లం చేస్తున్నది.

ఎలక్టోరల్ బాండ్స్ ప్రవేశపెట్టడానికి భారతీయ జనతా పార్టీ 2017లో ప్రయత్నాలు ప్రారంభించిన మొదటి క్షణం నుంచీ ఈ వ్యవహారం అక్రమాల పుట్టగానే సాగుతూ వస్తున్నది. మొదట ఈ పద్ధతి ప్రవేశ పెట్టాలని, అందుకు తగిన చట్టపరమైన మార్పులు చేయాలని అనుకున్నప్పుడు అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017 జనవరి 28న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అభిప్రాయం కోరుతూ లేఖ రాశాడు. జనవరి 30న రాసిన జవాబులో ఈ పద్ధతి చాలా అక్రమాలకు దారి తీసే అవకాశం ఉందనీ, పారదర్శకంగా ఉండవలసిన ఎన్నికల విరాళాలను గోప్యంగా మారుస్తుందని, దీనివల్ల బలవంతపు విరాళాలు వసూలు చేసే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయపడింది. కాని ఆ అభ్యంతరాలన్నిటినీ కొట్టివేసిన ఆర్థికమంత్రి 2017 ఫిబ్రవరి 1న లోకసభలో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని రాజ్యసభలో చర్చకు రాకుండా చెయ్యడానికి అక్రమంగా ద్రవ్య బిల్లు అని నిర్వచించాడు. అలా ఎటువంటి చర్చా జరగకుండానే, లోకసభలో ఉన్న మంద బలం సాయంతో ఎలక్టోరల్ బాండ్స్ పథకం దేశంలోకి దొడ్డిదారిన ప్రవేశించింది. అందుకు తగినట్టుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాన్ని కూడా సవరించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయిపోయి 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్ పథకం ప్రారంభించారు.

అప్పటి వరకూ రాజకీయ పార్టీలు ఎన్నికల నిధులు సేకరిస్తున్న పద్ధతి రహస్యంగా, అక్రమ ధనాన్ని చలామణీ చేసుకోవడానికి వీలుగా ఉన్నదని, దాని స్థానంలో ఎలక్టోరల్ బాండ్ అనే పారదర్శక, బహిరంగ విధానం తేవడమే తన లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఎలక్టోరల్ బాండ్లు అమ్మే గుత్తాధిపత్య అధికారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కట్టబెట్టారు. దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ 29 బ్రాంచిల్లో ఈ బాండ్ల అమ్మకం మొదలైంది. ఆ బ్యాంకు ప్రతి సంవత్సరం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్‌లలో మొదటి పది రోజులు చొప్పున నలభై రోజులు, లోకసభ సార్వత్రిక ఎన్నికల సంవత్సరంలో అదనంగా మరొక 30 రోజులు మొత్తం డెబ్బై రోజుల్లో మాత్రమే ఈ బాండ్లు అమ్మాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి అయినా, వ్యక్తుల సమూహం అయినా, రిజిస్టర్ అయిన కంపెనీ అయినా, విదేశీ కంపెనీల స్థానిక అనుబంధ సంస్థ అయినా వెయ్యి రూపాయలు, పది వేల రూపాయలు, లక్ష రూపాయలు, పది లక్షల రూపాయలు, కోటి రూపాయల విలువ గల బాండ్లు కొనవచ్చు. ఆ బాండ్ కొన్న వారు దాన్ని తమకు ఇష్టం వచ్చిన రాజకీయ పార్టీకి ఇవ్వవచ్చు. అలా విరాళంగా పొందిన రాజకీయ పార్టీ ఆ బాండ్ కొన్న పదిహేను రోజులలోపు ఆ బాండ్‌ను తన ఖాతాలో వేసుకోవాలి. పదిహేను రోజులలోపు అలా ఖాతాలోకి రాని బాండ్ల సొమ్ము 'ప్రధాన మంత్రి సహాయనిధి'లో చేరుతుంది. ఆ బాండ్ మీద ఎవరు కొన్నారో, ఎవరికి ఇచ్చారో సమాచారం ఉండదు గనుక ఎవరు ఎవరికి విరాళం ఇచ్చారో గోప్యంగా ఉంటుందని, అందువల్ల పారదర్శకత ఉంటుందని భారతీయ జనతా పార్టీ నమ్మబలికింది.

అయితే బాండ్లు కొన్న కంపెనీ తనకు ఇష్టం వచ్చిన రాజకీయ పార్టీకి ఇస్తున్నప్పుడు, ఆ రాజకీయ పార్టీల పెద్దలకు తమకు ఏ కంపెనీ ఎంత విరాళం ఇస్తున్నదో కచ్చితంగా తెలుస్తూనే ఉంటుంది. బాండ్ మీద ఎవరు కొన్నారో ఉండకపోయినా బ్యాంకు దగ్గర సమాచారం ఉంటుంది గనుక ఒక ప్రత్యేకమైన నంబర్ గల బాండ్ ఎవరు కొన్నారో, దాన్ని ఎవరు నగదుగా మార్చుకున్నారో బ్యాంకుకు తెలుస్తుంది. అది ప్రభుత్వ రంగ బ్యాంకు గనుక ప్రభుత్వంలో, అధికారంలో ఉన్న పార్టీ ఆ

సమాచారాన్నంతా సేకరించడం సులభమే. అంటే ఇచ్చిన కంపెనీకి తెలుసు, తీసుకున్న పార్టీకి తెలుసు, లావాదేవీ నడిపిన బ్యాంకుకు తెలుసు, అధికారంలో ఉన్న పార్టీకి తెలుసు. తెలియకుండా రహస్యంగా ఉండిపోయినది ఓటర్లకు, ప్రజలకు, సమాజానికి మాత్రమే. ఇదీ భారతీయ జనతా పార్టీ నిర్వచించిన పారదర్శకత! ప్రజల నుంచి గోప్యంగా ఉంచడమే పారదర్శకత!

అక్కడితో కూడా అయిపోలేదు. అధికారంలో ఉన్న పార్టీకి ఈ సమాచారమంతా చేరుతుంది గనుక, తనకు విరాళం ఇచ్చే కంపెనీలకు ప్రతిఫలంగా కాంట్రాక్టులు, ప్రాజెక్టులు, మేలు చేసే విధానాలు వంటి తాయిలాలు ఇవ్వడానికి మార్గం సుగమం అవుతుంది. తనకు విరాళం ఇవ్వని కంపెనీల మీద దాడులు జరిపి, బెదిరించి, వాళ్లు విరాళాలు ఇచ్చేలా ఒత్తిడి చేయడానికి వీలవుతుంది. అలాగే తన ప్రత్యర్థి పార్టీలకు విరాళం ఇచ్చిన కంపెనీలు ఏవో తెలుసుకుని వాటిని వేధించడానికి, తద్వారా ప్రత్యర్థి పార్టీలకు ఎవరూ విరాళాలు ఇవ్వకుండా భయోత్పాతం కలిగించడానికి వీలవుతుంది. ఇదంతా కేవలం ఈ పద్ధతిలో ఉన్న సాంకేతికమైన అవకతవకల గురించి, అవకాశాల గురించి సైద్ధాంతిక స్థాయి విశ్లేషణ మాత్రమే కాదు. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఈ పనులన్నీ అక్షరాలా చేసిందని, తనకు విరాళాలు ఇచ్చిన వారికి మేలు చేసిందని, ప్రత్యర్థి పార్టీలకు సమాన స్థాయిలో విరాళాలు అందకుండా చేసిందని ఈ బాండ్లు అమలులోకి వచ్చిన ఐదేళ్ల చరిత్ర అడుగడుగునా చూపుతున్నది.

ఎలక్టోరల్ బాండ్స్ ప్రవేశపెట్టడానికి భారతీయ జనతా పార్టీ చేస్తున్న ప్రయత్నాలు అక్రమాలకు దారి తీసేవిగా ఉన్నాయని, దేశంలో రాజకీయ పార్టీల నిధుల సేకరణలో పారదర్శకత స్థానంలో గోప్యతను, అక్రమ లావాదేవీలను ప్రవేశపెడతాయని, ఇది ప్రజల సమాచార హక్కుకు భంగకరమని విమర్శలు మొదటి నుంచీ వస్తూనే ఉన్నాయి. ఈ వాదనలతో సుప్రీం కోర్టులో 2017 అక్టోబర్‌లోనే ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. అలాగే ఈ చట్టాన్ని రాజ్యసభకు రాకుండా చేసిన ఎత్తుగడ రాజ్యాంగ వ్యతిరేకమని, ప్రజల ప్రాథమిక సమాచార హక్కుకు భంగకరమని ఈ వ్యాజ్యం వాదించింది. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్, కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థలు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) దాఖలు చేసిన అనేక పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. 2019 ఏప్రిల్ 12న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులలో అన్ని రాజకీయ పార్టీలూ తాము విరాళంగా పొందిన బాండ్ల వివరాలను, అవి ఇచ్చిన దాతల పేర్లను సీల్డ్ కవర్లలో ఎన్నికల సంఘానికి అందజేయాలని ఆదేశించింది.

తర్వాత నాలుగేళ్ల విచారణ తర్వాత, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2024 ఫిబ్రవరి 15న ఇచ్చిన ఏకగ్రీవ తీర్పులో ఎలక్టోరల్ బాండ్ పథకం రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించింది. ఆ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఆదేశించింది. ఆ పథకం రాజ్యాంగ అధికరణాలకు, ప్రజాప్రాతినిధ్య చట్టం, కంపెనీల చట్టం, ఆదాయపు పన్ను చట్టం, సమాచార హక్కు చట్టం నిబంధనలకు ఉల్లంఘన అనీ, ఈ పద్ధతి కార్పొరేట్లకు ప్రభుత్వానికి మధ్య క్విడ్ ప్రో కోకు దారి తీస్తాయని ప్రకటించింది.

ఈ తీర్పులో భాగంగానే, తాము మధ్యంతర తీర్పు ఇచ్చిన నాటి నుంచి గత ఐదేళ్ల ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. ఆ వివరాలన్నీ మార్చి ఆరో తేదీలోపు ఎస్‌బీఐ ఎన్నికల సంఘానికి ఇవ్వాలని, ఎన్నికల సంఘం ఆ వివరాలను మార్చి 13లోపు వెబ్‌సైట్ మీద బహిరంగంగా ప్రకటించాలని ఆదేశించారు. ఎస్‌బీఐ మార్చి 4 దాకా తాత్సారం చేసి, ఆ సమాచారం పోగు చెయ్యడానికీ, ఇవ్వడానికీ చాలా సమయం పడుతుందనీ, అందువల్ల తనకు జూన్ 30వ తేదీ వరకు (అంటే ఎన్నికలు అయిపోయేదాకా) వ్యవధి ఇమ్మని సుప్రీంకోర్టును కోరింది. సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించి, వెంటనే మార్చి 12వ తేదీ సాయంత్రంలోపు ఆ సమాచారం ఇవ్వవలసిందే అని పట్టుబట్టింది. ఎస్‌బీఐ బాండ్ల కొనుగోలు దారుల జాబితా, బాండ్లు తమ ఖాతాల్లో వేసుకున్న పార్టీల జాబితా మార్చి 12న ఇవ్వగా, మార్చి 14న ఎన్నికల సంఘం ఆ జాబితాలను వెబ్‌సైట్ మీద బహిరంగపరచింది.

అయితే ఆ జాబితాలలో ఇచ్చిన వారి పేర్లు, తీసుకున్నవారి పేర్లు ఉన్నాయి గాని ఎవరు ఎవరికి ఇచ్చారో తెలిసే అవకాశం లేదు. ఆ అవకాశం లేకపోతే విరాళాల వల్ల ప్రభుత్వ విధానాలు మారాయా, క్విడ్ ప్రో కో జరిగిందా తెలియడం కష్టం. అందువల్ల అది పూర్తి సమాచారం కాదనీ, ప్రతి బాండ్ మీద ఉండే ప్రత్యేకమైన నంబర్‌ను సమర్పించాలని, సమాచారం అంటే అరకొర సమాచారం కాదని, పూర్తి సమాచారం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని మళ్లీ చీవాట్లు పెట్టింది. మార్చి 17న ధర్మాసనం ఇచ్చిన ఈ స్పష్టమైన ఆదేశాల ప్రకారం మార్చి 21న ఎస్‌బీఐ ఆ బాండ్ల నంబర్లతో సహా సమాచారం ఇవ్వగా, ఎన్నికల సంఘం ఆ రోజే వెబ్‌సైట్ మీద ప్రజలందరికీ అందుబాటులో ఉంచింది. ఈ సమాచారం ద్వారా బైటపడిన, బైటపడుతున్న కుంభకోణాలు డజన్ల సంఖ్యలో ఉంటాయి. మొత్తం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకూ గడిచిన ఐదేళ్లలో దాదాపు 1300 కార్పొరేట్ సంస్థలు, దాదాపు 20 రాజకీయ పార్టీలకు, రూ.12,145 కోట్ల విరాళాలు అందజేశాయి. అంతకుముందు అంటే 2018 జనవరి నుంచి 2019 ఏప్రిల్ 11 వరకు రూ.623 కోట్ల బాండ్ల అమ్మకాలు

జరిగాయి. అంటే మొత్తం మీద ఈ పథకం కింద రూ.12,769 కోట్ల విరాళాలు రాజకీయ పార్టీలకు అందాయి. అందులో అత్యధిక భాగం రూ.6,986.5 కోట్లు భారతీయ జనతా పార్టీకే దక్కాయి. మొదటి స్థానంలో 54.7 శాతంతో భారతీయ జనతా పార్టీ ఉంటే, రెండో స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌కు 10.9 శాతం (రూ.1,397 కోట్లు), మూడో స్థానంలో కాంగ్రెస్ కు 10.4 శాతం (రూ.1,334 కోట్లు), నాలుగో స్థానంలో భారత రాష్ట్ర సమితికి 10.3 శాతం (రూ.1,322 కోట్లు) దక్కాయి. ఈ ఎలక్టోరల్ బాండ్ల సమాచారం బైటపడడంతో, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఇన్ కమ్ టాక్స్ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వంటి కేంద్ర ప్రభుత్వ నిఘా, దర్యాప్తు సంస్థలను తన రౌడీ మామూళ్ల వసూలు కోసం వాడిందనే వాస్తవం కొట్టవచ్చినట్టుగా స్పష్టమయింది. ఈ మూడు సంస్థల కేసులు, దాడులు, సోదాలు జరిగిన కొద్ది రోజులకే కార్పొరేట్ కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లు కొని భారతీయ జనతా పార్టీకి ఇచ్చిన ఉదంతాలు లెక్కలేనన్ని బైటపడ్డాయి. ఈ సోదాలు, దాడులు, కేసులను ఇతరులను బెదిరించడానికి, ఇతరుల నుంచి విరాళాలు రాబట్టడానికి వాడుకొన్నారు. దర్యాప్తు సంస్థల దాడులకు, సోదాలకు గురైన 41 కంపెనీలు రూ.2,471 కోట్ల బాండ్లు భారతీయ జనతా పార్టీకి ఇచ్చినట్టు ఆధారాలున్నాయి. తేదీల ప్రకారం చూస్తే అందులో రూ.1,698 కోట్లు దాడులు జరిగిన వెంటనే ఇచ్చినట్టుగా ఉన్నాయి. అలాగే, కార్పొరేట్ కంపెనీలకు ప్రాజెక్టులు, కాంట్రాక్టులు కట్టబెట్టడానికీ, వారికి లాభం చేకూర్చే అనుకూల విధానాలు ప్రకటించడానికీ ఈ బాండ్ల విరాళాలకూ దగ్గరి సంబంధం ఉంది. కనీసం 33 గ్రూపు కంపెనీలు భారతీయ జనతా పార్టీకి రూ.1,751 కోట్లు విరాళం ఇచ్చి, అందుకు ప్రతిఫలంగా కొద్ది నెలల్లోనే కొన్ని లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు, కాంట్రాక్టులు, గనులు, భూమి, సౌకర్యాలు, అనుకూల విధానాలు పొందాయి.

**ఈ మొత్తం భారీ కుంభకోణంలో లెక్కలేనన్ని అక్రమాలు వున్నాయి గాని కొన్ని ఉదాహరణలు :**

- ఈ బాండ్లు కొన్నవారి జాబితాలో అదానీ, అంబానీల కంపెనీలు, దేశంలోని ప్రధాన పారిశ్రామిక, వ్యాపార గృహాలు లేకపోవడం ఆశ్చర్యకరం. ఈ దేశంలో ఆ రెండు గ్రూపు కంపెనీలు, ఇతర వ్యాపార గృహాలు అనేక పారిశ్రామిక, సేవారంగ వ్యాపారాలలో, లక్షల కోట్ల రూపాయల టర్నోవర్‌తో, వేల కోట్ల రూపాయల లాభాలతో ఉన్నాయి. దేశ ప్రజల నుంచి ఇంతగా సంపాదిస్తున్న ఈ పారిశ్రామిక, వ్యాపార గృహాలు దేశానికి, రాజకీయ పార్టీలకు ఏమీ తిరిగి ఇవ్వడం లేదా?
- ఈ 1300 కంపెనీల్లో కొన్ని వందల కంపెనీలు ఊరూ పేరూ లేనివి. అవి నిజానికి పారిశ్రామిక, వ్యాపార సంస్థలు కావు. సాధారణంగా పారిశ్రామిక, వ్యాపార గృహాలు పన్నులు ఎగ్గొట్టడానికి, అక్రమ ఆదాయం దారి మళ్లించడానికి, కార్మిక సంక్షేమ చట్టాలను, ఇతర చట్టాలను ఉల్లంఘించడానికి డొల్ల కంపెనీలను ఏర్పాటు చేస్తాయి. ఆ కంపెనీలకు కార్యాలయాలుండవు. ఉద్యోగులుండరు. ఉత్పత్తి ఉండదు. వ్యాపారం ఉండదు. కాని బాలెన్స్ షీట్లలో వందల కోట్ల రూపాయల లావాదేవీలుంటాయి. ఏ ఉత్పత్తీ, అమ్మకాలూ, లాభాలూ లేకుండానే వందల కోట్ల ఆదాయం చూపించే మాయ ఈ డొల్ల కంపెనీలు. ఇప్పుడు ఈ జాబితాలో ఆ డొల్ల కంపెనీలే ఉన్నాయంటే, అవన్నీ తమ పేరు బైటికి చెప్పుకోవడానికి ఇష్టపడని బడా కంపెనీలు ఇచ్చిన విరాళాలకు మేలి ముసుగులన్నమాట.
- అందువల్లనే, ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్న ఫ్యూచర్ గేమింగ్ అండ్ హొటల్ సర్వీసెస్ అనే కంపెనీ సంపాదించిన లాభాలకు ఎన్నో రెట్ల నిధుల బాండ్లు కొన్నది. 2020-21లో అది సంపాదించిన లాభం రూ.84.79 కోట్లు కాగా, కొన్న బాండ్లు రూ.150 కోట్లు, 2021-22లో లాభం రూ.84.46 కోట్లు, బాండ్లు రూ.544 కోట్లు, 2022-23లో లాభం రూ.82.02 కోట్లు, బాండ్లు రూ.328 కోట్లు, 2023-24 లాభం లెక్క ఇంకా తేలలేదు. కాని కొన్న బాండ్లు రూ.341 కోట్లు.
- రెండో స్థానంలో ఉన్న మేఘా ఇంజనీరింగ్ అనే కంపెనీ రూ.1,232 కోట్ల విరాళాలు ఇచ్చింది. ఈ కంపెనీ 2023 ఏప్రిల్‌లో భారతీయ జనతా పార్టీకి రూ.140 కోట్ల విరాళం ఇచ్చి, బదులుగా మే 2023లో రూ.14,400 కోట్ల థానే - బోరివిలి రెండు సొరంగాల రోడ్డు కాంట్రాక్టు పొందింది. కాళేశ్వరం ప్రధాన కాంట్రాక్టర్ గా ఉన్న ఈ సంస్థ భారత రాష్ట్ర సమితికి కూడా భారీగా విరాళాలు ఇచ్చింది.
- విరాళాలు ఇచ్చినవారిలో మూడో స్థానంలో ఉన్న క్విక్ సప్లై చెయిన్ అనే సంస్థ రిలయన్స్ గ్రూపుకు చెందినది. 2021-22లో దాని వార్షిక లాభం రూ.21.72 కోట్లు కాగా అది రూ.360 కోట్ల బాండ్లు కొని విరాళంగా ఇచ్చింది.
- విరాళాలు ఇచ్చినవారిలో మొదటి పది స్థానాలలో ఉన్న కేవెంటర్ గ్రూప్ అనే కంపెనీలో కేవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, మదన్ లాల్ లిమిటెడ్, ఎంకెజె ఎంటర్‌ప్రైజెస్ అనే మూడు కంపెనీలు కలిసి రూ.500 కోట్లు విరాళం ఇచ్చాయి. ఇందులో మదన్ లాల్ లిమిటెడ్

2019-20లో సంపాదించిన లాభం రూ.1.84 కోట్లు కాగా, ఇచ్చిన విరాళం రూ.185.5 కోట్లు.

- నిజానికి 2017 వరకూ ఉన్న చట్ట నిబంధనల ప్రకారం ఏ కంపెనీ అయినా వరుసగా మూడు సంవత్సరాల లాభాల వార్షిక సగటులో 7.5 శాతం కన్నా ఎక్కువ విరాళం ఇవ్వగూడదు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ గరిష్ఠ పరిమితిని రద్దు చేసి, సంపాదించిన లాభంతో సంబంధం లేకుండా విరాళాలు ఇవ్వవచ్చునని, డొల్ల కంపెనీల, అక్రమ లావాదేవీలకు తలుపులు బార్లా తెరిచింది.
- గోమాంసానికి వ్యతిరేకంగా ప్రజల్లో విద్వేషం రెచ్చగొట్టే బిజెపి, శివసేనలకు గోమాంస వ్యాపారుల విరాళానికి మాత్రం అభ్యంతరం లేదు. ప్రధానంగా గోమాంస వ్యాపారం చేసే అల్లానా సన్స్ అనే గ్రూపుకు చెందిన మూడు కంపెనీలు శివసేనకు రూ.5 కోట్లు, బిజెపికి రూ.2 కోట్లు విరాళం ఇచ్చాయి. ఇలా తవ్వుతూ పోతే ఈ అక్రమాల పుట్టలో వందలాది అక్రమాలు బైటపడతాయి.

**ఒకవైపు ఎలక్టోరల్ బాండ్స్ వ్యవహారం బైట పడుతుండగానే, రాయిటర్స్ వార్తా సంస్థ మరొక ఎన్నికల నిధుల కుంభకోణాన్ని బైటికి తెచ్చింది:**

2013లో భారత ప్రభుత్వం ఎన్నికల నిధుల విరాళాలకు సంబంధించి ఒక కొత్త పద్ధతిని అమలులోకి తెచ్చింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వదలచిన కార్పొరేట్ కంపెనీలు సొంతంగా గాని, ఉమ్మడిగా గాని ట్రస్టులు ఏర్పాటు చేసి ఆ ట్రస్టులకు విరాళాలు ఇవ్వవచ్చు. అందుకు ప్రతిఫలంగా ఆదాయ/కార్పొరేట్ పన్నుల మినహాయింపులు దొరుకుతాయి. ఆ ట్రస్టులు తమ నిర్వహణ వ్యయంగా ఐదు శాతం నిధులు ఉంచుకుని మిగిలినవి రాజకీయ పార్టీలకు బదలాయించవచ్చు. ఈ పద్ధతి కింద దేశంలో ఏర్పడిన పద్దెనిమిది ఎలక్టొరల్ ట్రస్టులలో ఒకటి ప్రుడెంట్ ట్రస్ట్. దాన్ని ప్రారంభించినది భారతి ఎయిర్ టెల్ గ్రూపుకు చెందిన సునిల్ మిత్తల్. కాని ఆయన ప్రస్తుతం ఆ ట్రస్టును స్వతంత్ర ఆడిటర్లకు అప్పగించానని, తనకు సంబంధం లేదని అంటున్నాడు. ఈ ట్రస్టు గత పదకొండు సంవత్సరాలలో మొత్తం రూ.2,256 కోట్ల విరాళాలు సేకరించింది. అందులో 75 శాతం ఒక్క బీజేపీకే ఇచ్చింది. గడిచిన నాలుగేళ్లలో ఈ ప్రుడెంట్ ట్రస్ట్ ఎనిమిది బడా కార్పొరేట్ సంస్థల నుంచి రూ.414 కోట్లు విరాళాలు సేకరించి, మొత్తానికి మొత్తం బీజేపీకి ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో దేశంలో సాగించిన విధ్వంసకాండకు, అన్ని వ్యవస్థలను ధ్వంసం చేయడానికి, మితిమీరి సాగించిన అక్రమాలకు ఒకానొక సూచిక ఎలక్టొరల్ బాండ్ల కుంభకోణం. మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టి ఈ అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సంఘ్ పరివార్ చేస్తున్న కుటిల ప్రయత్నాలను తిప్పికొట్టడం, ఈ అక్రమాలకు విస్తృత ప్రచారం ఇవ్వడం ఇవాళ దేశంలో బుద్ధిజీవుల ముందున్న కర్తవ్యం. ❑

# కాగితం పులి కళ్ళలో భయం

**21వ పేజీ తరువాయి**

వారి కాపలాదారులకు మాత్రమే ఉన్న హక్కు. దానిని ప్రశ్నిస్తే అదే హింసకు మరో రూపంలో గురికావాల్సి వస్తుందనే ఒక హెచ్చరిక జారీ చేస్తున్నట్లుంది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అర్బన్ మావోయిస్టుల జాబితాలో చేరిపోయింది కదా. మరి మావో యిస్టు రహిత భారతదేశాన్ని ఎలా నిర్మాణం చేస్తారు? రేపు రేపు కాంకేర్ వంటి కనిపిస్తే కాల్చివేతలు కాంగ్రెస్ కార్యాలయాల దాకా జరుగుతాయా?

నాజీల విషయంలో గిల్బర్ట్, కెల్లీ చెప్పినట్లు అధికారం కోసం ఫాసిస్టులు ఎంతటి ఘోరమైన హింసకైనా దిగుతారు. ఎన్ని కట్టుకథలనైనా అల్లుతారు. నిత్య జీవిత వెతలు అజెండా మీదికి రాకుండా ఎన్ని దుర్మార్గపు పనులయినా చేస్తారు. కానీ, ఈ ఎన్నికల్లో తమకు ఎదురుగాలి వీస్తుందని తెలుసుకున్న పాలకులకు భయం పట్టుకుంది. ఆ భయంతోనే రాజ్యాంగాన్ని మార్చమని, రిజర్వేషన్ల జోలికి పోమని స్వయంగా మోడీ ప్రకటిస్తున్నాడు. ఇది రాజ్యాంగవాదులకు కొంత ఊరట ఇవ్వొచ్చేమో గానీ, సంఘ్ పరివార్ వాగ్దానం భారతంలో "అశ్వత్థామ హతః కుంజరః" వంటిదే! సంఘ్ శక్తులు అధికారం పోతదేమో అని భయపడుతుంటే కొంతమంది రాజకీయ వాఖ్యాతలు "వాళ్ళు మళ్ళీ గెలిస్తే" అంటూ ఎన్నో భయాలను వెల్లడిస్తున్నారు. ఈ భయాలన్నీ కొన్ని దశాబ్దాలుగా ప్రజలు చేస్తున్న పోరాటాలు అర్థం కాకపోవడం, వాటిలో భాగం కాకపోవడం మూలంగా కలిగేవి మాత్రమే.

అలాంటి నిరాశ అవసరం లేనిది. వాళ్ళు మళ్ళీ వస్తే భూమి ఏమి బద్దలు కాదు. ఒకవేళ అయితే, "ఇదంతా మాకెందుకులే మాదాకా వస్తారా వచ్చినప్పుడు చూద్దాంలే" అని అనుకునే మధ్యతరగతి భద్ర జీవుల భ్రమలు బద్దలవుతాయి. మొత్తం సమాజం ఒక కుదుపునకు గురికావొచ్చు. అది ఎంత నష్టం చేస్తుందో, సమాజాన్ని అంత చలనంలోకి తెస్తుంది. అనివార్యంగా కొత్త పోరాట రూపాలు వస్తాయి. ఫాసిస్టుల బలం ప్రజల భయంలో ఉంది. ప్రజలు కన్నెర్ర చేస్తే, ఆ కాగితపు పులి కాలిపోతుంది. ఇది చరిత్ర చెప్పిన సత్యం. ❑

# అయోమయంలో భారత ఆర్థిక వ్యవస్థ!



- శ్రీపాద మోతీరాం, వకుళాభరణం వంశీ



అనువాదం : రాఘవశర్మ

**'నవభారతం' అనే మాట ఈ మధ్య బాగా వినిపిస్తోంది. భారతీయ జనతాపార్టీ, నరేంద్రమోడీ వెబ్ సైట్లలో ఈ మాట బాగా కనిపిస్తోంది. గత పదేళ్ళుగా హక్కుల గురించి, స్వేచ్ఛ గురించి, మత సహనం గురించి ఆ వెబ్ సైట్ లో ఎంతో చక్కగా చెప్పారు. ప్రపంచస్థాయిలో భారతస్థితి గురించి చాలా గొప్పగా చర్చ జరిగింది. ఇతర దేశాలతో పోల్చుకున్నప్పుడు ఆర్థిక పరిమాణంలో కాకుండా ఆర్థికాభివృద్ధిలో పెరుగుదల ఉంటుందని ఎవరైనా భావిస్తారు. వారు చూపించే పెరుగుదల 1980 నుంచి నమోదైంది. ఆదాయం, ఆరోగ్యం, విద్య, జ్ఞానంలో ఐక్యరాజ్యసమితికి చెందిన మానవాభివృద్ధి సూచిక' (యుహెచ్ఐ)లో ఎలా ఉందో పరిశీలిద్దాం.**

'మానవాభివృద్ధి సూచిక'లో ఉన్న 193 దేశాల్లో భారతదేశం 134వ స్థానంలో, అంటే చైనాకంటే (75), దక్షిణాసియా దేశాలైన శ్రీలంక(78), భూటాన్ (125), బంగ్లాదేశ్(129) కంటే తక్కువ స్థితిలో ఉంది. ఈ సూచిక-2015ను గమనిస్తే, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికి స్వల్పంగా (130వ ర్యాంకుకు) తగ్గింది. భారతదేశ స్థితి పెరుగుతోందని చెప్పుకుంటున్న సమయంలో, భారత ఆర్థికాభివృద్ధి క్షీణించడం ఒక అయోమయాన్ని సృష్టిస్తోంది.

## దీనిని మనమెలా అర్థం చేసుకోవాలి?

అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా గత దశాబ్ది కాలంగా ఆర్థిక వ్యవస్థను పరిశీలించదలిచాం. స్థూల జాతీయోత్పత్తిని పరిశీలిద్దాం. అధికారిక అంచనాల ప్రకారం బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి స్థూల జాతీయోత్పత్తి పెరుగుతోంది. వీళ్ళు అధికారంలోకి వచ్చాక మళ్ళీ తగ్గడం మొదలైంది. మళ్ళీ కోవిడ్ 2020-21 తరువాత పెరిగింది. మౌలిక సదుపాయాలపై ఎన్డీఏ ప్రభుత్వం ఖర్చు చేయడం వల్ల రోడ్లు, రైలు మార్గాలు అభివృద్ధి చెందాయి. కానీ, మౌలిక సదుపాయాల అభివృది పరిసరాల వ్యయాన్ని పెంచుతుంది. కానీ అది ప్రజాబాహుళ్య అవసరాలను తీర్చలేదు. ఎన్డీఏ పాలనలో వివిధ రంగాల షేర్లలో చెప్పుకోదగ్గ మార్పు లేదు. అధికారిక లెక్కల ప్రకారం మన తయారీ రంగంలోని షేర్ల విలువ 2011-12తో పోల్చుకుంటే 18 శాతంగా, స్తబ్దుగా ఉండిపోయింది.

'పీరియాడికల్ లేబర్ సర్వే' ప్రకారం వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైన ఉద్యోగాల కోసం 2017-18, 2022-23మధ్య 43 శాతం మంది ఆధారపడే ఉన్నారు. ఉద్యోగాలు కల్పించే తయారీ రంగాన్ని ప్రోత్సహించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్డీఏ పాలనలో తయారీ రంగం పెరుగుదల క్షీణించింది. తయారీ రంగం పెరుగుదల 2015-16లో 13 శాతం నుంచి క్రమంగా క్షీణిస్తూ 2019-20 నాటికి 3 శాతానికి పడిపోయింది. పెరుగుదల రేటు కోవిడ్ వల్ల 2019-20 తరువాత పెరిగినప్పటికీ, కోవిడ్ నుంచి కోలుకున్న తరువాత మళ్ళీ క్షీణించడం మొదలైంది. అభివృద్ధి చెందిన దేశాలతో, తూర్పు ఆసియా దేశాలతో పోల్చుకుంటే భారత దేశం తయారీ రంగం తిరస్కరణకు గురవుతోంది. 'మేక్ ఇన్ ఇండియా' వంటి ప్రచారార్భాటాలతో ఎన్డీఏ పాలనలో తయారీ రంగం నిరాశాజనకంగా సాగుతోంది. నిర్మొహమాటంగా చెప్పాలంటే, తక్కువ పరిశ్రమలది పైచేయి అయితే దానిపైన కేంద్రీకరిస్తారు. ఈ విషయంలో అది గుత్తాధిపత్యం చెలాయిస్తుంది. దీనిపైన దృష్టి సారించడం వల్ల దాని ప్రతికూల ప్రభావం వినియోగదారుడి సంక్షేమంపైపడి, అది అసమర్థతకు దారితీయడం పట్ల ఆర్థిక శాస్త్రవేత్తలు విచారం వ్యక్తం చేస్తున్నారు. దృషి పెంచి కేంద్రీకరించడం వల్ల ప్రభుత్వ-వ్యాపారుల సంబంధాలు ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వం కొందరు వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుతుంది. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ విరల్ ఆచార్య పరిశోధన ప్రకారం 1990 నుంచి పరిశ్రమలపై దృష్టి కేంద్రీకరణ తగ్గింది. ఇటీవల సంవత్సరాల్లో దృష్టి కేంద్రీకరణ తగ్గడం మరింతగా పెరిగింది. అమ్మకాలలో తమ వాటాను, ఆర్థికేతర రంగాలలో తమ సంపదను ముఖేష్ అంబానీ, ఆదిత్య బిర్లా, టాటా, ఆదాని, భారతీ టెలికం పెంచుకుంటూ 2014 నుంచి నడుపుతున్నాయి. తమ పోటీ ఆధిపత్య సామర్థ్యాన్ని ప్రతిబింబించడంకంటే, ప్రభుత్వ విధానాల వల్ల కొన్ని కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరుగుతోంది. ఆదాని వ్యాపార సామ్రాజ్యానికి, మోడీకి మధ్య ఉన్న సహజీవనం అందరికీ తెలిసిందే. ఎన్డీఏ పాలనలో ప్రభుత్వ-వ్యాపార సంబంధాలు మారాయి. దీన్ని వివరించడానికి ఆశ్రితపక్షపాతం, ఆశ్రిత పెట్టుబడిదారీ

విధానం అన్న పదాలను వాడుతున్నారు. కొన్ని వ్యాపార సంస్థలకు ఇచ్చే ప్రాధాన్యత వల్ల ఈ పదాలు వాడుకలోకి వచ్చాయి. అవినీతి రూపాలను, ప్రభుత్వ అదుపాజ్ఞలను వర్ణించడానికి ఈ పదాలు సరిపోవు. ఉదాహరణకు ఎలక్టోరల్ బాండ్లలో బీజేపీ అత్యంత ఎక్కువ లబ్ధిపొందింది. దీనిని క్విడ్ ప్రోకోగా వాడుకున్నారు. అంటే అదొక పెద్ద దోపిడీ. పెరిగిపోయిన అసమానతల గురించి పరిశీలిద్దాం.

ఈ మధ్య బాగా ప్రాచుర్యం పొందిన హురున్ జాబితా ప్రకారం, 2012-22 మధ్య వెయ్యి కోట్ల రూపాయల సంపద కంటే ఎక్కువగా పెరిగిపోయిన వంద నుంచి వెయ్యిన్ని నూట నూట మూడు మంది, అంటే పది రెట్లు పెరిగిపోయారు. డాలర్లలో లెక్కేస్తే బిలియనీర్లు 59 నుంచి 221 మంది, అంటే నాలుగు రెట్లు పెరిగిపోయారు. ఈ జాబితాలో తాజాగా 2024 సమాచారం ప్రకారం, ఒక్క ఏడాదిలో చైనాలో 54 మంది బిలియనీర్లు పెరగగా, మన దేశంలో 94 మంది బిలియనీర్లు పెరిగారు. వీరిలో గౌతం ఆదాని, ముఖేష్ అంబానీ చెరొక 33 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానంలో ఉన్నారు. ఆసియాలోని ఏ నగరంలోనూ లేని విధంగా ముంబయిలో 92 మంది బిలియనీర్లు ఉన్నారు. బీజింగ్ నగరంలో 91 మంది బిలియనీర్లు మాత్రమే ఉన్నారు. ముంబయి బిలియనీర్ల రాజధానిగా పేరు తెచ్చుకుంది. బ్రిటిష్ వలసపాలనలో కంటే ప్రస్తుతం అసమానతలు పెరిగాయని 'క్యాపిటల్ ఇన్ ది ట్వె న్టీఫస్ట్ సెంచరీ' పుస్తక రచయిత థామస్ పిక్కెటి, అతని బృందం గుర్తించింది.

స్వాతంత్ర్యానంతరం 1980 వరకు అసమానతలు తగ్గి, ఆ తరువాత పెరిగాయి. ఈ అసమానతలు 2000 సంవత్సరం నుంచి వేగంగా పెరిగాయి. ఫలితంగా ప్రస్తుతం 22.6 శాతం నుంచి 40.1 శాతం సంపద ఒక శాతం చేతిలో ఉంది. బ్రెజిల్, దక్షిణాఫ్రికా, అమెరికా కంటే కూడా ఇంత సంపద ఒక్క శాతం చేతిలో ఉండడం చాలా ఎక్కువ. ఉద్యోగావకాశాలు, నిరుద్యోగం పైన నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం 2011-12 లో 3.7 శాతం ఉన్న నిరుద్యోగం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో కొచ్చాక 5.1 శాతానికి పెరిగింది. చదువుకున్న వారిలో, యువతరంలో నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉంది. 2022-23లో సెకండరీ, ఉన్నత చదువులు చదువుకున్న నిరుద్యోగులు 6.4 శాతం, 10.3 శాతం ఉన్నారు. అదే సంవత్సరం 15-29 ఏళ్ళ మధ్యఉన్న యువతరంలో నిరుద్యోగులు 9.7 శాతం, 10.6 శాతం ఉన్నారు.

కోవిడ్ సమయంలో పెద్ద ఎత్తున కార్మికులు పనులు కోల్పోయారు. మన దేశంలో అసంఘటిత రంగంలో కార్మికులు ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. కోవిడ్ సమయంలో సరిగా వ్యవహరించకపోవడం వల్ల వలస కార్మికులు వందల మైళ్ళు నడిచి వెళ్ళిపోవలసిరావడంతో అసంఘటిత రంగం పై ప్రభావం బాగా పడింది. వారి ఆదాయాలు కూడా గణనీయంగా తగ్గాయి. ఈ అయోమయాన్ని గమనించడం ద్వారా నరేంద్ర మోడీ నాయకత్వంలోని నవ భారత ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోగలిగాం. ప్రపంచంలో భారత స్థితి పెరగడం వల్ల భారత వ్యాపారవర్గం, వృత్తినిపుణులు ఇతర దేశాలకంటే భిన్నంగా, తమ స్థితిని నిలబెట్టుకున్నారు. పైన చెప్పిన విధంగా గత దశాబ్దకాలంలో ఈ మార్పు జరిగింది. ఎన్డీఏ పాలనలో మొత్తంగా భారత ఆర్థిక స్థితి దిగజారింది. తయారీ రంగం బలహీనపడడం, చదువుకున్న వారిలో నిరుద్యోగులు పెరిగారు. ఆదాయం, సంపద విషయంలో అసమానతలు ఆకాశాన్నంటుతున్నాయి. అత్యున్నత శ్రేణుల కోసం ప్రపంచ దేశాలతో ఆర్థిక సబంధాలు ఏర్పాటు చేసుకున్న దేశంలో ఆ పక్కనే విస్తృత ప్రజాబాహుళ్యం పడి ఉంది. మానవాభివృద్ధి జాబితాలో మన స్థానం పడిపోయింది. కానీ, వ్యాపార, వృత్తినిపుణుల స్థాయి మాత్రం పెరిగింది. సంక్షేమ దృక్పథం కల యూపీఏ ప్రభుత్వానికి 2014 ఎన్నికలు ఒక వెన్నుపోటులాంటివి. 2019 తరువాత వ్యాపార వర్గాలు, వృత్తి నిపుణులు బలపడి బీజేపీ, మోడీకి వెన్నుదన్నుగా నిలిచారు. అత్యధిక సంఖ్యాకులు ఈ పరిపాలనను ఎందుకు సమర్థిస్తున్నారు? భారత ఆర్థిక వ్యవస్థను, దాని సంక్షేమ దృష్టిని, ప్రపంచంలో దాని స్థాయిని పెంచుకోవడం, దాని నూతన జాతీయవాద విధానం, దానిప్రస్తుత నాయకత్వాన్ని చూశాం. ఈ ఆర్థిక వ్యవస్థ అత్యధిక సంఖ్యాకులకు సరిగా ఉపయోగపడడం లేదు. ప్రస్తుత ఎన్డీఏ పాలనతో పోల్చుకున్నట్టయితే యూపిఏ పాలించిన 2004-14 కాలం ఎంతో మెరుగైంది. ఎన్డీఏ సంక్షేమ పథకాలు మోడీ ప్రచారానికి ఉపయోగించుకుంది. ఆర్థిక విషయాలతో సంబంధం లేకుండా ప్రపంచంలో భారత స్థాయి పెరిగిందంటే అది సహేతుకం కాదు. ఇదంతా ప్రచారానికి ఉపయోగించుకోవడానికే. అత్యధిక సంఖ్యాకులు నిరుద్యోగంతో, ఆర్థిక మాంద్యంతో అతలాకుతలం అవుతున్న సమయంలో ప్రజలకు జి20 పైన అవగాహన ఏముంటుంది? ప్రస్తుత ఎన్డీఏ నాయకత్వానికి ప్రధానంగా జాతీయవాదమే ముఖ్యమైపోయింది. ప్రతిపక్షాల ఐక్యతకు ప్రయత్నాలు జరిగినప్పటికీ, వారి మధ్య విభేదాల వల్ల, కేసుల వల్ల అది పాక్షికంగా మాత్రమే విజయవంతమైంది. తమ ఆర్థికస్థితి సరిగా లేకపోయినప్పటికీ, ఒక గణనీయమైన వర్గం జాతీయవాదంతో ముడిపెట్టి ఎంత కాలం ఈ పాలనకు మద్దతును కొనసాగించగలుగుతారు? అన్నది ప్రశ్న. ❑

# ఒప్పులకుప్ప ఒడిలో మీడియా!



- ప్రొ. పద్మజ షా

**ప్రధాన స్రవంతి మీడియాలో స్వతంత్ర గళాలను మూసేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు యూట్యూబ్‌లో ఉన్న స్వతంత్ర ఛానల్స్ వెంట పడుతోంది. 'బోల్ తా హిందుస్తాన్' అనే హిందీ న్యూస్ ఛానల్‌ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూట్యూబ్ నుంచి తొలగించారు. ఏప్రిల్ 4న కేంద్రంలోని ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ ఛానల్‌ని రద్దు చేస్తున్నట్లు యూట్యూబ్ నుంచి ఈ మెయిల్ ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే రాత్రికి రాత్రి తీసివేయడం కూడా జరిగిపోయింది. ఈ ఛానల్‌కి 3 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 40 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. కొన్ని వారాల క్రితం ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ రద్దు చేశారు. ఇప్పుడు మొత్తం ఛానల్‌నే తీసేసారు. ఈ ఛానల్ అల్ప సంఖ్యాకుల, దళిత బహుజనుల సమస్యల మీద వార్తలు చేస్తుంది.**

'బోల్ తా హిందుస్తాన్' తతంగం ఇంకా నడుస్తూనే ఉండగా మరో రెండు ఛానల్స్‌కి అదే రకం నోటీసు వచ్చింది. అవి 'నేషనల్ దస్తక్', 'ఆర్టికల్ 19'. ఈ ఛానల్స్ కూడా దళిత బహుజన విషయాల గురించి బలంగా కంటెంట్ చేస్తాయి. ఈ ఛానల్స్ చేసే కార్యక్రమాలను చూసి ప్రభుత్వం ఎందుకు ఇంతగా బెదురుతోంది ? పార్లమెంట్ ఎన్నికల్లో హిందుత్వ రాజకీయాల ముసుగు ఈ ఛానల్స్ తొలగిస్తున్నాయనా? 'నేషనల్ దస్తక్' అనే ఛానల్‌కి దాదాపు 94 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారు. ఇక ఛానల్‌ని చూసే వాళ్లు మరో 30 లక్షల మందికి షేర్ చేస్తూ ఉంటారు. ఈ ఛానల్ ప్రత్యేకించి దళిత్ బహుజన్ హక్కుల గురించి విస్తృతంగా కవరేజ్ ఇస్తుంది. దళిత బహుజన యువతని జర్నలిస్టులుగా తీసుకుంటుంది. ఇంటర్న్‌షిప్స్ ద్వారా కొన్ని వేల మందిని మీడియా ప్రొఫెషనల్స్‌గా తయారుచేస్తుంది. పెద్ద మీడియా సంస్థలు కవర్ చేయని వార్తలను ఈ ఛానల్ చేస్తుంది. యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఈ ఛానల్‌కి కొన్ని లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. సరిగ్గా మోడల్ కోడ్ ఉన్న సమయంలో, ఎలక్షన్ మధ్యలో ఇంత బలమైన ఛానల్‌ని మూసివేయడం ఎలక్షన్ కమిషన్‌కి ఏ మాత్రం తప్పుగా అనిపించట్లేదు. మూసివేయటానికి ఎటువంటి ప్రత్యేక కారణం ఇవ్వకుండా, ఎటువంటి ప్రక్రియా పాటించకుండా, కేవలం ఉల్లంఘన జరిగిన కార్యక్రమాన్ని తొలగించమనకుండా, మొత్తం ఛానల్‌నే మూసివేయడం ఎంత దౌర్జన్యం?

ఇదే క్రమంలో 'ఆర్టికల్ 19' అనే ఛానల్‌కి కూడా ప్రభుత్వం నుంచి ఇటువంటి బెదిరింపే వచ్చింది. గతంలో కేరళలోని 'మీడియా వన్' అనే శాటిలైట్ ఛానల్‌ని కూడా ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ లైసెన్స్ రెన్యువల్ చేయకుండా మూసివేసే పరిస్థితి కల్పించింది. జాతీయ భద్రత నెపంతో, కారణం బహిరంగంగా చెప్పకుండా ప్రభుత్వం కోర్టులో సీల్డ్ కవర్ అందించింది. సీఏఏకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, దాని తరవాత ఢిల్లీలో జరిగిన అల్లర్లను గురించి ఆ ఛానల్ చేసిన విస్తృత కవరేజ్‌లో - ఢిల్లీ పోలీస్ నిష్పాక్షికంగా తమ విధులు చేయలేదని, అల్లర్లలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఉందని విమర్శలు చేయడం ప్రభుత్వానికి నచ్చక ఛానల్‌ని మూసేసింది. దీనిని దేశభద్రతతో ముడిపెట్టింది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఛానల్‌ని దాదాపు సంవత్సరం తరవాత మళ్ళీ తెరవగలిగారు.

మొదటగా, 2014లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణికి బలి అయ్యింది హిందుస్థాన్ టైమ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ బాబీ ఘోష్. ఈయన 2016-17 మధ్య తాను ఎడిటర్‌గా ఉన్న కాలంలో హేట్ ట్రాకర్‌ని రూపొందించి, అందులో దేశవ్యాప్తంగా అల్ప సంఖ్యాకుల మీద జరిగిన విద్వేష దాడులను ఎప్పటికప్పుడు నమోదు చేయించాడు. 28 సెప్టెంబర్ 2015లో దాద్రిలో అఖ్లాఖ్‌ని గొడ్డు మాంసం కోసం గోహత్య చేశాడన్న తప్పుడు ఆరోపణలతో పట్టపగలు మూకదాడి చేసి, హత్య చేశాక ఈ హేట్ ట్రాకర్‌ని మొదలుపెట్టారు. ఇది ప్రారంభం అయిన కొన్నాళ్లకే బాబీ ఘోష్‌ని తీసేయమని యాజమాన్యం మీద ప్రభుత్వం నుంచి ఒత్తిడి మొదలైంది. బాబీ ఘోష్ త్వరలోనే రాజీనామా చేసి వెళ్ళిపోయాడు. పత్రిక వెంటనే తమ వెబ్‌సైట్ నుంచి హేట్ ట్రాకర్‌ని తీసివేసింది. ఇక తరువాతి కాలంలో రవీష్‌కుమార్, పుణ్య ప్రసూన్ బాజ్‌పాయి, అభిసార్ శర్మ వంటి దిగ్గజ

**మిగతా 30వ పేజీలో**

# పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు!



- పి.ప్రసాద్

**శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పనిదినంగా మారాలి. కానీ 8 నుండి 10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది. ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. కార్మికుణ్ణి 'మాట్లాడే యంత్రం'గా దిగజార్చిన పెట్టుబడిదారీ యుగనీతిపై ఓ తిరుగుబాటు బావుటా మే డే! కార్మికుణ్ణి కూడా మనిషిగానే చూడాలంటే, అతడు/ ఆమె రోజుకు ఏ ఏ విధులకు ఎన్నెన్ని గంటల్ని కేటాయించాలో నిర్వచించింది మేడే పోరాటం.**

8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, మరో 8 గంటలు తన కోసం. ఈ ఆఖరిది ఆచరణలో వినోదం కోసం. లేదా కుటుంబ జీవితం కోసం. ఇదే అత్యంత ప్రాధాన్యత గలది. అదే 1886లో ప్రధానంగా పొందిందీ, నేడు ప్రధానంగా కోల్పోయేదీ! రోజుకు 24 గంటలు. దాన్ని మూడు సమ భాగాలు చేస్తే 8 గంటలౌతుంది. ఓ 8 గంటలు పెట్టుబడిదార్ల వద్ద పని కోసం. ఇంకో 8 గంటలు పని ద్వారా కోల్పోయిన శరీర శక్తిని తిరిగి పొందేందుకు నిద్ర కోసం. మరో ముఖ్యమైన 8 గంటలు తన కోసం. అంటే కార్మికుడి కోసం. ఆచరణలో కుటుంబం కోసం. అదే సాంఘిక జీవితం. సోషల్ లైఫ్. ఓ మనిషిగా కార్మికుణ్ణి మార్పుకు గురి చేసే ముఖ్యమైన ప్రక్రియ అదే!

మనిషికి అవసరమైన 8 గంటల నిద్రా కాలాన్ని కూడా పారిశ్రామిక వర్గం కబ్జా చేసిన దశ ఉంది. అది కార్మికవర్గాన్ని 'టాకింగ్ టూల్'గా, 'లివింగ్ యానిమల్'గా ఫ్యాక్టరీల్లో 16 గంటలకు మించి పని చేయించింది. ఫలితంగా ఆకలి, రోగాల కంటే, నిద్ర చాలని కారణంగా అకాల మరణాలు జరిగిన దశ ఒకటుంది. అలా మరణించిన వారిని పశువుల శవాల్లా అవతలకు ఈడ్చి వేసి రిజర్వుడ్ నిరుద్యోగులతో పని చేయించుకుంది. అలా పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ శవ రాశుల పునాది మీద బలపడింది.

1789 ఫ్రెంచ్ విప్లవం, 1886 మే డే పోరాటం మధ్య 97 ఏళ్ల వ్యవధి ఉంది. శతాబ్ది తేడాలో సంభవించిన రెండు ప్రాపంచిక ఘటనలు రెండు భిన్నమైన మానవ విలువల్ని అందించిన నేపథ్యం ఉంది. ఈ రెండింటికి కర్త పాత్రను మొదట సందర్భంలో రైతాంగం, తర్వాతి సందర్భంలో కార్మికవర్గం చేపట్టి విజయవంతం చేశాయి. ఆ కాలాల్లో వాటికి ఏ ఏ వర్గాల జనం కర్తలుగా మారినా, అవి అందించిన ఫలితాలు మాత్రం అంతిమంగా ఆనాటి సగటు సమాజాల విలువలుగానే మారాయి. ఆ విలువలను కోల్పోయే ప్రమాదం ఏర్పడితే ఆ నిర్దిష్ట వర్గాల ప్రజల వరకే పరిమితం కాకుండా మొత్తం ప్రజలు కూడా నష్టపోతారు. ఈ వెలుగులో మరో 8 గంటల పని దినానికి ఎదురయ్యే నేటి ప్రమాదం పట్ల సకల రంగాల ప్రజల్ని అప్రమత్తం చేయాల్సి ఉంది.

మేడే పోరాటంతో దక్కిన 8 గంటల పని దినం కార్మికుణ్ణి మనిషిగా మార్చింది. పని, నిద్ర పోగా మరో 8 గంటలు కార్మికవర్గానికి దక్కింది. దీంతో భార్యాబిడ్డలతో కార్మికవర్గం సామాజికంగా వినోదభరిత జీవితాన్ని పొందింది. తద్వారా కార్మికుడు యంత్రంగా కాక, మనిషిగా రూపొందాడు. ఈ మరో 8 గంటల సాంఘిక జీవితం కార్మికవర్గాన్ని పూర్తి స్థాయిలో మార్చివేసింది. వినోద జీవితం గడపడానికి సమయం దొరికిన తర్వాతనే నాటి ప్రజలందరి వలెనే తమ భార్యాబిడ్డలతో కార్మికవర్గం వీధుల్లో, పార్కుల్లో, వినోద క్రీడల్లో, పండగ పబ్బాలలో, సంబరాలలో, గ్రంథాలయాల్లో భాగమైంది. తన పూర్వ పశుబంధం స్థానంలో కొత్తగా మనిషిబంధం రూపొందింది. ఏ నిర్వచనాన్ని ఎవరు ఎలా ఇచ్చినా, వాస్తవ ఆచరణలో నాటి కార్మికుణ్ణి యాంత్రిక జీవితం నుండి వేరు పరిచింది మేడే పోరాటమే.

మేడే పేరు వింటే ఎర్ర జెండా రెపరెపలు, జండా గద్దెలు, స్థూపాలంకరణలు, విప్లవ గానాలు, పోరాట నాదాలు, కార్మిక ప్రదర్శనలు, శ్రామికవర్గ కవాతులు, ప్రభాత భేరీలు, ఉద్వేగభరిత ప్రసంగాలు గుర్తుకు వస్తాయి. ఇంతకంటే భిన్నమైన మానవీయ కోణం కూడా మేడేలో దాగి ఉంది. దాన్ని ప్రాచుర్యంలోకి తేవడం నేటి తక్షణ, ప్రధాన కర్తవ్యం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పనిదినంగా మారాలి. కానీ 8 నుండి 10,

12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? కోవిడ్‌లో 12 నుండి 14 కోట్ల మంది వలస కార్మికుల వెతలు లోకం ఎదుట బహిర్గతమైనవి. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది.

శారీరక శ్రమ చేసే కార్మికవర్గం మాటే కాదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగవర్గం మాట కూడా ఇదే! ఈ మానసిక శ్రమ చేసే ఉద్యోగ వర్గాలతో సైతం గతం కంటే ఎక్కువ గంటల పని చేయించే స్థితి ఏర్పడింది. ఇదెక్కడి వరకు వెళ్లిందంటే ఉన్నత విద్యావంతులే కాక, సాంకేతిక నిపుణులై అధిక రాబడి గల సాఫ్ట్‌వేర్ వంటి ఉద్యోగులు సైతం నేడు అధిక సమయం పనిచేయాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా ఐటి ఉద్యోగవర్గపు సాంఘిక జీవితం తీవ్ర కల్లోలభరితమవుతున్నది. వారు మానసిక రోగులుగా మారుతున్న దుస్థితిని చూస్తున్నాం. వారి వైవాహిక కుటుంబ జీవితంపై దుష్ప్రభావం పడుతోంది. ఎంత జీతాలు వచ్చినా సాంఘిక జీవితాన్ని కోల్పోతే సుఖం ఏమిటి? ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. ఈ కర్తవ్యం శ్రామికవర్గ, ఉద్యోగ సంఘాలపై ఉంది. మేడే సందర్భంగా శ్రామికవర్గ సంస్థల నేతలు, ఆర్గనైజర్లు, కార్యకర్తలు ప్రత్యేక బాధ్యతని నిర్వహించాల్సి ఉంది. వారికి మేడే కార్మికవర్గ వ్యవహారంగా కాకుండా, యావత్తు సమాజ వ్యవహారంగా మార్చడానికి ఓ అవకాశం ఉంది. వారు దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వారు మేడేని విశాల ప్రజాల మధ్యకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలి. ఆ సావకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఇప్పటికే కొంత వైఫల్యం ఉంది. ఇలా చెప్పాల్సి వస్తున్నందుకు సాటి శ్రామికవర్గ సహచరునిగా బాధతో పాటు విచారం వ్యక్తం చేస్తున్నాను.

పని గంటల కాలపరిమితి పెరిగిన మేరకు కార్మికవర్గం తమ సాంఘిక జీవితాన్ని కోల్పోతుంది. కారల్ మార్క్స్ చెప్పినట్లు కార్మికవర్గం తీవ్ర పరాయీకరణకి గురౌతుంది. తన ఎదుట గల అన్ని శక్తుల్ని శత్రువులుగా చూస్తోంది. ఆ అందరి దృష్టిలో కార్మికవర్గం కూడా తేలికైపోతుంది. దాన్ని వారు కూడా శత్రువుగా చూసే స్థితి ఏర్పడుతుంది. తుదకు ఆ నష్టం కేవలం కార్మికవర్గానికే పరిమితం కాకుండా మొత్తం సమాజం నష్టపోతుంది. ఈ విధంగా దేశంలో నలభై కోట్లకి పైగా కార్మిక కుటుంబాలది యాంత్రిక జీవితంగా మారితే, భావి సామాజిక సంక్షోభస్థితి ఏ స్థాయిలో ఉంటుందో తేలిగ్గా ఊహించవచ్చు. ఈ కారణంగా రేపటి సంక్షోభాన్ని నివారించడం కోసం కార్మిక కుటుంబాల్ని చైతన్యపరిచి పోరాటానికి సిద్ధం చేయడం ఓ కర్తవ్యం కావాలి. అందుకే 138వ మేడే సందర్భంగా కార్మికోద్యమ శక్తులతోపాటు ప్రజాతంత్ర, వామపక్ష, లౌకిక, ప్రగతిశీల శక్తులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.


జీతభత్యాలు, సౌకర్యాలు, హక్కులు, జీవన ప్రమాణాలు, ఉద్యోగ భద్రత వంటి వివిధ కోర్కెల సాధనకై పోరాడుతూ అంతకంటే ప్రాధాన్యతని పని గంటలపై ఇవ్వాల్సి ఉంది. మన మీద ఇది చరిత్ర మోపిన బాధ్యత! రేపు ముందుకు వెళ్లాలంటే నేడు మనం వెనక్కి వెళ్లాల్సిందే. 2025 వైపుకూ, ఇంకా ముందుకూ వెళ్లాలంటే, మంచి భవిష్యత్తును మనం నిర్మించుకోవాలంటే, 1886 వైపుకు చూపును సారిద్దాం. చికాగో విప్లవ స్ఫూర్తిని పొంది ముందడుగు వేద్దాం. ❑

# ఒప్పులకుప్ప ఒడిలో మీడియా!

**28వ పేజీ తరువాయి**

జర్నలిస్టులను యాజమాన్యాల మీద ఒత్తిడి తెచ్చి ఉద్యోగాలు విడిచి వెళ్లేలా చేసింది కేంద్ర ప్రభుత్వం. ఎన్‌డీ టీవీ లాంటి న్యూస్ సంస్థల్ని పెట్టుబడిదారీ మిత్రులు స్వాధీనం చేసుకునే పరిస్థితులని సృష్టించింది. ఒక పక్క కుల వివక్షకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉన్న ఛానళ్లు, పత్రికల మీద, పాత్రికేయుల మీద విరుచుకుపడే ప్రభుత్వం సుదర్శన్ టీవీ, రిపబ్లిక్, టైమ్స్ నౌ, ఆజ్ తక్ వంటి ఛానళ్లు ప్రతిరోజూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే షోలు చేస్తుంటే చూసీ చూడనట్టు ఉంటోంది. గత కొన్ని నెలల్లో ఈ ఛానళ్లకి నేషనల్ బ్రాడ్ కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ విద్వేషపూరిత షోలు చేస్తున్నారని జరిమానాలు విధించటం చూస్తున్నాం. కానీ ప్రభుత్వం మాత్రం వాటిపై చర్య తీసుకోకపోగా, నియంత్రించే ఊసే లేదు. గతంలో హత్రాస్‌లో ఒక దళిత మహిళను అగ్ర కులాల వాళ్లు అత్యాచారం చేసి, దారుణంగా హింసించి చంపిన ఘటన తరవాత, దానిని గురించి రిపోర్ట్ చేయడానికి వెళుతున్న సిద్దిక్ కప్పన్‌ను ఇంకా ఒక్క అక్షరం కూడా రాయకముందే అరెస్ట్ చేసి రెండేళ్లపాటు జైలులో మగ్గించింది కేంద్ర ప్రభుత్వం. ఈ సంఘటనలన్నిటికీ కామన్ విషయం దళిత బహుజనుల, అల్ప సంఖ్యాకుల రక్షణ, భద్రత, హక్కులు అని గమనించాలి. ఈ ప్రభుత్వం పదే పదే మనకు పంపుతున్న సందేశం – ఈ దేశంలో అగ్రకులాలు, బహు సంఖ్యాకుల ఆధిపత్యమే ఉండాలి. ఇతరుల సమస్యలు తలెత్తినా, గొంతులు లేచినా అణచివేత అనివార్యం. మీడియా మీద అణచివేతను కేవలం 19(1)A కోణం నుంచి చూస్తే సరిపోదు. దీనికి ప్రబలంగా కుల మత కోణం కూడా ఉంది. అగ్రకుల పాత్రికేయులను వెంటాడటం వెనుక కూడా వారు ఈ సామాజిక వర్గాలకు మద్దతుగా నిలబడినప్పుడే జరుగుతున్నది. ఈ విషయాన్ని ప్రజాస్వామ్య వాదులం ఎంత మందిమి గుర్తిస్తున్నాం? గుర్తిస్తే మన కర్తవ్యం ఏమిటి? ❑

# నిరసనలో పెద్దలకు దారి చూపిస్తున్న పిల్లలు



- కేశవ్

**ఆ రోజు కిరాతక ఇజ్రాయిల్ గాజాలోని ఒక ఇంటి మీద బాంబింగ్ చేసింది. ఇంట్లో ఉన్న తల్లి సబ్రీనా, తండ్రి షుక్రీ, మూడు సంవత్సరాల అమ్మాయి మలక్ తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయారు. సబ్రీనా ఏడు నెలల గర్భవతి అని డాక్టర్లకు తెలిసింది. చనిపోయిన ఆమె కడుపు నుండి ఆ శిశువుని డాక్టర్లు చాలా జాగ్రత్తగా బయటకు తీశారు. ఆ శిశువు నాలుగు రోజులు ప్రాణంతో ఐసియులో ఉండి, తర్వాత చనిపోయింది. వేదనా భరితమైన జీవితాలు గాజాలో నేడు సర్వసాధారణం అయిపోయాయి. అక్టోబర్ 7 నుండి దాదాపు 13 వేల మంది పిల్లలు యుద్ధం అత్యాచారాలకు గురై మరణించారు. ప్రతిక్షణం అస్థిరత చోటు చేసుకుంది. ఆకలి చావులు సాధారణం అయిపోయాయి. నేటికీ 34 వేల 388 మంది ప్రాణాలు విడిచారు. 77 వేల 437 మంది గాయపడ్డారు.**

మానవాళి మీద అత్యంత కిరాతకమైన చర్య యుద్ధం. మానవ సమాజాన్ని సమూలంగా చిరునామా లేకుండా నాశనం చేసేస్తుందీ యుద్ధం. సాధారణ జీవితాలను చిన్నాభిన్నం చేస్తుంది. కనీస జీవితాలను కూడా ఇవ్వలేని పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలు బతకడానికి కూడా కనీసం అవకాశం ఇవ్వవు. స్వార్థ ప్రయోజనాల కోసం, లాభాల సంచుల కోసం, ఆయుధాల ఫ్యాక్టరీల కోసం మనుషుల ప్రాణాలను బలి తీసు కునే రక్త పిశాచి. యుద్ధాల్లో రాజకీయ నాయకులు హాయిగా ఉంటారు. నష్టపోయేది సాధారణ ప్రజలు. ఒక పెద్ద సమూ హాన్ని నాశనం చేసే పైశాచిక వ్యూహం యుద్ధాలలో కనిపిస్తుంది. జాతి నిర్మూలన గతంలో జర్మనీలో చూశాం. ఈ రోజు ఇజ్రాయిల్ అదే పని చేస్తోంది. అంశం భిన్నం కావొచ్చు. అన్ని దేశాలు ఇలాంటి సాకుల్నే ఎన్నుకుంటాయి. మన దేశంలో కూడా మెజారిటీ, మైనారిటీ అనే అబద్ధాలను వ్యాప్తి చేసి, మెజారిటీ మతస్తులకు అదేదో అన్యాయం జరిగిపోతుందని ఒక సమూహాన్ని భయాందోళనలో ఉంచడం చూస్తున్నాం. యుద్ధం నేడు ఒక ఫ్యాక్టరీ. ఈ ఫ్యాక్టరీకి కొన్ని వేల ప్రాణాలు కావాలి. అప్పుడే వీరి లాభాల సంచులు పటిష్టంగా ఉంటాయి. యుద్ధం వికృత చేష్టల్ని 13 సంవత్సరాల అన్నా ఫ్రాంక్ 1943 లో ఇలా రాస్తోంది.



సోమవారం జూలై 19, 1943

**ప్రియమైన కిట్టీ,**

ఆదివారం ఉత్తర ఆమ్ స్టర్ డామ్‌పై బాంబుల వర్షం కురిసింది. వినాశనం మరీ భయంకరంగా ఉన్నట్టు అనిపిస్తోంది. వీధులకు వీధులు శిథిలాలైపోయాయి. చనిపోయిన మనుషులందరినీ తవ్వి తీయడానికి చాలా సమయం పడుతుంది. ఇప్పటి వరకు 200 మంది గాయపడ్డారు. వైద్యశాలలు కిక్కిరిసి ఉన్నాయి. పొగతో ఉన్న శిథిలాలలో పిల్లలు వాళ్ళ తల్లిదండ్రుల్ని వెదుకుతున్నారని విని ఉంటావు. దూరాన విమానాల నిస్తేజ శబ్దం గురించి గుర్తుకు వచ్చినప్పుడు నాకు వణుకు పుడుతుంది. వినాశనం సమీపి స్తోందని దాని అర్థం.

13 సంవత్సరాల అమ్మాయి రాబోతున్న వినాశనం గురించి ఆ రోజు సూచిస్తోంది. యుద్ధాలు అంతం కాలేదు. అవి మరింత శక్తిని పుంజుకున్నాయి. నేడు ఇజ్రాయిల్ అత్యాచారాలకు అంతులేదు. ఒక ప్రజా సమూహాన్ని ప్రపంచ పటం నుండి తుడిచి పెట్టాలని అనుకుంటోంది. దానికి ఇతర సామ్రాజ్యవాద దేశాలు వంత పాడుతున్నాయి. వేలకొలది గాజా ప్రజలు శిబిరాలలో తలదాచుకోవలసి వస్తోంది. దారుణమైన పరిస్థితుల్లో ప్రజలు జీవిస్తున్నారు. యూఎన్ఓ పంపించే ఆహారాన్ని కూడా వీరికి అందకుండా చేసే ఇజ్రాయిల్ రౌడీయిజం చూశాం. అందుకే ప్రపంచం మొత్తం మీద ప్రజలు నిరసన తెలియజేస్తున్నారు. గాజా మీద ఇజ్రాయిల్ దాడికి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయిల్ వెనుక ఉన్న సామ్రాజ్యవాద దేశాల మీద నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసన సాధారణ ప్రజల నుండి ఈ రోజు విశ్వ విద్యాలయాల్లోకి పాకింది. విద్యార్థులు నేడు దారి చూపిస్తున్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని పెద్దలకు గుర్తు చేస్తున్నారు. విశ్వ విద్యాలయాలు ఇజ్రాయిల్‌కి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇది అమెరికా కావొచ్చు. ఫ్రాన్సు కావొచ్చు. భారతదేశం కావొచ్చు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో నేడు గాజా మీద ఇజ్రాయిల్ దాడులకు విరుద్ధంగా విద్యార్థుల నిరసనలు కనిపిస్తున్నాయి. విద్యార్థులు విశ్వ విద్యాలయం బయటకొచ్చి టెంట్లు కట్టి వివిధ రకాలుగా తమ నిరసన తెలియజేస్తున్నారు. ఇది అమెరికా ఊహించలేదు. అందుకే, తన పోలీస్ ఫోర్స్‌ను ఉపయోగించి నిరసనలకు అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. కానీ, విద్యార్థులు తగ్గడం లేదు. దాదాపు 60 విశ్వ విద్యాలయాలు నేడు ఈ నిరసన వెల్లువలతో ముందుకు వస్తున్నాయి. ఇది అమెరికా నుండి ఫ్రాన్స్, ఆస్ట్రేలియాకు కూడా పయనించింది. హార్వర్డ్ విశ్వ విద్యాలయం, బోస్టన్ విశ్వ విద్యాలయం, ఎమర్సన్ కాలేజ్, జార్జి టౌన్ విశ్వ విద్యాలయం, టెక్సాస్ విశ్వ విద్యాలయం, కాలిఫోర్నియా విశ్వ విద్యాలయం, ఇలా దాదాపు 60 విశ్వ విద్యాలయాల్లో ఈ నిరసన వెల్లువలు కనిపిస్తున్నాయి. ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కేరలిన్ ఫోలిన్ చేతులను వెనక్కి లాగి బలవంతంగా పోలీసులు భూమి మీదకి తోసేయడం మీద, అత్యాచారాల మీద మరింత నిరసన వెల్లువ కనిపిస్తోంది. విద్యార్థి లోకం కోపంతో ఊగిపోతున్నారు. పోలీసులు విద్యార్థుల మీద వివిధ రకాల క్రమశిక్షణ చర్యలు చూపిస్తున్నప్పటికీ విద్యార్థులు తగ్గడం లేదు. విద్యార్థులు, యువత నేడు మరలా ముందుకు వచ్చారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఇదో కొత్త అధ్యాయం. స్వేచ్ఛా విలువలను కాపాడడం అవసరమని వీరు గుర్తు చేస్తున్నారు. గతంలో భారతదేశంలో విశ్వ విద్యాలయాలు, ఆయా విద్యార్థులు అత్యంత చారిత్రక పాత్రను పోషించారు. కలకత్తా విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయం, జ ఎన్‌యూ అన్యాయాన్ని ఎదిరించడంలో పోషించిన చారిత్రక పాత్రను మర్చిపోలేం. ఇటీవలి ప్రపంచీకరణ అందించిన వ్యక్తి వాదం, వాట్సాప్ యూనివర్సిటీ అందించిన తప్పుడు చరిత్రలు తాత్కాలికంగా మభ్యపెట్టి ఉండొచ్చు. కానీ, ప్రమాదంలో పడుతోన్న ప్రజాస్వామ్యం గురించి అమెరికా యువత పెద్దలకు గుర్తు చేస్తున్న అంశాలు మరో చరిత్రకు పునాదులు వేస్తాయి. ❑




**అమెరికా యూనివర్సిటీల్లో విద్యార్థుల నిరసనలు**


# అద్వితీయ దార్శనికుడు, మానవతావాది కార్ల్ మార్క్స్



- అబ్బాస్

దేశంలో సంపద పునః పంపిణీ గురించి చర్చ జరుగుతున్న వేళ కార్ల్ మార్క్స్ జయంతి రావడం యాదృచ్ఛికంగా జరిగినప్పటి ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశం. ఈ సందర్భంగా మార్క్స్ చూపించిన పరిష్కారం గురించి, మార్క్స్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం. సునిశితమైన పరిశీలన, హేతుబద్ధమైన విశ్లేషణ, శాస్త్రీయమైన పరిష్కారం మార్క్స్ యొక్క ప్రత్యేకత. ఇవే ఆయన్ని ప్రపంచంలో మిలీనియం మేథావిగా నిలబెట్టాయి. ఆయన ఏదైనా అంశం గురించి చెప్పాలనుకున్నా, రాయాలనుకున్నా అందుబాటులో ఉన్న విస్తారమైన సమాచారాన్ని సేకరించి సునిశితంగా పరిశీలించి నోట్స్ తయారు చేసుకునే వారనేది ఆయన సేకరించిన సమాచారం, ఆయన రాతప్రతులు చూస్తే అర్థమవుతుంది. తర్కబద్ధంగా సమాచారాన్ని విశ్లేషించిన తరువాతే ఆయనను వ్యతిరేకించే వారిని అబ్బురపరిచే విధంగా పరిష్కారాలు చూపించేవారు. ఆయన ప్రతిపాదించిన దానిని ఎదుటి వారు కాదనలేని పరిస్థితి. ఎందుకంటే ఎదుటి వారి వాదనలు తానే లేవనెత్తి అవి ఎందుకు తప్పో వివరించారు. సమస్యకు అత్యంత శాస్త్రీయమైన పరిష్కారం చూపడంలో ఆయనకు ఆయనే సాటి. తగిన సమాచారం లేకుండా ఏ విషయంపైనా ఆయన కామెంట్స్ చేసినట్లు ఆయన రచనల్లో ఎక్కడా కనిపించదు. పెట్టుబడి గ్రంథంలో ఆయన పేర్కొన్న సమాచారం చదివిన ఎవరికైనా సాంకేతిక, సమాచార సాధనాలు అందుబాటులో లేని ఆ కాలంలో ఇంత సమాచారం ఎలా సేకరించగలిగారని ఆశ్చర్యం కలుగక మానదు. నిరంతరం సమాచారం సేకరించి సునిశితంగా పరిశీలించాలి. తగిన సమాచారం లేకుండా మార్క్సిస్టులు నిర్ధారణకు రాకూడదనేది మార్క్స్ ఆచరణలో చూపారు. సమాచార విశ్లేషణలో ఆయన ప్రత్యేక శైలి ఏర్పరచుకున్నారు. అదే గతితార్కిక పద్ధతి. వస్తుగత పరిశీలన పద్ధతి. అందుకే ఆయన పరిష్కారాలు శాస్త్రీయమైనవి ఉన్నాయి. దానిద్వారానే ఆయన సమాజ గమనాన్ని అంచనా వేయగలిగాడు. మార్క్సిస్టులుగా అందరం మన చుట్టూ జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించాలి, శాస్త్రీయ విశ్లేషణ అనంతరం, కార్యాచరణను రూపొందించికోవడం అలవర్చుకోవాలి. అది శాస్త్రీయమైన పద్ధతి.

మార్క్స్‌ను విమర్శించే వారిలో ఎక్కువ మంది కనీసం ఆయన రచనలు చదవలేదేమో అనిపిస్తుంది. చదివిన వారిలో కూడా ఎక్కువమంది ఆయనని సరిగా అర్థం చేసుకోలేదేమో



అనిపిస్తుంది. ఎందుకంటే ఆయన విశ్లేషణలు చాలా లోతైన తాత్వికతతో ఉంటాయి. మనిషి పరాయీకరణ గురించి ఆయన విశ్లేషణ తత్వవేత్తలుగా చెప్పుకునే వారికి కొరుకుడు పడదు. అర్థశాస్త్రంలో ఆయన ఆవిష్కరణలు బూర్జువా ఆర్థికవేత్తలు ఈ కాలంలో కూడా కనీసం ఊహించనివి. ఆయన విశ్లేషణలో రాగద్వేషాలకు తావులేదు. కత్తికంటే పదునైన విమర్శచేయగలడు. వ్యంగ్యంగా ఎత్తిపొడవగలడు. ఎదుటివారి వాదనలో వాస్తవాలు ఉన్నప్పుడు వాటిని అంతే నిజాయితీగా పొగడడం ఉంటుంది. ప్రారంభకాలంలో యువహెగెలియన్స్‌తో కొనసాగినప్పటికి, హెగెల్ భావవాదాన్ని ఎలాంటి మొహమాటం లేకుండా ఖండించాడు. అదే సందర్భంలో హెగెల్ గతితార్కిక పద్ధతిని తాను స్వీకరించినట్లు సగర్వంగా ప్రకటించాడు. ఫ్యూయర్ బాక్ విషయంలో అలాగే వ్యవహరించాడు. ఫ్యూయర్ బాక్ యొక్క భౌతికవాదాన్ని స్వీకరించినప్పటి దానిలోని లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అధిగమించాడు. మనిషి యొక్క చైతన్య పూరితమైన కార్యాచరణను ఫ్యూయర్ బాక్ అర్థం చేసుకోలేదని, దానివల్ల ఆయన భౌతికవాదం జడత్వానికి గురైన విషయాన్ని విమర్శనాత్మకంగా వివరించారు. కొంతమంది ఆయనకు సంపన్నులంటే ద్వేషమని, అందుకే వారికి వ్యతిరేకంగా సిద్ధాంతం రూపొందించారని ప్రచారం చేస్తున్నారు. ఇంకొందరు ఆయన మానవ హక్కుల గురించి పట్టించుకోలేదని విమర్శలు చేశారు. మరి కొందరు మార్క్స్ హింసావాది అని ముద్ర వేశారు. కాని మార్క్స్ గొప్ప మానవతావాది. సంపద అనేది మానవ శ్రమ

లేకుండా సృష్టించబడదు. సంపద పోగుపడటం అంటే దోచుకున్న శ్రమను ఒక్క దగ్గర కుప్పేసుకోవడం. ఒక మనిషిని మరో మనిషి అణిచివేత గురిచేసి దోపిడి చేయడం ఒక అమానవీయ ప్రక్రియ. సమస్త సమస్యలకు మూలం ఇందులో ఉంది. ఈ ప్రక్రియ నుండి సమస్త మానవాళి విముక్తి చెందాలని ఆయన ఆకాంక్షించారు. దోపిడికి గురవుతున్న కార్మికులతోపాటు దోపిడి చేసే పెట్టుబడిదారులు పరాయీకరణ చెందారని మార్క్స్ అంచనా వేశారు. ఎందుకంటే ఎదుటి వారిని దోపిడి చేయడం అనేది అమానవీయ ప్రవృత్తి. దాని నుండి పెట్టుబడిదారులు విముక్తి చెందాలని మార్క్స్ కోరుకున్నాడు. అందుకే కార్మికవర్గం తనను తాను దోపిడి, పరాయీకరణ నుండి విముక్తి చేసుకోవడంతోపాటు పెట్టుబడిదారులను విముక్తి చేస్తారు. మొత్తం మానవ సమాజాన్ని విముక్తి చేస్తారు. దీనర్థం ఏమిటంటే ఏ మనిషికి కూడా తన అభీష్టానికి విరుద్ధంగా జీవించే పరిస్థితి ఉండకూడదు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, కులం, అంటరానితనం ఉండకూడదు అని కోరుకునే వ్యక్తికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ కోరిక నెరవేరే అవకాశం లేదు. కుటుంబంతో కలిసి జీవించాలనే వలసకార్మికుల కోరిక నెరవేరే పరిస్థితులు ఉన్నాయా? ఇలాంటివి అనేకం. ఏ విధమైన ఆటంకాలు, ఒత్తిడి లేకుండా మనిషి తను కోరుకున్న విధంగా జీవించగలిగే సమాజాన్ని మార్క్స్ ఆవిష్కరించారు. ఒకరి కింద తను పనిచేయాల్సిన అవసరం లేదు. తన కింద వేరే వారిని పనికి నియమించుకునే అవకాశం లేదు. ఎవరికి ఎవరు యజమానులు కాదు, సేవకులు కాదు. ఎవరి పనులు వారు స్వేచ్ఛగా, ఆనందంగా చేసుకునే అత్యుత్తమ మానవ సమాజం అది.

వేల సంవత్సరాల చరిత్ర గమనంలో మనిషి తానే, తన స్వహస్తాలతో నిర్మించుకునే స్వర్గం. ఈ స్వర్గం అనేది పాలక వర్గాలు సృష్టించిన అభూతకల్పన లాంటింది కాదు. పాలక వర్గాల కల్పిత స్వర్గంలోకి మనుషులు మరణం తర్వాతనే వెళ్ళగలరు. కాని మార్క్స్ ప్రతిపాదించిన స్వర్గం మనిషి బ్రతికి ఉన్నప్పుడే అనుభవించగల వాస్తవ ప్రపంచం.

మానవ హక్కుల గురించి చేసే విమర్శలను కూడా పరిశీలిద్దాం. దోపిడీ సమాజాలలో హక్కులకు వ్యతిరేకంగా హక్కులు తలెత్తుతాయి. ఏ మనిషికైనా జీవించే హక్కు ఉంది. కాని బానిససమాజంలో బానిసను చంపేహక్కు బానిస యజమానికి ఇవ్వబడింది. అలాగే పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభం పొందడం( దోపిడి చేయడం) యజమాని హక్కుగా గుర్తిస్తూ, కార్మికులకు ఎన్ని హక్కులు, చట్టాలు ఉన్నా దోపిడి చేసుకునే హక్కు యజమానులకు ఉన్నంత కాలం వాటి ప్రయోజనం పరిమితం. ఎందుకంటే ఒకరి హక్కుకు వ్యతిరేకంగా మరొకరి హక్కు తలెత్తినప్పుడు బలప్రయోగందే నిర్ణయాత్మకపాత్ర అవుతుంది. బలవంతుల హక్కులు రక్షించబడతాయి, బలహీనులు బలవుతారు. మానవ హక్కులనేవి సమాజానికి అతీతమైనవికావు. హక్కులు సమాజం గుర్తించడం ద్వారానే వ్యక్తీకరించబడుతాయి. ఉదాహరణకు ఒక ద్వీపంలో ఒంటరిగా ఉన్న ఒక మనిషి ఆ ద్వీపంలో ఉన్న సమస్త సంపదలపై తనదే హక్కు అని ప్రకటించినా, ప్రకటించకపోయినా తేడా ఏమిఉండదు. ఆయన హక్కును గుర్తించే, లేదా తిరస్కరించే సమాజం లేదక్కడ. కాబట్టి వ్యక్తుల హక్కులు ఆ దశలో ఉన్న సమాజం అనుమతించిన మేరకే ఉంటాయి. బూర్జువా సమాజంలో మానవ హక్కులు ఆ పరిమితిలోనే ఉంటాయనేది గమనంలో ఉంచుకోవాలి. ఒక మనిషి హక్కును మరో మనిషి హరించే పరిస్థితి ఉన్నప్పుడు మానవహక్కుల ప్రశ్న తలెత్తుతోంది, కాని మార్క్స్ ప్రతిపాదించిన సమాజం ఒకరి హక్కుకు వ్యతిరేకంగా మరొకరి హక్కు తలెత్తే అవకాశం లేని వ్యవస్థ.

హింసావాదం గురించి విమర్శలు వినిపిస్తున్నాయి. విప్లవం పురుడు పోసుకోవడంలో హింస జరగడానికి అవకాశం లేదు అని చెప్పడానికి వీలు లేదు. ఆ మాటకొస్తే దోపిడి పాలకవర్గాలు వేలసంవత్సరాలుగా సాగిస్తున్నదేమిటి? స్త్రీల అణిచివేతతో ప్రారంభమైన హింసాకాండ ఇంకా కొనసాగుతూనే ఉంది కదా! రాజ్యాల విస్తరణకు యుద్ధాల్లో జరిగింది ఏమిటి? మతం పేరుతో, మత యుద్ధాలలో హింస మాటేమిటి? తిరుగుబాట్ల అణిచివేత పేరుతో హింసకు పాల్పడుతున్నదెవరు? ప్రపంచ యుద్ధాలకు కారకులెవరు? దోపిడి శక్తులు సాగించిన అమానుష హింసాకాండతో చరిత్ర మొత్తం రక్తంతో తడిసిపోయింది. కొన్ని మానవ జాతులు తుడిచిపెట్టుకు పోయాయి. హింస ఆగాలంటే దోపిడి అంతం కావాలి. దోపిడి చేసే విధానం రూపుమాపబడాలి. అలా దోపిడిని అంతంచేసే సమయంలో దోపిడి కొనసాగాలని కోరుకునే వారు ప్రతిఘటన చేస్తారు. దానిని అణిచివేసి దోపిడిరహిత సమాజాన్ని స్థాపించడం ద్వారా మాత్రమే అహింసాపూరిత సమాజం నెలకొంటుంది. మార్క్స్ హింసను కోరుకోలేదు. ఎందుకంటే మనుషులు ఆకలితో చావడం, హింసకు గురికావడం, దోపిడికి గురికావడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే మానవ సమాజం యొక్క సకల బాధలు తొలగిపోవాలని కోరుకున్న మానవతావాది.మార్క్స్‌ను స్మరించుకోవడం అంటే ఏదో నాలుగు మాటలు చెప్పుకోవడం కాదు. మార్క్స్ పూర్తిగా ఆచరణవాది కాబట్టి మనం ఆయన చూపిన మార్గంలో అడుగులు ముందుకు వేయడం ద్వారా ఆయనకి నివాళులర్పించాలి. ప్రస్తుతం మార్క్స్ ఆలోచనలు విస్తృతస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉంది. ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచం ఒక కొత్తవెలుగు కోసం ఎదురు చూస్తున్నది. ఆ వెలుగుకు సంబంధించి మార్క్స్ అందించిన సందేశాన్ని వారికి అందించాలి. అదే మార్క్సిస్టులుగా మన ముందున్న ప్రధాన కర్తవ్యం అవుతుంది. ❑

# లెనిన్ నేడు లేడూ, చూడు జనంలో ఉన్నాడు !


**లెనిన్ కావ్యానికి ముందుమాట**

- ఎన్.వేణుగోపాల్

**వ్లాదీమిర్ ఇల్యీచ్ లెనిన్ గురించి రష్యన్ మహాకవి వ్లాదీమిర్ మయకోవ్‌స్కీ రాసిన దీర్ఘ కావ్యానికి శ్రీశ్రీ చేసిన తెలుగు అనువాదాన్ని లెనిన్ 154వ పుట్టిన రోజున, ఆయన శత వర్ధంతి సంవత్సరంలో శ్రీశ్రీ విశ్వేశ్వరరావు మళ్లీ ప్రచురించారు. ఆ పుస్తకానికి నేను రాసిన ముందుమాట ఇది.**

వ్లదీమిర్ ఇల్యీచ్ ఉల్యానొవ్ అనే ఒక సాధారణ వ్యక్తి ప్రపంచ చరిత్రనే మార్చిన, చరిత్రలో మొట్ట మొదటి సామ్యవాద రాజ్యం స్థాపించి, నిర్వహించిన లెనిన్ అనే అసాధారణ వ్యక్తిగా పరిణమించిన ఒక మహత్తర పరివర్తనను, పరావర్తనాన్ని ఎట్లా అర్థం చేసుకోగలం? నిండా యాభై నాలుగేళ్లు కూడా జీవించని, అందులోనూ జైలు శిక్షలూ ప్రవాసాలూ అనారోగ్యాలూ హత్యా ప్రయత్నాలూ చివరి ఏడాది పక్షవాతమూ తీసేస్తే అటూ ఇటూగా ఇరవై అయిదేళ్లు మాత్రమే సాగిన ప్రజా జీవితంలో ఒకానొక మనిషి సాధించగల అద్భుతాలను, సాధించిన అపురూప విజయాలను సూక్ష్మంగా ఎట్లా గ్రహించగలం? ఆ అర్ధశతాబ్ది చరిత్రకు, ఆ మాటకొస్తే ఆ అర్ధ శతాబ్దిని రూపొందించిన రెండు శతాబ్దాల రష్యన్ చరిత్రకు, ఆ తర్వాత గడిచిన వంద సంవత్సరాల ప్రపంచ చరిత్రకు క్లుప్తమైన వ్యాఖ్యానం ఎక్కడ దొరుకుతుంది ? క్లుప్తమైనది మాత్రమే కాదు, కవితాత్మక, కళాత్మక, హృదయంగల వ్యాఖ్యానం ఎక్కడ దొరుకుతుంది? ప్రవేశించండి. రష్యన్ కవి వ్లదీమిర్ మయకోవస్కీ రాసిన 'వ్లదీమిర్ ఇల్యీచ్ లెనిన్' మహా కావ్యంలోకి!

ఒక మనిషిని వేరొక మనిషి, ఒక జాతిని వేరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకానా ఇకపై చెల్లదు అని మానవ జాతి బహుశా ఆ పీడన మొదలైన నాటి నుంచి ప్రశ్నిస్తున్నది. కల గంటున్నది. ఆ స్వప్నాన్ని మొట్టమొదటిసారి సుస్థిరంగా సాకారం చేసిన వ్యక్తిగా లెనిన్ పేరు ప్రపంచ చరిత్రలో అజరామరంగా నిలిచిపోతుంది. నిలిచిపోయింది. అందుకే లెనిన్ జీవిత కథను కొన్ని వందల మంది వందలాది భాషలలో రాశారు, కవిత్వీకరించారు. కాల్పనిక రచనలు చేశారు. చిత్రాలు గీశారు. సంగీత కృతులు రచించారు. నాట్యరూపకాలు అల్లారు. చలన చిత్రాలు తీశారు. ప్రపంచమంతా లెనిన్‌ను ప్రేమించింది. గౌరవించింది. హృదయం లోలోపలికి ఆహ్వానించింది. మరొక పక్క, దోపిడీ పీడనలను తుద ముట్టించాడని, తమ సౌఖ్యాలనూ విలాసాలనూ




రద్దు చేశాడని ఆగ్రహంతో డబ్బు సంచుల కిరాయి రచయితలు కొన్ని డజన్ల మంది అయినా లెనిన్ అనే భూతాన్ని తిట్టి దిగపార బోశారు. లెనిన్ వస్తువుగా వెలువడిన అటువంటి వందలాది సృజనాత్మక రచనలన్నిటిలోకీ అత్యద్భుతమైనదీ, ఆయన వ్యక్తిత్వాన్ని అన్ని కోణాల నుంచీ సమగ్రంగా వివరించినదీ, అత్యంగా ఆర్ద్రంగా, హృద్యంగా లెనిన్‌ను గుండెలకద్దుకుని చదువరుల గుండెలకద్దినదీ ఈ 'వ్లదీమిర్ ఇల్యీచ్ లెనిన్' మహాకావ్యం. బహుశా కవి కన్నీటిలో, హృదయం లోలోపలి నులివెచ్చని నెత్తురులో ముంచి రాసిన ఈ అక్షరాలు వంద సంవత్సరాలుగా నానా దేశాల అనేక భాషల అనేక వర్ణాల అనంత కోటి పాఠకుల కంటతడి పెట్టించాయి. నెత్తురు మండించాయి. నిజానికి లెనిన్ గురించి మయకోవస్కీ రచనలలో ఇది మొదటిది కాదు. 1920 ఏప్రిల్‌లో లెనిన్ యాభయ్యవ పుట్టినరోజు సందర్భంగా మయకోవస్కీ ఒక కవిత రాశాడు. 1923లో లెనిన్ మెదడులో రక్తనాళాలు చిట్లి తీవ్రంగా అనారోగ్యం బారిన పడినప్పుడు 'మేం నమ్మం' అని మరొక కవిత రాశాడు. లెనిన్ జీవితం వస్తువుగా ఒక మహా కావ్యం


రాయాలనే ఆలోచనకు అప్పుడే బీజం పడింది. 1924 జనవరి 22న మయకోవస్కీ పదకొండవ అఖిల రష్యా సోవియెట్ల కాంగ్రెస్‌కు ప్రతినిధిగా హాజరైనప్పుడు, అంతకు ముందురోజు సాయంత్రం ఆరున్నరకు లెనిన్ అస్తమించాడని మిఖయిల్ కలీనిన్ చేసిన ప్రకటన విని అందరిలాగే దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఐదు రోజుల తర్వాత రెడ్ స్క్వేర్‌లో జరిగిన లెనిన్ అంత్యక్రియలలో పాల్గొన్నాడు. ఆ రెండు ఘటనలూ మయకోవస్కీ మనసు మీద లోతైన, గాఢమైన ప్రభావం వేశాయి. వెంటనే 'లెనిన్' పేరుతో దీర్ఘకావ్యం రాయడానికి పూనుకున్నాడు. అందులో భాగంగా మార్చి 31న రాసిన 'కొమ్సొమోల్ గీతం' అనే భాగం వెంటనే ఒక పత్రికలో అచ్చయి సుప్రసిద్ధమయింది. ఆ కవితలో భాగమైన 'లెనిన్ లివ్డ్, లెనిన్ లివ్స్, లెనిన్ విల్ ఆల్వేస్ లివ్' (లెనిన్ జీవించాడు. లెనిన్ జీవిస్తూనే ఉన్నాడు. లెనిన్ ఎల్లప్పుడూ జీవిస్తూనే ఉంటాడు) అనే మూడు పాదాలు దేశమంతా ప్రతిధ్వనించాయి. దీర్ఘ కవిత రచనను కొంతకాలం పక్కన పెట్టి మళ్లీ ఏప్రిల్‌లో మొదలుపెట్టి సెప్టెంబర్ దాకా రాస్తూనే ఉన్నాడు. ఈ మహాకావ్య రచన మయకోవస్కీ భావజాల, కళాత్మక, వ్యక్తిత్వ పరిణామంలో ఒక కీలకమైన, గుణాత్మకమైన మలుపు అని విమర్శకులు అన్నారు. ఈ కావ్య రచన కోసం ఆయన విస్తారమైన చారిత్రక సమాచారాన్ని, విశ్లేషణను సమీకరించాడు. రష్యన్ చరిత్రలో విప్లవోద్యమ పరిణామగతినంతా ఆకళించుకున్నాడు. రెండు శతాబ్దాల వెనక్కి వెళ్లి వీరోచితమైన రైతాంగ ఉద్యమాల మీదుగా, తొలి కార్మికవర్గ ఆవిర్భావం మీదుగా, జారిస్టు పాలన దుర్మార్గాల మీదుగా, రష్యన్ సమాజ పరివర్తన కోసం జరిగిన అనేక ప్రయత్నాల మీదుగా చారిత్రక విభాత సంధ్యలలో లెనిన్ సూర్యోదయాన్ని చిత్రించాడు. బోల్షివిక్ పార్టీ పుట్టుకను, యుద్ధాన్ని, అక్టోబర్ విప్లవాన్ని, తెల్ల బీభత్సాన్ని, అంతర్యుద్ధాన్ని, నవయువ సోవియట్ గణతంత్రం లేచి నిలిచిన అపురూప దృశ్యాన్ని చదువరుల కళ్లకు కట్టాడు. అదంతా మూడు వేల కవితా పాదాల్లో నిక్షిప్తమైన సామాజిక చరిత్ర. ఆ సమాజ గమనాన్ని మలుపు తిప్పిన ఒక వ్యక్తి జీవిత చరిత్ర. అది వచనం కాదు, ఉపన్యాసం కాదు, కవిత్వం. కళ. హృదయపూర్వకమైన ప్రేమ. అక్టోబర్ మొదట్లో పూర్తయిన ఈ కావ్యపు విడి భాగాలు సోవియట్ పత్రికలలో అచ్చు కావడం మొదలయింది. మాస్కో ప్రెస్ హౌజ్‌లో, మాస్కో కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయంలోని రెడ్ హాల్‌లో ఈ కవితా పఠనం జరిగింది. మొట్టమొదటి సోవియట్ విద్యామంత్రి, పత్రికా రచయిత, నాటక రచయిత, సాహిత్య విమర్శకుడు అనటోలీ లూనషార్స్కి ఇంట్లోనూ, మరి ఒకరిద్దరు ఆ నాటి ప్రముఖ రచయితల కార్యాలయాలలోనూ ఈ కవితా పఠనం జరిగింది. కవిత వింటూ లూనషార్స్కి ఏడ్చేశాడని, నలభై ఏళ్ల తర్వాత 1963లో ప్రచురించిన జ్ఞాపకాలలో లూనషార్స్కి కుటుంబ సభ్యులు తలచుకున్నారు. ఈ కవితా పఠనాలకు పార్టీ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు మాత్రమే కాక, అదే సమయంలో జరుగుతున్న ఒక కాంగ్రెస్‌కు ప్రతినిధులుగా దేశమంతటి నుంచీ వచ్చిన జర్నలిస్టులు కూడా హాజరయ్యారు. రెడ్ హాల్ లో కవితా పఠనం తర్వాత ఒక శ్రోత కొంత ఈసడింపుగా ఈ "రాజకీయ బోధ" కవిత్వం ఎందుకని ఒక చీటీ పంపాడట. అటువంటి ప్రశ్న అడుగుతావా అని ఇతర శ్రోతలు విరుచుకుపడ్డారట. కాని మయకోవస్కీ మాత్రం ఓపికగా నిజంగానే తానీ కవిత రాస్తున్నప్పుడు వస్తువు వల్ల రాజకీయ జర్నలిజానికి బలి అయిపోయే ప్రమాదం ఉందని జాగ్రత్త పడ్డానని, "ఈ కవిత రాయడంలో నా వైఖరి ఒక కవి వైఖరి మాత్రమే. కామ్రేడ్స్, అది నిలుపుకోవడం కష్టమయింది" అని జవాబిచ్చాడట. ఈ వివరాలు 1955లో రచయితా, విమర్శకుడూ కోర్నెలీ జెలిన్స్కీ రాసిన జ్ఞాపకాల లోనివి. మాస్కోలోని సుప్రసిద్ధ రంగస్థలం బోల్షోయి థియేటర్‌లో ఈ కవితా పఠనం జరిగితే, శ్రోతలు/ప్రేక్షకులు లేచి నిలబడి ఇరవై నిమిషాలపాటు కరతాళ ధ్వనులు చేస్తూ, స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారని ఒక కథనం ఉంది. అలా దాదాపు ఏడాదిపాటు రచన సాగుతూ, విడి భాగాలు అచ్చవుతూ, కవితా పఠనాలు జరుగుతూ వచ్చిన ఈ మహా కావ్యాన్ని మయకోవస్కీ అక్టోబర్ మొదటి వారంలో పూర్తి చేసి మూడో వారంలో ప్రచురణకర్తలకు పంపాడు. రష్యన్ భాషలో 'వ్లదీమిర్ ఇల్యీచ్ లెనిన్' మొదటిసారి పూర్తి పుస్తకంగా లెనిన్ గ్రాడ్‌లోని గోసిజ్దాట్ ప్రచురణగా 1925 ఫిబ్రవరిలో వెలువడింది. గడిచిన వంద సంవత్సరాలలో ఇది ఎన్ని భాషలలోకి అనువాదమయిందో, ఎన్నిసార్లు ప్రచురణ అయి, ఎన్ని లక్షల ప్రతులు కవితాభిమానుల, విప్లవాభిమానుల చేతుల్లోకి చేరాయో లెక్కలేదు. తొలి ఇంగ్లిష్ అనువాదం ఎప్పుడు వచ్చిందో తెలియదు గాని, 1967లో డోరియన్ రాటెన్ బర్గ్ చేసిన అనువాదం ప్రాచుర్యంలో ఉంది. ఈ మహాకావ్యం మొదటిసారి మన భాషలోకి యాభై నాలుగు సంవత్సరాల కింద, లెనిన్ శత జయంతి సందర్భంగా వచ్చింది. ఈ కావ్యం దానికదిగానే అద్భుతమైనదంటే, దాన్ని మన మహాకవి తెలుగు చేయడం మరొక మహాద్భుతం. అప్పటికే ఆయన లెనిన్ మీద తన సొంత కవిత ఒకటి రాసి ఉన్నాడు. కొమ్సొమోల్ గీతం తెలుగు చేసి ఉన్నాడు. ఈ కావ్యం అనువాదంలోంచి కొన్ని భాగాలు పత్రికల్లో ప్రచురించాడు. చివరికి పూర్తి పుస్తకానికి, మహాకావ్యానికి శ్రీశ్రీ చేసిన తెలుగు అనువాదం 'ప్రగతి' ప్రచురణాలయం, మాస్కో ప్రచురణగా వెలువడింది. 1/8 క్రౌన్‌కు దగ్గరగా ఉండే ప్రత్యేకమైన సైజులో మంచి కాగితం మీద అచ్చయిన హార్డ్ బౌండ్ ప్రతి అది. తెల్లటి కాన్వాస్ బైండింగ్‌పైన మట్టి రంగులో లెనిన్ నిలువెత్తు చిత్రంతో చాలా ఆకర్షణీయంగా వచ్చిన 124 పేజీల పుస్తకం అది. **మిగతా 39వ పేజీలో**

# మేడే చరిత్ర

## విజయవాడలో పుస్తకావిష్కరణ

- ఆకుల
అమరయ్య





**మేడే చరిత్ర-ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు పుస్తకావిష్కరణ సభలో డివివిఎస్ వర్మ కార్మిక సంఘాల కార్యక్రమాలు దీర్ఘకాలిక ప్రయోజనాలతో ఒక ప్రణాళిక అబద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది. మేడే పోరాట కాలంలో అమెరికాలో కార్మిక వర్గం తన పోరాట వ్యూహాన్ని నిర్మించుకోవడానికి అనుసరించిన పద్ధతి అది. ఆ పద్ధతి శాస్త్రీయమైందని ఆ ఉద్యమం నిరూపించింది. అని దారి దీపం పత్రిక సంపాదకులు డివివిఎస్ వర్మ అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మేడే చరిత్ర-ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు పుస్తకాన్ని ఆవిష్కరించి ఆయన ప్రసంగించారు.**

ఈ కార్యక్రమానికి ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు అధ్యక్షత వహించారు. మేడే అంటే ఉత్సవం కాదని, పండుగ కాదని, అది ఒక ఉద్యమమని, హక్కుల సాధన కోసం జరిగిన పోరాటమని ఆయన గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితో నేడు కార్మిక వర్గం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా త్యాగాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం అణచి వేస్తున్నప్పటికీ కార్మిక వర్గంలో తగినంత ప్రతిస్పందన కనిపించలేదని ఆయన అన్నారు. చికాగోలో మేడే ఉద్యమానికి సంబంధించిన ప్రణాళిక రూపకల్పనలో రెండు సంవత్సరాల కాల పరిధిని నిర్ణయించుకున్నారన్నారు. అత్యంత నిర్మాణాత్మ కంగా ఉద్యమాన్ని విజయవంతం చేసిన విషయాన్ని నేటి ట్రేడ్ యూనియన్ నాయకులు గుర్తించి ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. మేడే సందర్భంగా చేసే ప్రసంగాలలో తీసుకునే నిర్ణయాలలో తాత్కాలిక ప్రయోజనాలతో కూడిన అంశాల ఎజెండాను ప్రతిపాదించటం సరికాదన్నారు. జాతీయ స్థాయి లక్ష్యాలతో కూడిన కార్మికవర్గ ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

ఈ పుస్తకాన్ని పరిచయం చేసిన విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వి రామారావు మాట్లాడుతూ భారతదేశంలోని కార్మిక సంఘాలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఇతర సంస్థలపై దృష్టి కేంద్రీకరించాయి. కానీ దేశంలో అసంఖ్యాకంగా ఉన్న అసంఘటిత తరంగాన్ని సమీకరించడంలో, సంఘటిత పరచడంలో విఫలమయ్యాయన్నారు. అందువల్లనే అసంఘటిత రంగం ఎవరికీ కాకుండా పోయిందన్నారు. ఏడాదికో రెండేళ్లకు దేశ పారిశ్రామిక సమ్మెకు పిలుపు ఇవ్వడం తప్ప ఆ రంగాలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అయినప్పటికీ అసంఘటిత రంగం సమ్మెల ద్వారా తమ అస్థిత్వాన్ని నిరూపించుకుంటూ వచ్చాయని చెప్పారు. ఇక ప్రస్తుతానికి వస్తే ప్రపంచవ్యాప్తంగా పెద్ద సెక్టార్‌గా భావిస్తున్న ఐటీ రంగాన్ని కార్మిక సంఘాలు తమ వైపు తిప్పుకోవడంలో, సంఘాలు పెట్టడంలో విఫలమయ్యాయన్నారు. అవి పుబ్బలో పుట్టి మఖలో అంతరించినట్టుగా అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, యువజన రంగాలలో కొత్త తరం రాక పోవడం వల్ల కార్మిక సంఘాలకు కూడా నష్టం జరిగిందన్న

**మిగతా 42వ పేజీలో**

# పోరాటపథంలో ఎచ్చెన్ జీవనయానం




- మందలపర్తి కిషోర్

"ముత్యపు చిప్ప ఆత్మకథే ఆణిముత్యం!" అన్న ఫెదరికో ఫెలినీయే "నువు చేసిన పనిలోనే నీ ఉనికి ఉంటుందనీ అన్నాడు. బెంగళూరు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ఉంటూ, అతీంద్రియ శక్తులు కలిగి వున్నామని చాటించుకునే వాళ్ళ నిగ్గు తేల్చే నిమిత్తం, వైజ్ఞానికులూ-విద్యాధికులతో కూడిన ఓ సమితిని నియమించి చరిత్ర సృష్టించిన ఎచ్.నరసింహయ్య (ఎచ్చెన్) ఆత్మకథ -"పోరాట పథం"- అక్షరాలా అలాంటి ఆణిముత్యమే! అది చదివితే ఆయన అస్తిత్వసారం ఎంత గాఢమయిందో పాఠకులకు తేటతెల్లమవుతుంది. మేం కాలేజిలో చదువుకునే రోజుల్లో - బహుశా, జనతా ప్రభుత్వం ఏర్పడి వుండిన కాలంలో - ఎచ్చెన్ గురించి "ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా"లో పెద్ద వ్యాసం, మంచి ఇంటర్వ్యూ కూడా వచ్చాయని గుర్తు. "వీక్లీ"లో అచ్చయిన చరఖా తిప్పుతున్న ఎచ్చెన్ బొమ్మ చూస్తే చాలు, ఆయన వ్యక్తిత్వం ఎంత సరళమైందో అర్థమైపోతుంది. ఆయన్ని నేను ఒకే ఒక్కసారి కలిశాను. రోజంతా ఆయనతోనే వున్న నాకు, చాలాసేపటి వరకూ ఆయన తెలుగు వారేననే వాస్తవమే తెలియలేదు! ఇది ఇద్దరు తమిళులు మధ్యనో, కన్నడిగుల మధ్యనో, మలయాళీల మధ్యనో జరిగి వుండే అవకాశం వుంటుందనుకోను!! ఎచ్చెన్ని మొట్టమొదటిసారి కలిసినప్పుడు నాకెదురైన విచిత్రానుభవంతో ఈ పుస్తకం మీద సమీక్షను మొదలు పెట్టడం భావ్యంగా వుంటుందనిపిస్తోంది నాకు.

దాదాపు నాలుగున్నర దశాబ్దాల కిందటి మాటిది! 1970 దశకం చివర్లో - అని గుర్తు - అనంతపురంలో ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభ జరిగింది. అప్పట్లో అక్కడ ఎండలు మండిపోతున్నాయి! ప్రారంభోత్సవ ప్రసంగం చెయ్యడానికి కర్ణాటక నుంచి ప్రముఖ విద్యావేత్త, బెంగళూరు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఎచ్చెన్‌ను పిలిపించారు నిర్వాహకులు. ఎచ్చెన్ గొప్ప విద్యావేత్త, నైష్ఠిక గాంధీవాది మాత్రమే కాకుండా, ఆజన్మాంతం వైజ్ఞానిక విలువలకు కట్టుబడి వుండిన ఆదర్శవాది కూడా. 'అతీంద్రియ శక్తులు కలిగి వున్నట్లు చెప్పుకుని, జనాన్ని మోసం చేసి బతికే వాళ్ళ బండారం బట్టబయలు చేసే నిమిత్తం, తను వైస్ ఛాన్సలర్‌గా ఉండిన విశ్వ విద్యాలయం తరఫున ఓ సమితిని నియమించిన సాహసి ఆయన. సత్య సాయిబాబాకు వున్న అతీంద్రియ శక్తిని పరీక్షించదల్చుకున్నామని ఆయనకి రాసిన లేఖ, ఎచ్చెన్ని వైస్ ఛాన్సలర్ పదవి వదిలిపోయేలా చేసిందని అప్పట్లో పత్రికల్లో వచ్చింది. కోలార్ జిల్లా హొసూరుకు చెందిన ఎచ్చెన్ "ఇంటి భాష" తెలుగే కానీ, ఆయన ఆ భాషలో మాటాడితే, తెలుగు నేల నాలుగు చెరగుల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు అర్థం కాకపోవచ్చునని, నిర్వాహకులు భావించారు. తెలుగు నేల మీద బతికే వాడుక భాష ఆయనకూ అర్థమయ్యేది కష్టమే! అతి విచిత్రమైన ఈ పరిస్థితిలో నేను ఆయనకు దుబాసీగా వ్యవహరించాల్సి వచ్చింది. అతి సరళమయిన ఆయన ఇంగ్లిష్ భాష నాకే కాదు-ఆయన ఉపన్యాసం విన్న వారందరికీ సులభంగానే బోధపడింది. అంతకుమించి, ఆయన మాటల్లో పారదర్శకంగా వుండిన నిజాయితీ - నియమబద్ధత విద్యార్థులను ప్రభావితుల్ని చెయ్యడంలో వింతేముంది?

పెద్దాయన(ఎచ్చెన్) ఉపన్యాసం ముగిసే సమయానికే,



భోజనం వేళ దాటిపోవచ్చింది. ఆ తొందర్లో వున్న నాకు, భోజన శాల, సమావేశస్థలానికి చాలా దూరమనే విషయం తెలిసేసరికి కంగారు ఎక్కువైంది. నేను తిన్నగా ఎచ్చెన్ దగ్గిరకెళ్ళి "అయ్యా ప్రొఫెసర్ గారూ, భోజనశాల ఇక్కడికి చాలా దూరంలో ఉందట. ఎండ మండిపోతోంది – మనం రిక్షా ఎక్కి అక్కడికి వెళ్లడం అన్నివిధాలా మంచిది" అన్నాను నాకొచ్చిన ఇంగ్లిష్ భాషలో. నా మాటలు పూర్తికాక ముందే నరసింహయ్య – తన ఇంటి భాష అయిన హోసూరు తెలుగులో – స్పందిస్తూ "నివ్వేం కుర్రోని వప్పా? ఇదో ఎండనా? మనం పొయ్యేది ఈడికెంత దూరంలో వుండాది ? మైల్దూరముంటాదా? రెండు? పోనీ, మూడు? పా అప్పా నాలుగడుగులేస్తే పొయ్యేదానికి రిష్కా, బొష్కా ఏల ??" అని నన్ను దులిపిపారేశారు. "అలాక్కాదు సార్ – ఇవాళ ఎండమండిపోతోంది ! ఇద్దరు ముగ్గురు పెద్దలు ఎండ దెబ్బతిని ఆస్పత్రిలో కూడా చేరారట !! మనం రిక్షాలో పోవడం బెస్ట్ – నా మాట వినండి" అని బతిమాలుకునే ధోరణిలో అడిగా, తెలుగులో, "అట్లైతే ఓ పనిచెయ్ ప్పా– నేను నడిచే పోతా వుంటా – నివ్వు ఎనకంబలపడి రిష్కా ఎక్కిరా! నేనేణ్ణయినా పడిబోతే, నన్ను నీ రిష్కాలో ఎత్తకవోయి ఆస్పత్రిలో పడెయ్!! ఏంది, ఇన్నవా??" అనడమేమిటి, ఉత్తర క్షణం మండే ఎండలో భోజనశాలవైపు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ పోవడమేమిటి ఒక్కసారే జరిగిపోయాయి. చచ్చినట్టు ఆయన వెనకనే నేనూ పోవలసి వచ్చింది. ఆ రోజున నేను ఆయన మీద చాలానే విసుక్కుని వుండొచ్చు. కానీ, అలాంటి మనిషిని కలవ గలిగినందుకు మరెప్పుడూ పశ్చాత్తాపపడలేదు!! చెప్పే మాటకూ, చేసే పనికీ మధ్య దూరం చెరిపేయగలిగిన వాళ్ళకి మాత్రమే, ఆత్మకథలు రాసుకునే అర్హత అందరికన్నా ఎక్కువగా వుంటుందని నా నమ్మకం. ఫెలినీ మాటలతో, ఈ సమీక్షను మొదలు పెట్టడానికి కూడా అదే కారణం. అయినా, జీవితాన్ని అర్థవంతంగా జీవించడానికి మించిన సృజనాత్మక కళ మరేముంటుంది – నాకు తెలియక అడుగుతున్నా! తెలుగు రచయిత, సంపాదకుడు, అనువాదకుడు, మిత్రులు కోడీహళ్ళి మురళీమోహన్ నాకు చిరకాల మిత్రులు. గతంలో విద్వాన్ విశ్వం మీద, సర్దేశాయి తిరుమలరావు మీద మిత్రులు మురళీ పుస్తకాలు ప్రచురించారు. మరో చిరకాల మిత్రులు నాగసూరి వేణుగోపాల్, మురళీ గారిని నాకు పరిచయం చేశారు. ఇంతకు ముందే ఏడెనిమిది పుస్తకాలు ప్రచురించిన కోడీహళ్ళి మురళీ మోహన్ తాజాగా "పోరాట పథం" అనే అనువాద గ్రంథాన్ని ప్రచురించారు. "హోరీరాటదహాది" పేరిట డాక్టర్ ఎచ్.నరసిం హయ్య (ఎచ్చెన్) కన్నడంలో రాసుకున్న ఆత్మకథకు ఇది తెలుగు సేత. నిరుపేద నేపథ్యం కలిగి వుండినప్పటికీ, ఎచ్చెన్ వైజ్ఞానిక శిఖరాలను అవలీలగా అధిరోహించారు. తనను తాను వైజ్ఞానిక శాస్త్ర విద్యార్థిగానూ, అధ్యాపకుడిగానూ పరిగణించుకునే ఎచ్చెన్‌ది అతి సరళమయిన వ్యక్తిత్వం. డాక్టర్ శివరుద్రప్ప అన్నట్లుగా, ఎచ్చెన్ ప్రాథమికంగా హేతువాది. మనిషిని(వ్యక్తిని కాదని(గ్రహించ(ప్రార్థన!) కేంద్రంగా చేసుకుని, రూపొందించు కున్న సామాజిక దృక్పథం ఆయనది. ఇక ఎచ్చెన్ రచనల్లో ఆద్యంతం పరవళ్లు తొక్కేది హాస్య ప్రియత్వం! పిల్లలన్నా, పువ్వులన్నా, పచ్చని పరిసరాలన్నా పడిచచ్చే పల్లెటూరి పెద్ద మనిషి ఎచ్చెన్! "పోరాటపథం" చదువుతూంటే, ఎవరిదో జీవితంలోకి తొంగి చూస్తున్నామన్న 'అపరాధ భావన' మనలో తలెత్తదు – మన చిన్నప్పటి నుంచి వింటూ వస్తున్న తండ్రి కథో, పెత్తండ్రి కథో చదువుతూ ఉన్నట్లు మాత్రమే అనిపిస్తుంది. ఈ ఆత్మీయత సాధించగలగడం రచయితగా ఎచ్చెన్ సాధించిన ఘన విజయం! దానికి, భాషాపరమైన దోహదం అందించి, మనకూ–ఎచ్చెన్‌కు మధ్య ఆత్మీయ వారధి నిర్మించిన పుణ్యం కోడీహళ్లి మురళీమోహన్. మన చుట్టూ ఓ సమాజం వుందని, మనకంటూ ఓ వ్యక్తిత్వం వుండాలని అనుకునే వాళ్ళందరూ చదివి తీరవలసిన పుస్తకం పోరాటపథం. ❑

# లెనిన్ నేడు లేడూ, చూడు జనంలో ఉన్నాడు !

**36వ పేజీ తరువాయి**

అయితే ఆశ్చర్యకరంగా ఇంప్రింట్ పేజీలో అచ్చయిన నెల, సంవత్సరం లేవు. ప్రచురణకర్తలు రాసిన చిన్న ముందుమాటలో లెనిన్ శతజయంతి సందర్భంగా శ్రీశ్రీ రాసిన కవితను పూర్తిగా ఉటంకించారు. ఆ కవిత 1970 జనవరి 14న రాసిందనే ఆధారం ఉంది గనుక, ముందుమాటలో శ్రీశ్రీ షష్టిపూర్తి ప్రస్తావన ఉంది గనుక ఈ పుస్తకం కచ్చితంగా 1970 ఫిబ్రవరి తర్వాత వెలువడి ఉంటుంది. అయితే మనసు ఫౌండేషన్ వేసిన శ్రీశ్రీ కవితా ప్రస్థానంలో లెనిన్ కావ్యం ప్రచురణ 1971లో జరిగిందని వేశారు. శ్రీశ్రీ తెలుగు చేసింది ఇంగ్లిష్ నుంచే గనుక ఇంగ్లిష్ అనువాదంతో తెలుగు అనువాదాన్ని పోల్చి చూపుతూ శ్రీశ్రీ ఆ మహా కావ్యానికి మరెన్ని మెరుగులు దిద్దాడో, డజన్ల ఉదాహరణలతో ఒక పూర్తిస్థాయి వ్యాసమే రాయవచ్చు. కాని మచ్చుకు రెండు అద్భుతమైన తెలుగీకరణలను మాత్రం చూపాలి: The time has come. I begin the story of Lenin అనే మయకోవస్కీ మాటలను శ్రీశ్రీ "ఇదే అదను లెనిన్ కథను రచించెదను నేను లెనిన్ బ్రదుకు జనం కొరకు ధ్వనించెదను నేడు" అని చేశాడు. Theres no one more alive than Lenin in the world అనే మయకోవస్కీ మాటలను "లెనిన్ నేడు లేడూ? చూడు జనంలో ఉన్నాడు" అని చేశాడు. మరణించి వంద సంవత్సరాలు గడిచినా నేటికీ జనంలో ఉన్న లెనిన్‌ను, మయకోవస్కీ కవిత్వంలో సజీవంగా ఉన్న లెనిన్‌ను తెలుసుకుందాం, పదండి. ❑


# ‘అష్టవంకర్ల నవ భారతం’



- వి.విజయ్‌కుమార్

**ప్రముఖ రాజకీయ విశ్లేషకులు,రచయిత పరకాల ప్రభాకర్ రాసిన ‘అష్టవంకర్ల నవభారతం’ పదేండ్ల మోడీ పాలన డొల్లతనాన్ని బయటపెట్టింది. తలకిందులుగా ఉన్న ప్రపంచంలో ఏ వ్యవస్థలైనా అడ్డదిడ్డంగా అష్టవంకర్లతో ఉండడం సహజమే. దశాబ్దకాలంగా ఈ దేశపు నడతా, నడకా భీతి గొలుపుతోంది. వెన్నెముక లేని మీడియా, మచ్చికైన అన్ని సమాచార వ్యవస్థలూ ఆప్టికల్ ఇల్యూషనరీ, డిజిటల్ ఇమేజరీలతో అన్ని వంకర్లనీ సరళరేఖల్లా కనబడేలా చేయడంలో తమ పాత్రని బ్రహ్మాండంగా నిర్వర్తిస్తున్నాయి. మెజారిటీ ప్రజలకు అందే 90 శాతం సమాచారమంతా ఈ దేశపు నేతల తాలూకూ స్తోత్ర పాఠాలు. మహా అయితే “డివైన్” కామెడీలు. జాతీయ వార్తలు రాజకీయ నాయకుల రోజువారీ డైరీల నివేదనలు. ప్రభాకర్ ఈ వ్యాసాలు విభిన్న సందర్భాల్లో రాసినవే అయినా వీటిలో లౌకిక, ఉదార వాద, బహుళవాద స్వభావంలోనూ, ప్రజాస్వామిక విలువల విషయంలో దారుణంగా రాజీపడిన తీరు, గణతంత్ర వ్యవస్థ నుండి భారత్ ఎంతగా దిగజారిందో చెప్పే ప్రయత్నం చేశారు.**

జేఎన్‌యూ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లాంటి ప్రతిష్ఠాకర విద్యాసంస్థల్లో చదువుకుని, సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్ని నికార్సైన సమాచారంతో సాధికారి కంగా వ్యాఖ్యానిస్తూ వచ్చే ప్రభాకర్ ఈ వ్యాస సంకలనం చదువరులతో చాలా విషయాలు ముచ్చటిస్తుంది. అందుకే ఈ పుస్తకం విలువ అపారం. వలసవాద ఆలోచన నిర్మూలన గురించీ, మూలాల గురించి గర్వపడటం గురించీ, ప్రజలు విధు లు పాటించటం లాంటి అమృతకాలపు ఐదు ప్రతిజ్ఞల గురించే కాదు, దారిద్ర్య నిర్మూలన, ఆకలి, అసమానతల గురించీ, విద్వేషాలకు తావివ్వని సమాజం గురించీ ఏ హామీలు లేవన్న విషయాన్ని గురించీ ప్రశ్నిస్తుంది. అంతేకాదు వంకర తిరిగిన ప్రతిపక్షం కాళ్లను తిన్నగా చేసి, కలిసికట్టుగా నిలబెట్టే పని జరక్కపోతే మోడీ, షాల నాయకత్వంలోని బీజేపీ, ఎన్నికల్లో




ఓటమి పాలైనంత మాత్రాన భారత గణతంత్ర వ్యవస్థ ఎదుర్కొం టున్న ప్రమాదం అదృశ్యమవ్వదనే చేదు నిజాన్నీ చెబుతుంది.

ఒకే మతస్తుల దేశమనే తప్పుడు పునాదిపై నిలబెట్టే సంకుచిత భావనని తుడిచేయాల్సిన అవసరాన్నీ, అమ్ముడుపోయే రాజకీయ పార్టీల గురించి అప్రమత్తం చేయకపోతే పొంచున్న ప్రమాదాల గురించీ చెబుతుంది. 1990 నుంచి బీజేపీ అంతకంతకు ఎదిగిన వైనాన్ని పూసగుచ్చినట్టు వివరించారు ప్రభాకర్. భారత చరిత్రలో హిందూ, హిందుత్వ, భారతీయ అస్తిత్వం చాలాకాలం వరకు ఒక అంగీకృత రాజకీయ భావనగా లేదనీ క్రమంగా హిందుత్వ భావన ప్రజల్లోకి ఎలా చొప్పించారో ప్రభాకర్ శక్తివంతంగా వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ “జనాభా” రాజకీయాల గురించి మాట్లాడుతూ, ఒకవైపు జనాభా పెరుగు దల (2.1) సాధారణ స్థాయిలోనే ఉన్నా, దేశాభివృద్ధికి జనాభా వేగంగా పెరగడమే ఆటంకం అంటూ చెప్పడం వెనుక చాలా స్పష్టమైన సంకేతం ఉందంటారు పరకాల.

జనాభా లెక్కల్ని ఆసాంతం అధ్యయనం చేసి ఆ విస్ఫోటనలోని డొల్లతనాన్ని బయటపెట్టారు. మరీ ముఖ్యంగా యూపీలో ప్రభుత్వం వ్యక్తం చేసే ఒక అసంబద్ధపు జనాభా అసమతుల్యత గురించి వాస్తవాలు విప్పే ప్రయత్నం చేశారు. మూడో బిడ్డని కంటే రూ.5 లక్షల జరిమానా లాంటి అంశాలను కూడా చర్చించారు. 2021 ప్యూ నివేదిక ఆధారంగా భవిష్య రాజకీయ వ్యవస్థ ఎలా ఉండబోతుందో విశ్లేషణ చేశారు. 95 కోట్ల వయోజనులున్న దేశంలో ఒక శాతంకంటే తక్కువ శాంపిల్ సర్వేతో దేశ భవిష్యత్తు ఎలా నిర్ణయిస్తారో అనూహ్యమన్నారు. అమెరికాలో జాతి వివక్ష మీద బాహ్యంగా వెలువరించే అభిప్రాయాలకంటే చాలా ఎక్కువ జాతి వివక్ష జనాల్లో ఉన్నట్లే, 'మనుషుల్ని కొట్టి చంపటం హిందూత్వకు విరుద్ధం' అని చెప్పే ఆర్ఎస్ఎస్ నాయకులు, సోషల్ మీడియాలో ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రచారం చేయడం లాంటిదేననీ స్పష్టం చేస్తారు.

### భారత్ వెలుగుతోందా? మిణుకుమిణుకు మంటోందా?

భారత్ 132వ స్థానంలో వెలిగిపోతోంది మిణుకు మిణుకు మంటూ! మనకు తోడుగా మయన్మార్ 149, నేపాల్ 143 స్థానంలో! ఆఖరికి శ్రీలంక కూడా 73వ స్థానంలో ఉంది! మరి విశ్వగురుత్వానికి ఈ ర్యాంక్ చాలా? ప్రభుత్వరంగ సంస్థల్ని ఆశ్రితులకు అప్పజెప్పి అచ్చేదిన్ ప్రజలకు తెచ్చివ్వడం సాధ్యమేనా? అని ప్రశ్నిస్తారు.

75 ఏళ్ల ఆజాదీ అమృత మహోత్సవంలో బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ నేరస్తులని విడుదల చేయడమూ, 2021 ఎన్నికల్లో ముఖ్యమంత్రే స్వయంగా, 80 శాతం హిందువులకి 20 శాతం ముస్లింలకీ మధ్య జరిగే ఎన్నికలే ఇవి అని ప్రకటించడమూ, ఉత్తరాఖండ్‌లో "ధర్మ సంసద్"లో "20 లక్షల మంది ముస్లింలను మనం వంద మందిమి చంపడానికి సిద్ధపడితే, భారతదేశం హిందూ దేశంగా మారిపోతుందని" ఒకడు నేరుగా ప్రకటించడమూ, యూనివర్సిటీలూ, శాస్త్ర సాంకేతిక విద్యాసంస్థలూ, సైన్స్ కాంగ్రెస్ సభలూ అన్నీ క్రమంగా కాషాయపు రంగు పులుము కోవడమూ, అహర్నిశలు పనిచేసే డిజిటల్ వేదికల ద్వారా పనిగట్టుకుని అశాస్త్రీయ అంశాలను ప్రచారంలో పెట్టి ప్రజలను గందరగోళపరచటమూ, ఫేస్బుక్, ట్విట్టర్, యూట్యూబ్, యాజమాన్యాలపై పట్టు సాధించ టమూ, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.5 వేల కోట్ల పార్టీ ఫండ్‌ను వసూలు చేసుకోవడమూ గురించి వివరించారు. స్కిల్ ఇండియా,మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, బేటి పడావో బేటి బచావో, అమృత్‌కాల్ లాంటి అంతూ పొంతూ లేని మిథ్యా ప్రతిబింబాల గురించి ఆందోళన చెందుతారు ప్రభాకర్.

ఈ దేశపు అంతులేని అసమానతల గురించి మన ముందుంచిన సత్యాలు దిగ్భ్రాంతికరంగాఉంటాయి.

కోవిడ్ -19 కారణంగా 99శాతం మానవాళి ఆదాయాలు ఘోరంగా పడిపోగా అది ప్రారంభమై నప్పటి నుంచీ ప్రతి 26 గంటలకు ఒక కొత్త బిలియనీర్ సృష్టించబడగా, పేదరికపు కూపంలోకి జారిపోయిన భారతీయులు 60 శాతం మందనీ, మొదటి పది మంది ధనవంతుల్లో ఒక్కొక్కడు రోజుకు పది లక్షల డాలర్ల చొప్పున ఖర్చు పెడితే వాళ్ళ సంపద కరగటానికి 441 సంవత్సరాలు పడుతుందనీ, అదే సమయంలో సంవత్సరానికి 21 లక్షల మంది ఆకలితో మరణిస్తున్నారనీ, ప్రతి నాలుగు సెకండ్లకు ఒకరు మరణిస్తు న్నారనీ, 77,500 కోట్ల డాలర్ల 100 మంది భారతీయుల సంపదలో 5 శాతం పెరుగుదల ఒక్క ఆదానీ గ్రూప్‌దేననీ చెబుతారు.

### వ్యవసాయ రంగం గురించి

జీడీపీలో 27శాతం వ్యవసాయ రంగానిదే అయినా, 64శాతం గ్రామీణ శ్రామిక శక్తి ఈ రంగం లోనే వున్నా, 2004- 2012 మధ్యలో మూడు కోట్ల మంది వ్యవసాయాన్ని ఎందుకు వదిలేశారో, ఈ నేపథ్యంలో వచ్చిన వ్యవసాయక చట్టాల రద్దును ఎందుకు కోరారో విశ్లేషించారు.

ఈ దేశంలో వ్యవసాయం గురించి మాట్లాడటం అంటే ఈ దేశపు ప్రతి ఆరు కుటుంబాల్లో ఓ కుటుంబం గురించీ, 86 శాతం చిన్న సన్నకారు రైతాంగం గురించీ మాట్లాడుతున్నట్టే నంటారు. వ్యవసాయం గురించి నిర్ణయం అంటే 54 శాతం ప్రజల గురించి నిర్ణయమేననీ అయినా కూడా 1965లో జరిగిన వ్యవసాయ రంగం మీద చర్చ తర్వాత ఈ దేశపు వ్యవసాయ రంగం గురించి మళ్లీ కూలంకషంగా చర్చ జరిగిన దాఖలాలే లేవంటారు.ఇదే సమయంలో వ్యవసాయక చట్టాలు సమర్ధించే ఆర్థికవేత్తలు, 'కనీస మద్దతు ధర' అవసరం లేదని ఎందుకు భావిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తారు.

### మహమ్మారి - అరాజకీయం గురించి

అన్నింటికన్నా ప్రముఖంగా కోవిడ్ సంక్షోభంలో ఆలోచించటాన్నీ, రాయడాన్నీ, మాట్లాడటాన్నీ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమంగా ఎలా ముద్రవేశారో తాను స్వయంగా ఎదుర్కొన్న అనేక అనుభవాలని చెబుతారు. కోవిడ్ సమయంలో ట్విట్టర్‌ను ప్రభావితం చేయడం, బ్రెజిల్ తర్వాత కోవిడ్ మరణాల సంఖ్య ఇండియాలో ఎక్కువైనా మోడీ నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం, జీడీపీలో రూ.1.8 లక్షల కోట్ల మేర నష్టం జరిగినా, రెండే రెండు వారాల్లో 15 లక్షల మంది ముంబై నుంచి వలస కార్మికులు వెళ్లిపోయినా, ఒక్క మహారాష్ట్రనే రూ.82 వేల కోట్ల విలువైన ఆర్థిక ఉత్పత్తి కోల్పోవడం జరిగినా మౌనంగా ఉండిన ప్రభుత్వ అలసత్వాన్ని ప్రశ్నిస్తారు ప్రభాకర్.

నార్వే, స్వీడన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, బ్రిటన్, బ్రెజిల్, ఇటలీ ఇంకా ప్రపంచంలో అనేక దేశాలు కోవిడ్ మీద దర్యాప్తులకు స్వయంగా ప్రభుత్వాలే చేపడితే ఇక్కడ కోవిడ్ కోసం 35 వేల కోట్ల రూపాయల ఖర్చు గురించీ, పీఎం కేర్ ఫండ్స్ గురించీ లెక్కల వూసే లేదంటారు. వ్యాక్సిన్ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకు నేంత వరకూ ప్రభుత్వ సంస్థల కంటే ప్రయివేటు ఆస్పత్రుల సరఫరాకే మొగ్గు చూపిన వైనాన్ని ఆధారాలతో సహా బయటపెడతారు. ఈ పుస్తకంలో ప్రముఖుల మూలాల్ని ఏవిధంగా పెకలించారో, ఫాదర్ స్టాన్ స్వామి వంటి వారి మరణానికి కారణమైన కారిన్య చట్టాల గురించీ, ఇతర అనేక అంశాల గురించీ వివరంగా రాశారు పరకాల ప్రభాకర్. "నాది నిస్సందేహంగా, నిస్సంకోచంగా వినిపించే విమర్శనాత్మక అసమ్మతి గళం. సూటిగా, నేరుగా వినిపించే గొంతుక. మన ప్రభుత్వమూ, ప్రజావ్యవస్థలూ, నేతలూ, రిపబ్లిక్ ఆశయాల నుండీ, ప్రకటించిన లక్ష్యాల నుండీ, ప్రజలకు చేసిన వాగ్దానాల నుండీ వైదొలిగితే, అధికారంలో ఉన్నవారికి వాస్తవాన్ని నేరుగా ఎత్తిచూపే స్వరమిది." ప్రభాకర్ గారి ఈ స్వరం భాస్వరమై మండాల్సిన తరుణమిది. ❑

# మేడే చరిత్ర-పుస్తకావిష్కరణ

**37వ పేజీ తరువాయి**


అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ సమయంలో ఈ తరహా పుస్తకాలు రావాల్సిన అవశ్యకత ఉందని, అయితే అవి కేవలం మొక్కుబడి తరహా కాకుండా కార్మిక వర్గ చైతన్యాన్ని, అటు మేధోపరంగా ఇటు ఆచరణాత్మకంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆర్‌వీ రామారావు అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశానికి హాజరైన మరో ముఖ్యవక్త ఐఎఫ్‌టియు ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు కొత్త తరహా ఉద్యమాలను నిర్మించేందుకు ఆలోచన చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు మున్ముందు ఎలా ఉన్నప్పటికీ ఒక విశాల ప్రాతిపదికన కార్మిక సంఘాలు ఏకీకృత పోరాటాలకు ముందుండాలని, ఆ దిశగా కార్మిక సంఘాల నాయకులు కార్యాచరణకు ఉపక్రమించాలని కోరారు. ఈ నేపథ్యంలో వచ్చిన ఈ పుస్తకం కార్మిక వర్గానికి మేలు చేస్తుందని ఆయన చెప్పారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక సంఘాలు పాతకాలపు ధోరణి మార్చుకోవటంతోపాటు క్రియాశీల ఐక్య కార్యాచరణకు శ్రీకారం చుట్టాలన్నారు. ఏ రంగాలలో కార్మిక సంఘాలకు అవకాశం లేకుండా పోయిందో వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ హయాంలో లేబర్ కోడ్స్ పేరిట వచ్చిన నాలుగు చట్టాలు కార్మికుల హక్కులను హరించేవిగా ఉన్నాయన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం ఆ వేళ కార్మికులు పోరాడితే, ఈవేళ ఎనిమిది గంటల పని స్థానంలో 12 గంటల పని దినం వచ్చిందని, డబ్బులు వస్తున్నాయన్న ఆశతో కార్మిక వర్గం కూడా రాజీ పడుతుందని అభిప్రాయపడ్డారు. కార్మిక వర్గం ఏమి కోల్పోతుందో తెలియజేసి వాళ్ళందర్నీ ఏకతాటిపై నిలిపేందుకు ఈ మేడే ఉపయోగపడాలని పిలుపు నిచ్చారు.


ఈ నేపథ్యంలో వచ్చిన ఈ పుస్తకం కార్మిక వర్గ చరిత్రను మేడే చరిత్రను తెలియజేయటానికి ఉపయోగపడుతుందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ కార్మిక వర్గానికి గత కాలపు పోరాటాలు ఏమిటో తెలియకపోతే భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకోవడం కష్టమవుతుంద న్నారు. ఈ పుస్తకం ప్రచురించేందుకు వచ్చిన అవకాశం వినియోగించుకుని కాస్త ఆలస్యం అయినా ఈ పుస్తకాన్ని తీసుకొచ్చామని ఆయన చెప్పారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మేడే అంటే చాలా మందికి ఒక ఉత్సవంలో పండగని తెలుసని, ఎనిమిది గంటల పని దినం కోసం కార్మిక వర్గం వెతలు చెందాల్సి వచ్చిందో ఈ పుస్తకం వివరిస్తున్నారు. పుస్తకాన్ని సమీక్షించిన రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని తీసుకురావడం వెనుక చేసిన కసరత్తును వివరించారు. రాబోయే కాలంలో కార్మికవర్గ భవిష్యత్ కార్యాచరణకు ఇటువంటి పుస్తకాలు తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. పుస్తక సంపాదకులు ఆకుల అమరయ్య తాను పుస్తకం తీసుకొచ్చిన నేపథ్యాన్ని వివరించారు. ఈ వ్యాస సంకలనం తీసుకురావడంలో సహకరించిన పీకాక్ క్లాసిక్ సంపాదకుడు ఎ.గాంధీకి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఇతర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సంఘం నాయకులు భద్రం తన సందేశమిస్తూ రచయితలు చిత్తశుద్ధితో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారని అభినందించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి శీలం వెంకటసుబ్బయ్య వందన సమర్పణ చేశారు. ❑




బ్రెయిన్.. బ్లైయిండ్

ప్రశ్న ఏదైనా..







వినబడట్లేదు !

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 2 - Issue No : 8 May 2024

# కొత్త పుస్తకాల స్వీకారం





ప్రతులకు
విశాలాంధ్ర బుక్ హౌస్,
విజయవాడ




ప్రతులకు
నవతెలంగాణ బుక్
హౌస్, హైదరాబాద్




ప్రతులకు..
శ్రీశ్రీ విశ్వేశ్వరరావు
**94906 34849**

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.